ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 15.02.2026 | సంపుటి :12 సంచిక : 207 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# కలిసికట్టుగా పనిచేశాం

రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించాం.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకెళ్లాలి. సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

- మంత్రులు, పార్టీ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్

## బ్రహ్మాండమైన విజయం సాధించాం

## నమ్మకానికి నమ్మకానికి ఫలితాలు నిదర్శనం

## హంగ్ కూడా హస్తగతం కావాలి



- మంత్రులు, కాంగ్రెస్ సీనియర్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- కార్పొరేషన్లు, మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలపై చర్చ
- మేయర్,ఛైర్మన్ పీఠాల కైవసానికి కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం
- ముఖ్యమంత్రితో రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి భేటీ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లోని మల్కాజిగిరి క్యాంపు కార్యాలయంలో మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు.. తదుపరి కార్యాచరణపై చర్చించనున్నారు. ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చ జరిగింది వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలు 'హస్త'గతం అవుతాయని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. కాగా మున్సిపల్ ఎన్నికల ఫలితాల తరవాత సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లోని సిఎం క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు, ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చ మిగతా 2లో..

### 'పుర'పోరులో హస్తానిదే పైచేయి

కాంగ్రెస్‌కు 39.08%, బీఆర్‌ఎస్‌కు 28.75%, భాజపాకు 15.67%
స్వతంత్రులకు 8.30% పోలైన ఓట్లు

## కాంగ్రెస్ ఖాతాలోకి వడ్డేపల్లి మున్సిపాలిటీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన కౌన్సిలర్లు

హైదరాబాద్(జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మిగతా 2లో..



## కొత్తగూడెం మేయర్ పీఠంపై వీడిన ఉత్కంఠ

- జట్టు కట్టిన కాంగ్రెస్, సీపీఐ వార్త 2లో
- మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను చెరో రెండున్నరేళ్ల చొప్పున పంచుకోవాలని నిర్ణయం

# అర్వింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు ఓకే

### ఐఏఎస్ అధికారి విచారణకు కేంద్రం అనుమతి

### ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం



హైదరాబాద్(జనంసాక్షి):ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం అనుమతి ఇచ్చింది. మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గతంలోనే గవర్నర్ అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ-కార్ రేస్ కేసులో త్వరలో ఏసీబీ ఛార్జిషీట్ దాఖలు చేయనుంది. హైదరాబాద్‌లో 2023లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేస్ కోసం విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా సొమ్ము చెల్లించడం వల్ల ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసింది. అయితే పురపాలక శాఖ మంత్రి హోదాలో కేటీఆర్ ఆదేశించడంతోనే తాము నిధులు విడుదల చేసినట్లు అప్పట్లో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన అర్వింద్‌కుమార్ ఇదివరకే ప్రభుత్వానికి లిఖితపూర్వక వాంగ్మూలం ఇవ్వడంతోపాటు ఏసీబీ విచారణలోనూ అంగీకరించారు.

# త్వరలో రైతుభరోసా

## నిధుల విడుదలకు రంగం సిద్ధం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు శుభవార్త చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6వేల చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా నిర్ణయం చేసినట్లు తెలుస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సిఎం రేవంత్ చర్చించే అవకాశం ఉంది. అలాగే



జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.

# హంగ్ వచ్చిన చోట బీఆర్‌ఎస్‌కే అనుకూలం

- మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు
- ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే
- అయినా గణనీయంగా మా బలాన్ని పెంచుకున్నాం
- మీడియాతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్స్‌అఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. ఫార్ములా కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఐదుసార్లు విచారణకు మిగతా 2లో..



### 'పుర'పోరులో బీఆర్‌ఎస్

# అట్టర్‌ఫ్లాప్

- కాంగ్రెస్ తప్పులను ఎత్తిచూపడంలో ఆ పార్టీ విఫలమైంది
- బీఆర్‌ఎస్, బీజేపీ పొత్తుకు మున్సిపల్ ఎన్నికలు తొలిమెట్టు
- మున్సిపల్ ఎలక్షన్స్ ట్రైలర్ మాత్రమే.. సినిమా మిగిలే ఉంది
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్(జనంసాక్షి): భారత రాష్ట్ర సమితి పూర్తి వైఫల్యం వల్లే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎక్కువ స్థానాలు వచ్చాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. భాజపా, బీఆర్‌ఎస్ పొత్తుకు ఇది తొలి మెట్టుగా భావిస్తున్నట్లు చెప్పారు. గతంలో సీపీఎం, సీపీఐలను తోక పార్టీలు అని ఇప్పుడు తోక పార్టీలకు తోక పార్టీగా బీఆర్‌ఎస్ మారుతోందని అన్నారు. సింగరేణి కుంభకోణంపై సీపీఐ, ఏఐటీయూసీ కనీసం నోరు కూడా విప్పలేదని, కూనంనేని సాంబశివరావు కాళేశ్వరం విషయంలో కేసీఆర్‌పై ఏం మాట్లాడారో కేటీఆర్ గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల మిగతా 2లో..



# చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం

చైనా సరిహద్దులో ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ • అస్సాంలో హైవేపై దిగిన మోదీ విమానం

దిబ్రూగఢ్(జనంసాక్షి):అస్సాంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈశాన్య భారతంలో ఏర్పాటైన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై ప్రధాని మోదీ ప్రయాణిస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ (అ-130ఏ) ల్యాండ్ అయింది. ఈ ఫెసిలిటీ చైనా సరిహద్దుకు 300 కి.మీ దూరంలో ఉంది. ప్రధాని మోదీ దీన్ని నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వాయుసేన ప్రత్యేక విన్యాసాలు ప్రదర్శించింది. ఈ ఫెసిలిటీ గురించి మోదీ ఇప్పటికే ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఈఎల్ఎఫ్ కీలకమని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో దిబ్రూగఢ్ ఎయిర్‌పోర్ట్, చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లలో కార్యకలాపాలు నిర్వహించలేని పరిస్థితి ఉంటే.. ఈ ఈఎల్ఎఫ్‌ను ఒక ప్రత్యామ్నాయంగా వాడతారు. దాంతో సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు.. భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు వీలవుతుంది. టేకాఫ్, ల్యాండింగ్‌కు అనుకూలంగా దీనిని డిజైన్ చేశారు. పశ్చిమ, ఉత్తర, మధ్య భారతంలో ఇప్పటికే ఈ ఈఎల్ఎఫ్‌లు ఉన్నాయి. చైనాతో సరిహద్దు వివాదాల వేళ ఈశాన్య భారతంలో దీన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈశాన్య భారతంలోని అస్సాంలో ఏర్పాటు చేసిన తొలి మిగతా 2లో..

### కాంగ్రెస్ దేశ భద్రతను

## ప్రమాదంలో పడేస్తుంది

### అసోంలో ప్రధాని మోదీ

దిబ్రూగఢ్(జనంసాక్షి):కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనేవారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేయాలని నినాదాలు చేసేవారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని విమర్శించారు. దేశాన్ని విభజించాలను కునేవారే కాంగ్రెస్ ఆరాధకులుగా మిగతా 2లో..

### జవాన్ల ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడికి

## స్ఫూర్తి

పుల్వామా వీరులకు ప్రధాని మోదీ నివాళి 2లో..

### అమెరికాతో ఒప్పందంపై ప్రధాని మోదీ

# భ్రమలు కల్పిస్తున్నారు

## వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారు : రాహుల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రధాని, ఆయన కేబినెట్ మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని ఆయన ఎక్స్‌లో దుయ్యబట్టారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు.ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే




విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం మిగతా 2లో..



## పాక్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల డ్రగ్స్

### డ్రోన్‌తో జారవిడిచినట్లు అనుమానాలు

శ్రీనగర్(జనంసాక్షి):జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారీగా మాదక ద్రవ్యాలు లభించడం కలకలం సృష్టిస్తోంది. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ వీటిని జారవిడిచినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఆర్ఎస్ పురా సెక్టార్‌లో 6.5 కిలోలకు పైగా హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి మిగతా 9లో..

## త్వరలో ఇరాన్ పాలనలో మార్పులుండొచ్చు

### ఆ దేశంపై సైనిక చర్య అంశాన్ని పరిశీలిస్తున్నాం:ట్రంప్



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో యూఎస్ సైన్యం ఇప్పటికే ఇరాన్‌ను చుట్టుముట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై సైనిక చర్య అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఆ దేశంలోని పాలనలో మార్పు జరగడం వల్లే అక్కడి పరిస్థితులు చక్కదిద్దుకుంటాయని.. అదే ఉత్తమ మార్గమని అభిప్రాయపడ్డారు. త్వరలోనే అది కూడా జరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. 47 ఏళ్లుగా చర్చల పేరుతో వారు మాట్లాడుతూనే ఉన్నారని.. ఈలోగా ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ట్రంప్ అన్నారు. ఇకపై ఈ విషయంలో ఆలస్యం చేయదలుచుకోలేదని పేర్కొన్నారు. అయితే నూతన పాలకులను ఇరాన్ ప్రజలే ఎన్నుకుంటారన్నారు. అణు ఒప్పందంపై ప్రస్తుతం ఇరాన్‌తో జరుగుతోన్న చర్చలు విజయవంతమవుతాయని తాను భావిస్తున్నానని.. కానీ అవి విఫలమైన రోజు ఇరాన్ చరిత్రలో ఓ చెడు రోజుగా నిలిచిపోతుందని మిగతా 2లో..

### మా ప్రమాణస్వీకారానికి

# రండి..!

### మోదీకి తారిఖ్ రెహమాన్ ఆహ్వానం



న్యూఢిల్లీ(జనంసాక్షి): బంగ్లాదేశ్‌లో విజయం సాధించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడు, బీఎన్‌పీ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ దేశ నూతన ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సహా పలు దేశాల నేతలను ఆహ్వానించాలని ఆ పార్టీ యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దక్షిణాసియా దేశాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ మోదీ హాజరైతే.. భారత్-బంగ్లా సంబంధాల్లో ఇదొక కీలకమైన పరిణామంగా మారనుంది. 2024 ఆగస్టులో జరిగిన విద్యార్థుల ఉద్యమంలో హసీనా మిగతా 2లో..

# త్వరలో ఇరాన్ పాలనలో మార్పులుండొచ్చు

ట్రంప్ పేర్కొన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సూచించినట్లు తెలిపారు. అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ వి మాన వాహక నౌకలు ఇరాన్ వైపు తరలివ స్తున్న సమయంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడంతో.. ఏ క్షణాన ఏం జరగుతుందోనని పశ్చిమాసియా దేశాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

ఆందోళనలు కొనసాగించండి: యువరాజు రెజా పహ్లవి

ఇరాన్‌లో నిరసనలు మరింత తీవ్రం చేయాలని ప్రవాసంలో తలదాచుకున్న ఆ దేశ యువరాజు రెజా పహ్లవి ప్రజలకు పిలుపునిచ్చారు. నిరసనకారులపై ఇటీవల ప్రభుత్వం చేపట్టిన అణచివేత చర్యలకు వ్యతిరేకంగా ప్రజలంతా వీధుల్లోకి వచ్చి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయాలన్నారు. ఇరాన్ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా ప్రపంచ దేశాలు అండగా ఉంటాయని పేర్కొన్నారు.

# మా ప్రమాణస్వీకారానికి రండి..

ప్రభుత్వం కుప్పకూలిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక సలహా మండలి బంగ్లా పాలనను పర్యవేక్షిస్తూ వచ్చింది. ఆ సమయంలో రెండు దేశాలు దౌత్యపరమైన ఒడుదొడుకులను ఎదుర్కొన్నాయి. ఇదిలా ఉంటే.. బీఎన్‌పీ విజయంపై ఇప్పటికే భారత్ నుంచి సందేశం వెళ్లింది. రెహమాన్‌కు మోదీ ఫోన్ చేసి అభినందించారు. ఆయన నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి ఈ ఎన్నికలు నిదర్శనమని పేర్కొన్నారు. దీనిపై మోదీకి బీఎన్‌పీ ధన్యవాదాలు తెలిపింది.

# ఐఎస్ఎస్‌కు పయనమైన నలుగురు వ్యోమగాములు

కేప్ కెనావెరాల్(జనంసాక్షి): వైద్యపరమైన అత్యవసర కారణాల వల్ల నలుగురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి అర్ధాంతరంగా భూమికి తిరిగొచ్చిన నేపథ్యంలో వారి స్థానాన్ని భర్తీ చేయడానికి తాజాగా మరో బృందం నింగిలోకి పయనమైంది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన రాకెట్ ద్వారా వారు రోదసిలోకి బయల్దేరారు. వీరిలో అమెరికాకు చెందిన జెస్సికా మెయిర్, జాక్ హాథవే, ఫ్రాన్స్ వ్యోమగామి సోఫీ ఆడెనాట్, రష్యాకు చెందిన ఆండ్రెయ్ ఫెద్యయేవ్‌లు ఉన్నారు. వీరు శనివారం ఐఎస్ఎస్ చేరుకుంటారు. 8-9 నెలల పాటు అక్కడే విధులు నిర్వర్తిస్తారు. వ్యోమగాములు కక్ష్యలోకి చేరగానే.. "ఈ రోజు శుక్రవారం.. 13వ తేదీ. చాలా మంచి రోజు" అని స్పేస్‌ఎక్స్‌కు చెందిన లాంచ్ కంట్రోల్ సందేశం పంపింది. దీనికి కమాండర్ జెస్సికా స్పందిస్తూ.. "ఇది అద్భుత ప్రయాణం" అని బదులిచ్చారు. ఐఎస్ఎస్‌లో ఇప్పటికే ముగ్గురు వ్యోమగాములు ఉన్నారు. గత నెలలో ఒక వ్యోమగామికి అనారోగ్య సమస్య తలెత్తిన సంగతి తెలిసిందే. దీంతో ఆ ఆస్ట్రోనాట్‌తోపాటు మరో ముగ్గురు సహచరులను అత్యవసరంగా భూమికి రప్పించారు. అనారోగ్యంపాలైన వ్యోమగామి ఎవరన్నది అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా వెల్లడించలేదు. పుడమికి చేరాక నలుగురు ఆస్ట్రోనాట్‌లను నేరుగా ఆసుపత్రికి తరలించారు. 65 ఏళ్ల నాసా మానవసహిత అంతరిక్ష యాత్రల చరిత్రలో వైద్య కారణాలతో మిషన్‌ను కుదించాల్సి రావడం అదే మొదటిసారి. తాజా యాత్ర నేపథ్యంలో వ్యోమగాములకు సంబంధించిన వైద్య ప్రక్రియలను సంస్థ సమీక్షించింది. ఇప్పటికే అమల్లో ఉన్న విధానాలతో సంతృప్తి చెందింది. వ్యోమగాములు బయల్దేరడానికి ముందు ఎలాంటి అదనపు వైద్యపరీక్షలు నిర్వహించలేదు. అలాగే కొత్త వ్యాధి నిర్ధారణ పరికరాలనూ పంపలేదు. ఐఎస్ఎస్‌లో ఇప్పటికే ఒక అల్ట్రాసౌండ్ యంత్రం ఉంది. గత నెలలో అనారోగ్యంపాలైన వ్యోమగామిని దాని సాయంతోనే పరీక్షించారు.

# పన్నూ హత్యకు కుట్ర..

## నేరాన్ని అంగీకరించిన భారతీయుడు..!

**ఒట్టావా(జనంసాక్షి):**ఖలిస్థానీ ఉగ్రవాది, నిషేధిత సిఖ్స్ ఫర్ జస్టిస్ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నిన కేసులో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తా పై అభియోగాలు దాఖలైన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాన్‌హటన్‌లోని ఫెడరల్ కోర్టులో నిఖిల్ గుప్తా తన నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు అమెరికా అటార్నీ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. దాని ప్రకారం.. గురువారం గుప్తా యూఎస్ మెజిస్ట్రేట్ జడ్జి సారా నెట్‌బర్న్ ముందు హాజరయ్యారు. ఈ క్రమంలో కిరాయి తీసుకొని పన్నూని హత్య చేయడానికి ఒప్పుకోవడం, దానికి ప్లాన్ చేయడంతో పాటు మనీలాండరింగ్ కుట్ర వంటి మూడు నేరారోపణలను అతడు అంగీకరించాడు. వీటన్నింటికీ కలిపి అతడికి 40 ఏళ్లకు పైగా జైలు శిక్ష పడనున్నట్లు తెలుస్తోంది. ఈ కేసుపై మే 29న న్యాయస్థానం శిక్ష విధించనుంది. తాజా పరిణామాలపై గుప్తా తరఫు న్యాయవాదులు ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని భగ్నం చేశామని గతంలో అగ్రరాజ్యం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కుట్ర కేసులో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తా ప్రమేయం ఉందంటూ అమెరికా అటార్నీ కార్యాలయం ఆరోపించింది. ఇందుకోసం అతడికి ఓ భారత ప్రభుత్వ అధికారి నుంచి ఆదేశాలు అందాయని ఆరోపణలు చేసింది. ఈ క్రమంలోనే చెక్ రిపబ్లిక్ అధికారులు గుప్తాను అరెస్టు చేశారు. ఆ తర్వాత అమెరికా ఒత్తిడి నేపథ్యంలో అతడిని అగ్రరాజ్యానికి అప్పగించారు. భారత ప్రభుత్వాధికారిపై అమెరికా చేసిన ఆరోపణలను కేంద్రం తీవ్రంగా ఖండించింది. ఈ కేసులో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కాగా, తాజా పరిణామాలపై భారత్ ఇప్పటివరకు స్పందించలేదు.

# మున్సిపల్ ఫలితాలు.. పార్టీల్లో చేరుతున్న స్వతంత్రులు

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎన్నికల్లో గెలిచిన పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమకు నచ్చిన పార్టీల్లో చేరుతున్నారు. ఇంద్రేశం మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ లావణ్య, ఇస్నాపూర్ 10వ వార్డు కౌన్సిలర్ రాహుల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. మరోవైపు నారాయణపేట పదో వార్డు స్వతంత్ర కౌన్సిలర్ జయశ్రీ భాజపాలో చేరారు. హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సమక్షంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. నారాయణపేటలో మొత్తం 24 స్థానాలకు భాజపా 11 స్థానాలు గెలుచుకుంది. స్వతంత్ర అభ్యర్థి చేరికతో భాజపా సభ్యుల సంఖ్య 12కి చేరింది. దీంతో నారాయణపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికలో ఎక్స్ అఫిషియో ఓటు కీలకం కానుంది.ఇప్పటికే బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, భాజపాకు చెందిన ఒక కౌన్సిలర్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ మొత్తం 34 స్థానాలు ఉండగా.. కాంగ్రెస్‌కు 14, బీఆర్ఎస్‌కు 14, స్వతంత్రులకు 5, భాజపాకు 1 స్థానం దక్కాయి. దీంతో ఆ పార్టీ బలం 17కు చేరింది. ఈ నెల 16న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు.

# 'ఎన్సీపీ'ల విలీనం లేనట్లే!

**జనంసాక్షి:**వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ పోటీ చేసే యోచనలో ఉన్నట్లు శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ వెల్లడించారు. ఈ అంశంపై మహారాష్ట్రలో విపక్ష కూటమి మహావికాస్ అఘాడీ చర్చలు జరుపుతోందన్నారు. దివంగత డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ (ఎస్పీ)లు విలీనమయ్యే అవకాశాలు దాదాపుగా లేనట్లేనని అన్నారు.దేశంలో అత్యంత సీనియర్ నాయకుల్లో ఒకరైన శరద్ పవార్ దాదాపు 60ఏళ్లకుపైగా చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని రౌత్ పేర్కొన్నారు. వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేస్తానని పవార్ చెప్పారని, దీనిపై కూటమిలోని మూడు పార్టీలు నిర్ణయం తీసుకుంటాయన్నారు. వచ్చే ఏప్రిల్‌లో పవార్ సహా మరో ఏడుగురు రాజ్యసభ నుంచి పదవీ విరమణ కానున్నారు.

# కలిసికట్టుగా పనిచేశాం

జరగనుంది. వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలు 'హస్త'గతం అవుతాయని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ సమావేశానికి పలువురు సీనియర్ నేతలూ హాజరయ్యారు. ఇకపోతే తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎన్నికల్లో గెలిచిన పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమకు నచ్చిన పార్టీల్లో చేరుతున్నారు. ఇంద్రేశం మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ లావణ్య, ఇస్నాపూర్ 10వ వార్డు కౌన్సిలర్ రాహుల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. మరోవైపు నారాయణపేట పదో వార్డు స్వతంత్ర కౌన్సిలర్ జయశ్రీ భాజపాలో చేరారు. హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సమక్షంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. నారాయణపేటలో మొత్తం 24 స్థానాలకు భాజపా 11 స్థానాలు గెలుచుకుంది. స్వతంత్ర అభ్యర్థి చేరి కతో భాజపా సభ్యుల సంఖ్య 12కి చేరింది. దీంతో నారాయణపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికలో ఎక్స్ అఫిషియో ఓటు కీలకం కానుంది. ఇప్పటికే బెల్లం పల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, భాజపాకు చెందిన ఒక కౌన్సిలర్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ మొత్తం 34 స్థానాలు ఉండగా.. కాంగ్రెస్‌కు 14, బీఆర్ఎస్‌కు 14, స్వతంత్రులకు 5, భాజపాకు 1 స్థానం దక్కాయి. దీంతో ఆ పార్టీ బలం 17కు చేరింది. ఈ నెల 16న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు.

రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి భేటీ

సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తాజా పరిణామాలు, కొత్తగూడెం కార్పొరేషన్ గురించి చర్చించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ కూటమి (కాంగ్రెస్-22, సీపీఎం-1) 23 డివిజన్లలో విజయం సాధించింది. సీపీఐకి 22, బీఆర్ఎస్-8, భాజపా-1, స్వతంత్రులు 6 డివిజన్లలో గెలుపొందారు. స్వతంత్రుల్లో ఒకరు సీపీఐ నాయకుడు కావటంతోస్వతంత్రుల్లో ఒకరు సీపీఐ నాయకుడు కావటంతో ఆ పార్టీ బలం కూడా 23కు చేరింది. మిగిలిన ఐదుగురు స్వతంత్రుల్లో ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారిలో ముగ్గురు హస్తం గూటికి చేరటంతో కాంగ్రెస్ కూటమి బలం 29కు పెరిగింది. మేయర్ ఎన్నిక సమయంలో కాంగ్రెస్, సీపీఐ కలిసి నడుస్తాయా.. లేదా విడివిడిగా ప్రయత్నిస్తాయా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# అమెరికా ఒప్పందంపై ప్రధాని, మంత్రులు భ్రమలు కల్పిస్తున్నారు

అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్? గాంధీ విమర్శించారు.గత వారం భారత్?-అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో యూఎస్? పారిశ్రామిక వస్తువులు, విస్తృత శ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడం వంటివి ఆ ఒప్పందంలో ఉన్నాయి. వీటిలో పశుగ్రాసం కోసం ఎర్ర జొన్న, చెట్ల గింజలు, తాజా ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్, అదనపు ఉత్పత్తులు ఉన్నాయి.ప్రతిగా, యునైటెడ్ స్టేట్స్ వస్త్రాలు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు, సేంద్రీయ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు వంటి ఎంపిక చేసిన భారతీయ వస్తువులపై 18 శాతం సుంకాలను వర్తింపజేయనుంది. అయితే ఒప్పందం పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత, జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వజ్రాలు, విమాన భాగాలు వంటి వస్తువులపై అమెరికా విధించిన సుంకాలు తొలగిపోనున్నాయి.

# 'పుర'పోరులో బీఆర్ఎస్ అట్టర్‌ప్లాఫ్



నేపథ్యంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎన్ని మున్సిపాల్టీలను కోల్పోయిందో ఆలోచించాలని, నిజామాబాద్ సహా అన్ని చోట్లా పూర్తిగా కేడర్‌ను వదిలిపెట్టిందని కవిత విమర్శించారు. కేటీఆర్, మాజీ మంత్రులు ఎన్ని చోట్ల ప్రచారం చేశారు? కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఎక్కడ పోరాటం చేస్తోందని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీ మొదటి స్థానంలో.. బీఆర్ఎస్ పార్టీ కొన్ని చోట్ల మూడో స్థానంలో, మరి కొన్ని చోట్ల నాలుగో స్థానంలో నిలిచిందని చెప్పారు. కరీంనగర్‌లో మినహాయిస్తే భాజపా ఎక్కడా లేదని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు 40కిపైగా స్థానాల్లో జాగృతి, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులను గెలిపించారని, వద్దేపల్లిలో తమకు పూర్తి ఆధిక్యం వచ్చినా అధికార పార్టీ, ఇతరులు ప్రలోభాలకు గురి చేశారని కవిత ఆరోపించారు. 16 మున్సిపాలిటీలు రావడమే ఎక్కువ అన్నట్లుగా కేటీఆర్ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ పరిస్థితుల్లో తమ లాంటి వాళ్లను ప్రజలు ఆదరిస్తారన్న విశ్వాసం కలుగుతోందని కవిత తెలిపారు. తానే రాజు - తానే మంత్రి అంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. ముందు హామీల అమలుపై దృష్టి సారించాలని కోరారు. తమది ట్రైలర్ మాత్రమేనని, పిక్చర్ ఇంకా మిగిలే ఉందని చెప్పారు. తొందరపడి కారు కూతలు కూయవద్దని, తప్పులను సరిదిద్దుకొని ప్రజల్లో ఉండాలని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు సూచించారు. సింగరేణి ఎన్నికల్లో జాగృతి, హెచ్ఎంఎస్ కలిసి పోటీ చేసి సత్తా చాటుతామని కవిత తెలిపారు.

# కాంగ్రెస్ ఖాతాలోకి వద్దేపల్లి మున్సిపాలిటీ

వద్దేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కౌన్సిలర్లు కుర్వ పావని, శారద, మంజుల, యుగేందర్‌రెడ్డి, దేవమ్మ, విజయ్‌భాస్కర్, జయశ్రీ, తిమ్మప్ప నగరానికి చేరుకొని సీఎంతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తాము కాంగ్రెస్ పార్టీలో చేరట్లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే సీఎంను కలిసినట్లు చెప్పారు. అభివృద్ధికి సహకరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.


# హంగ్ వచ్చిన చోట బీఆర్ఎస్‌కే అనుకూలం

పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.

# 'పుర'పోరులో హస్తానిదే పైచేయి

**కాంగ్రెస్‌కు 39.08%, బీఆర్ఎస్‌కు 28.75%, భాజపాకు 15.67% స్వతంత్రులకు 8.30% పోలైన ఓట్లు**

హైదరాబాద్(జనంసాక్షి):



తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 50 శాతానికి పైగా వార్డుల్లో కాంగ్రెస్ ఆధిక్యత కనబర్చిన విషయం తెలిసిందే. అయితే.. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎంత శాతం మేర ఓట్లు నమోదయ్యాయో ఎన్నికల అధికారులు వెల్లడించారు. మొత్తంగా కాంగ్రెస్‌కు 39.08 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు. బీఆర్ఎస్‌కు 28.75 శాతం, భాజపాకు 15.67 శాతం, స్వతంత్రులకు 8.30 శాతం, ఎంఐఎంకు 3.28 శాతం, ఫార్వర్డ్ బ్లాక్‌కు 1.5 శాతం, సీపీఐకి 1.3 శాతం, సీపీఎంకు 0.5 శాతం, జనసేనకు 0.3 శాతం ఓట్లు నమోదైనట్లు పేర్కొన్నారు. 116 మున్సిపాలిటీల్లోని 2,582 వార్డుల్లో ఎన్నికలు జరిగాయి. వీటిలో కాంగ్రెస్ 1,347 వార్డుల్లో విజయం సాధించి 66 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ 717 వార్డుల్లో గెలుపొంది 13 మున్సిపాలిటీలు దక్కించుకుంది. భాజపా 261 వార్డుల్లో, స్వతంత్రులు 256 వార్డుల్లో విజయం సాధించారు. 36 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మిగతా చోట్ల హంగ్ ఏర్పడటంతో ఆయా కార్పొరేషన్ల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# కొత్తగూడెం మేయర్ పీఠంపై వీడిన ఉత్కంఠ

- **జట్టు కట్టిన కాంగ్రెస్, సీపీఐ**
- **మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను చెరో రెండున్నరేళ్ల చొప్పున పంచుకోవాలని నిర్ణయం**

హైదరాబాద్(జనంసాక్షి):కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ పీఠంపై ఉత్కంఠ వీడింది. కాంగ్రెస్, సీపీఐ ఒక అవగాహనకు వచ్చాయి. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను చెరో రెండున్నరేళ్ల చొప్పున పంచుకోవాలని నిర్ణయించాయి. మొదటి రెండున్నరేళ్లు సీపీఐకి, ఆ తర్వాత కాంగ్రెస్‌కు మేయర్ పీఠం దక్కనుంది. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి (కాంగ్రెస్-22, సీపీఎం-1) 23 డివిజన్లలో విజయం సాధించింది. సీపీఐకి 22, బీఆర్ఎస్-8, భాజపా-1, స్వతంత్రులు 6 డివిజన్లలో గెలుపొందిన విషయం తెలిసిందే.

# కరీంనగర్ మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశాం


బండి సంజయ్

హైదరాబాద్: అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని భాజపాని మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని చూసినా.. ప్రజలు మాత్రం తమని ఆశీర్వదించారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. అత్యధిక స్థానాలు చేజిక్కించుకున్న తామే కరీంనగర్ మేయర్ పీఠం పక్కా ప్లాన్‌తో వ్యూహాత్మకంగా దక్కించుకోబోతున్నామని స్పష్టం చేశారు. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తే.. వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం బయట పెడతానని తేల్చి చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అనుసంధానకర్తగా ఎంఐఎం పనిచేస్తుందని ఆరోపించారు. కరీంనగర్‌లో కార్యకర్తల కష్టం, ప్రధాని మోదీ ఆశీస్సులతో గెలవడం సంతోషంగా ఉందని కేంద్రమంత్రి హర్షం వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు భాజపాలో చేరారని, మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశామని వెల్లడించారు. మున్సిపల్ పీఠం ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకూ రూ.1,400 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించినందుకు కరీంనగర్ ప్రజలకు బండి కృతజ్ఞతలు చెప్పారు.ఎంఐఎం రివైవల్ డే నిర్వహించడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. దేనికోసం రివైవల్ డే చేస్తున్నారని ప్రశ్నించారు. రజాకర్ల రాజ్యం తెస్తారా.. మహిళలను కించపరిచి బతుకమ్మ ఆడిస్తారా.. పాత రాజ్యం తెస్తామని ఎంఐఎం రివైవల్ డే చేస్తుందా? అని నిలదీశారు. వారి ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. ఎంఐఎం ప్రాబల్యం ప్రతి ఎన్నికల్లో తగ్గుతుందని, భాజపా బలపడుతూ వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో భాజపా జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. భాజపా అభ్యర్థుల విజయం పట్ల రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.



# జవాన్ల ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తి

**పుల్వామా వీరులకు ప్రధాని మోదీ నివాళి**



న్యూఢిల్లీ(జనంసాక్షి):పుల్వామా ఘటనలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు నివాళులు అర్పించిన ఉపరాష్ట్రపతి, ప్రధాని- ధీరుల త్యాగం దేశ చరిత్రలో నిలిచిపోతుందన్న ఉపరాష్ట్రపతి2019లో జరిగిన పుల్వామా దాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల ధైర్యం, దేశభక్తి ప్రతి భారతీయుడికి ఇప్పటికీ స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.'2019లో ఈ రోజున పుల్వామాలో ప్రాణాలు అర్పించిన వీర సైనికులను స్మరించుకుంటున్నాను. వారి సేవ, సంకల్పం, దేశభక్తి ఎప్పటికీ మనందరి జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. వారి అసమాన ధైర్యసాహసాల నుంచి ప్రతి భారతీయుడు స్ఫూర్తిని పొందుతాడు' అని ప్రధాని మోదీ పోస్ట్‌లో రాసుకొచ్చారు.అంతకుముందు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ కూడా నివాళులు అర్పించారు. పుల్వామా ఉగ్రదాడిలో వీరమరణం పొందిన ధీరుల త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. బలమైన, సురక్షితమైన భారతదేశాన్ని నిర్మించడానికి వారి త్యాగం మనకు నిరంతరం స్ఫూర్తినిస్తుందని చెప్పారు. పలువురు కేంద్ర మంత్రులు కూడా నివాళులర్పించారు.

**నివాళులు అర్పించిన రాహుల్**

కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా వీర జవాన్లకు నివాళులర్పించారు. 2019 పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన మన వీర సైనికులకు నివాళులు అర్పిస్తున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వారి అత్యున్నత త్యాగానికి దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని రాసుకొచ్చారు.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జు ఖర్గే పుల్వామా అమరవీరులకు నివాళ్లు అర్పించారు. పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత మాత అమరవీరులకు ప్రగాఢ నివాళులు అర్పిస్తున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వారి ధైర్యం, దేశభక్తి మనందరి ఎప్పటికీ నిలిచిపోతాయని అన్నారు. వారి త్యాగం ఎప్పటికీ మరచిపోలేమని ఖర్గే పోస్టులో రాసుకొచ్చారు.

**ఏడేళ్లు పూర్తి**

2019 ఫిబ్రవరి 14న జరిగి పుల్వామా దాడి దేశ చరిత్రలోనే అత్యంత ఘోర ఉగ్రదాడుల్లో ఒకటి. ఈ దాడి జరిగింది శనివారం నాటికి ఏడేళ్లు పూర్తయ్యాయి. అమర వీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 14ను బ్లాక్ డేగా పిలుస్తున్నారు. శ్రీనగర్- జమ్ము రహదారిపై సీఆర్‌పీఎఫ్ బలగాలు ప్రయాణిస్తున్న కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి జరిగింది. ఒక ఆత్మాహుతి బాంబర్ పేలుడు పదార్థాలు నిండిన కారుతో జవాన్ల వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో యావత్ దేశం ఒక్కసారిగా ఉలిక్కిప డింది.ఈ ఉగ్రదాడికి పాకిస్థాన్ హస్తం గల ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ బాధ్యత వహించింది. ఈ దాడికి ప్రతీకారంగా బాలాకోట్‌లో ఉగ్రమూకలపై భారత్? మెరుపు వైమానిక దాడులు చేసింది. అంతేకాకుండా ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంది. సరిహద్దు భద్రత కట్టుదిట్టం చేసింది. అంతర్జాతీయ వేదికల్లో ఉగ్రవాదంపై చర్చలు ముమ్మరం చేసింది.ఈ కేసుకు సంబంధించి ఎన్ఐఏ 2020లో 18 మంది నిందితులపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. వీరిలో కొంతమంది నిందితులను అధికారులు అరెస్టు చేశారు. వీరు పాకిస్థానీ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించినట్లు అభియోగాలు ఉన్నాయి. ఉగ్రదాడిలో పాల్గొన్న కొందరు పోలీసులు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు పరారీలో ఉన్నారు.ఈ దాడికి కారణమైన నిందితుల్లో మరొకరు 2024లో గుండెపోటుతో మరణించాడు. పుల్వామాలో సీఆర్పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌పై ఉగ్రదాడి జరిగిన ఘటనలో 18 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. వీరిలో జమ్ముకశ్మీర్‌లోని కాకాపోరాకు చెందిన బిలాల్ అహ్మద్ కుచేయ్ కూడా ఒకడు. జవాన్ల మృతికి సంబంధించిన కేసులో బిలాల్ జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో తీవ్ర అనారోగ్యానికి పాలైయ్యాడు. దీంతో 2024 సెప్టెంబర్ 17న అతడిని అధికారులు జమ్ముకశ్మీర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో అతనికి గుండెపోటు రాగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# కాంగ్రెస్ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుంది

మారుతారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ముస్లిం లీగ్ దేశాన్ని విభజించిందని, ఇప్పుడు నేటి కాంగ్రెస్ 'ముస్లిం లీగ్ మావోయిస్టు కాంగ్రెస్'గా మారిందని దుయ్యబట్టారు. అందుకే కాంగ్రెస్ పట్ల అసోం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసోం ఆకలితో అలమటించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. అలాగే భయం గుప్పిట్లో ఉందన్నారు. అభివృద్ధి కోసం నిధులు ఇవ్వకుండా తప్పించుకునే హస్తం పార్టీ అసోంను అభివృద్ధి చేయగలదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కేంద్రం నుంచి అసోం పన్ను వాటాగా రూ.10,000 కోట్లు మాత్రమే అందుకునేదన్నారు. ఇప్పుడు బీజేపీ సర్కార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కన్నా 5 రెట్లు ఎక్కువను పన్ను వాటాగా అందుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విస్మరించిన ఈశాన్య ప్రాంతాలకు తాము భక్తితో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ హయాంలో 3జీ, 4జీ టెక్నాలజీ వచ్చిందని, అలాగే 2ఉ స్కామ్ కూడా వచ్చిందని మోదీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో ఎయిమ్స్‌ల గురించి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో అసోంలో హింస, వేర్పాటువాదం ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలో ఎన్?డీఏ సర్కార్ శాంతి, శ్రేయస్సు, వేగవంతమైన అభివృద్ధి అనే సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఒకప్పుడు బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన అసోంలో ఇప్పుడు శాంతి నెలకొందన్నారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఈశాన్య ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని మోదీ మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్?డీఏ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తుందని అన్నారు. అసోంలో మౌలిక సదుపాయాల పెంపుదలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాంగ్రెస్ భారత్‌ను ఒక దేశంగా పరిగణించడానికి కూడా నిరాకరిస్తుందని, భారతమాత పట్ల కనీస గౌరవం కూడా చూపదని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తగా ఉండటం తన జీవితంలోని గొప్ప గౌరవం అన్నారు.

రాబోయే ఐదేళ్లు అసోంకు కీలకం : ప్రధాని మోదీ


"2014 నాటికి దేశంలో కేవలం 6 ఎయిమ్స్‌లు మాత్రమే ఉన్నాయి. ఆ ఏడాదే దేశానికి సేవ చేసే అవకాశాన్ని ప్రజలు నాకు ఇచ్చారు. ఆ తర్వాత కాలంలో ఎయిమ్స్‌ల సంఖ్య భారీగా పెరిగింది. బీజేపీ సర్కార్ గువాహటిలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసింది.

# అస్సాంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం

ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై ప్రధాని మోదీ విమానం ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. దిబ్రూగఢ్-మోరాన్ జాతీయ రహదారిపై ఉన్న రన్‌వే.. భారత్-చైనా సరిహద్దుకు దగ్గరగా ఉండటంతో కీలక, వ్యూహాత్మక ప్రదేశంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో పౌర, సైనిక విమానాల రాకపోకలు సాగించేందుకు వీలుగా ఈ రన్‌వేను నిర్మించారు.అస్సాంలోని చబువా వైమానిక స్థావరానికి సమీపంలో ఉన్న ఈ రన్‌వే.. చైనా సరిహద్దుకు దాదాపు 300 కి.మీ దూరంలో, మయన్మార్‌కు 200 కి.మీ దూరంలోనే ఉంటుంది. అందుకే వ్యూహాత్మకంగా ఎంతో కీలకంగా మారింది. ఈ 4.2 కి.మీ ఈఎల్ఎఫ్ నిర్మాణానికి దాదాపు రూ.100 కోట్లు ఖర్చు చేశారు. సైనిక సంసిద్ధత, విపత్తు సమయాల్లో రెస్క్యూ ఆపరేషన్లతోపాటు అత్యవసర పరిస్థితుల్లో వేగంగా బలగాలను మోహరించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి రన్‌వేను అందుబాటులోకి తేవడం ఇదే తొలిసారి.

## మేయర్ పీఠంపై కాంగ్రెస్ పార్టీకి మార్గం సుగమం

- ఎంఐఎంతో దోస్తీకి సిద్ధం
- డిప్యూటీ మేయర్ వారికే..
- సీఎం రేవంత్ రెడ్డితో పీసీసీ చీఫ్ కీలక భేటీ



నిజామాబాద్ ఫిబ్రవరి 14 (జనంసాక్షి) : నిజామాబాద్ కార్పొరేషన్ లో మేయర్ పదవి కాంగ్రెస్ పార్టీకి దక్కే అవకాశానికి మార్గశీ సుగమమైంది. మేయర్ పదవి రేస్ లో ఉండడం లేదన్న భారతీయ జనతా పార్టీ నిర్ణయంతో మేయర్ పీఠంపై నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోయింది. అయితే కాంగ్రెస్ పార్టీలో ఎవరిని మేయర్ పీఠం వరిస్తుందోనన్న ఉత్కంఠ తెరపైకి వచ్చింది. ముందుగానే మేయర్ అభ్యర్థిని ప్రకటించినప్పటికీ ఎన్నికల్లో ఆమె ఓటమి చెందడంతో కొత్త అభ్యర్థిని ఎంపిక కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారింది. పార్టీ నుండి గెలుపొందిన మహిళలు మేయర్ రేసులో ఉన్నట్లు సమాచారం. మేయర్, డిప్యూటీ మేయర్ , ఎంఐఎం తో పొత్తు విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శనివారం అత్యవసరంగా భేటీ అయ్యారు. నిజామాబాద్ కార్పొరేషన్ పై సీఎం, పీసీసీల మధ్య కీలక చర్చలు జరిగినట్లు సమాచారం. కార్పొరేషన్ లో 41 వ డివిజన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన పూజిత గౌడ్, 9వ డివిజన్ నుండి గెలుపొందిన కేతావత్ సురేఖ, 12వ డివిజన్ నుండి గెలుపొందిన అరుంధతి, 21వ డివిజన్ నుండి విజయం సాధించిన పంచ రెడ్డి లలితలు , 33వ డివిజన్ నుండి గెలిచిన పర్వా ఖాన్, 49 వ డివిజన్ నుండి గెలుపొందిన కూరగాయల ఉమారాణి, 59వ డివిజన్ కు చెందిన రఫత్ పర్వీన్, 60 డివిజన్లో గెలుపొందిన అసరా నజ్రిన్ లు మేయర్ పదవి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. నిజామాబాద్ కార్పొరేషన్ మహిళా జనరల్ కావడంతో కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన మహిళ కార్పొరేటర్లు ఎవరికివారు తమ తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అయితే హై కమాండ్ ఎవరి వైపు మొగ్గు చూపుతోందనేది ఆసక్తికరంగా మారింది. ఈనెల 16న జరగనున్న మేయర్ ఎన్నికల్లో అభ్యర్థిని పేరును సీల్డ్ కవర్లో ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. అప్పటివరకు మే అభ్యర్థిని పేరు రహస్యంగా ఉంచే విధంగా కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆశీస్సులు ఎవరికి ఉంటే వారే మేయర్ పీఠంపై కూర్చుండే అవకాశాలున్నాయి.

## పుల్వామా సంఘటన దేశానికి బాధాకరం



- టిఆర్పీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ
- అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలి
- టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా

కరీంనగర్ (జనంసాక్షి) : 2019 ఫిబ్రవరి 14 రోజున తేదీని వినగానే ప్రతి భారతీయుల రక్తం ఉడుకుతుంది. ఈ రోజు జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై పుల్వామా జిల్లాలో, జైషే-మహ్మద్ ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో అమరులైన 40 మంది మన దేశ వీర జవాన్లు అమరులైన వారికి కరీంనగర్ జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా కొవ్వొత్తులతో జిల్లా కేంద్రంలో ఉద్యోగ విరమణ పొందిన ఆర్మీ జవాన్లతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి ఘన నివాళు లర్పించారు. అనంతరం మీడియా తో రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ సుమారు 2500 మందికి పైగా జవాన్ల కన్వయ్లు వెళ్తుండగా, పేలుడు పదార్థాలతో నిండిన కారును ఉగ్రవాదులు జవాన్ల బస్సును ఢీకొట్టి ఆ ప్రాంతమంతా కన్నీటి కడలిగా మార్చడం దేశానికి చాలా బాధాకరమని అన్నారు. దేశ రక్షణ సేవలో మరణించిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని అన్నారు. యుద్ధంలో సైనికులు మరణించకుండా సకల సౌకర్యాలు ప్రభుత్వాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, రిటైర్డ్ ఆర్మీ జవాన్లు సయ్యద్ షాహిద్ హుస్సేన్, సత్యనారాయణ రెడ్డి, ఎస్వీ బాబు, బాలయ్య, ఎండి శన్నా, టిఆర్పీ పార్టీ జిల్లా , మండల, టౌన్ నాయకులు ఎండి వాజిద్, చాంద్ పాషా, రాకేష్, ఎగుర్ల రమేష్, అంకుశవలి, ఇశ్రాత్ శావాలి, జింక లావణ్య, భోగ భాస్కర్, ఓర్సు రాజు, చిగుర్ల మోహన్, శేఖర్, విమల, చిత్ర, మంగ, మహబూబ్ అలీ, గణేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ మారినా తప్పని ఓటమి

- ఓటుతో ప్రజలు దూరం పెట్టిన వైనం



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) : పదవుల కోసం ఇష్టారీతిన పార్టీలు మారిన నేతలకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు గట్టిగా బుద్ధిచెప్పారు. పలు జిల్లాల్లో పార్టీ మారిన వారిని ప్రజలు తిరస్కరించారు. బీఆర్ఎస్ పార్టీలో పదవులు అనుభవించి, అసవరాలు తీరగానే అవతలి పార్టీలకు వెళ్లిన పలువురికి ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు షాకిచ్చారు. నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌కు చెందిన వేంరెడ్డి రాజు గతంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ నుంచి బీఆర్ఎస్ తరఫున కౌన్సిలర్‌గా గెలిచారు. దాంతో అతడికి బీఆర్ఎస్ పార్టీ ఛైర్మన్ పదవి కట్టబెట్టింది. పార్టీలో మున్సిపల్ ఛైర్మన్ పదవి అనుభవించిన అతను ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఆయన తన భార్య వేంరెడ్డి సంధ్యను కౌన్సిలర్‌గా బరిలో దించారు. 16వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన ఆమెను ఏకంగా 374 ఓట్ల తేడాతో ఓడించి రాజుకు దిమ్మతిరిగేలా చేశారు. మెదక్ జిల్లా గజ్వేల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ తరఫున కౌన్సిలర్‌గా గెలిచిన గాడిపల్లి భాస్కర్‌ను ఛైర్మన్ పదవి కూడా వరించింది. 2014 నుంచి 2020 వరకు ఏకంగా ఆరేళ్లు మున్సిపల్ ఛైర్మన్ పదవి అనుభవించాడు. అవసరం తీరిన తర్వాత బీఆర్ఎస్‌ను వదిలేసి బీజేపీలో చేరాడు. ఈ ఎన్నికల్లో ఆయన భార్య గాడిపల్లి కళ్యాణిని బీజేపీ అభ్యర్థిగా బరిలో దించాడు. కానీ ఓటర్లు కళ్లుబైర్లు కమ్మేలా షాకిచ్చారు. ఏకంగా 529 ఓట్ల తేడాతో ఓడించారు. బీఆర్ఎస్ అభ్యర్థి గోలి మమత ఆమెపై ఘన విజయం సాధించారు. ఎన్నికల్లో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ప్రచారం చేసినా బీజేపీ అభ్యర్థికి ప్రయోజనం దక్కలేదు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు ఛైర్మన్ పదవి అనుభవించి, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ అయిన వ్యక్తికి ఓటర్లు బుద్ధిచెప్పారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మున్సిపాలిటీలో మల్లెల రాజశ్రీ బీఆర్ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. ఆ తర్వాత ఛైర్‌పర్సన్ పదవి దక్కింది. బీఆర్ఎస్‌లో పదవి అనుభవించిన మల్లెల రాజశ్రీ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ అయ్యారు. ఈ ఎన్నికల్లో కూడా భీంగల్ మున్సిపాలిటీలోని 9వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. అయితే ఓటర్లు ఆమెకు షాకిచ్చారు. ఆమెపై బీఆర్ఎస్ అభ్యర్థి రవి నీలం 75 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

## ఓట్ల కోసం నోట్ల పంపిణీ.. ఓటమితో వసూళ్లు



- ఇంటింటికి తిరుగుతున్న అభ్యర్థి
- ఒట్టు వేయని ఓటర్ల నుండి డబ్బులు వసూలు
- ఎన్నికల అప్పుడు డబ్బులు అడిగామా?
- అప్పుడు ఇవ్వడం ఏంటి ఇప్పుడు వసూలుకు రావడం ఏంటి ? ప్రశ్నిస్తున్న ఓటర్లు

మంచిర్యాల ప్రతినిధి ఫిబ్రవరి 14 (జనంసాక్షి) : ప్రజాస్వామ్యంలో ఓటు ఒక వజ్రాయుధం అని ఓటు కొనుగోలు చేయడం అలాగే విక్రయించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ఓటుకు నోటు చట్ట విరుద్ధం అనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి కొంతమంది ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థులు గెలిపే లక్ష్యంగా ఓటర్లను మచ్చిక చేసుకోవడం కోసం నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి ఎన్నికల్లో ఓడిన నేపథ్యంలో తిరిగి ఆ ఇచ్చిన డబ్బులు వసూలు చేయడం మంచిర్యాల జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

శనివారంమంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9 డివిజన్‌కు పోటీ చేసిన ఒక పార్టీకి చెందిన అభ్యర్థి డబ్బులు పంపిణీ చేసి ఓటమి చెందిన తర్వాత ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దానికి సంబంధించిన వీడియో చక్కర్లు కొడుతుంది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లు ఉండగా ఎన్నికల ప్రచారాలు ఆర్భాటంగా కొనసాగాయి. అభ్యర్థులందరూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రచారం చేసినట్లు రాజ్యాంగానికి కట్టుబడి పని చేసినట్లు ఎన్నికల కమిషన్ ముందు కొంత ఆర్భాటం చేసినప్పటికీ లోలోన జరిగిన విషయాలు మాత్రం ఎన్నికల తర్వాత బయటికి వస్తున్నాయి. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఒక పార్టీకి చెందిన అభ్యర్థి ఎన్నికల బరిలో పోటీలోకి దిగి విస్తృతంగా ప్రచారం కొనసాగించారు . ఆ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్నికలకు ముందు ప్రతి ఓటర్ కు 3000 రూపాయల పంపిణీ చేసి ఓటు వేయాలని అభ్యర్థించినట్లు సమాచారం. ఓటర్లు డబ్బులు కావాలని అడగకుండా అభ్యర్థుల పోటీలో భాగంగా గెలుపొందాలని లక్ష్యంతో డబ్బులు ఇచ్చి ఓటమి పాలైన తర్వాత అదే అభ్యర్థి , వారి అనుచరులు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒక వార్డులో తిరుగుతూ వసూలు చేస్తుండగా స్థానిక ప్రజలు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కొంతమంది ప్రజలు అయితే అప్పుడు మిమ్మల్ని ఎవరు డబ్బులు ఇవ్వమన్నారు. ఇప్పుడు ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించడం కూడా జరిగింది. ఓటర్లను ఇబ్బంది పెట్టడం సరికాదని కొంతమంది ప్రజలు బాహాటంగానే ప్రశ్నించారు . ఓటు దాని యొక్క విలువ అని ఉపన్యాసాలు ఇచ్చే నాయకులు ఇలా చేయడం ఏంటని స్థానికంగా చర్చ జరుగుతుంది. అభ్యర్థి డబ్బులు తిరిగి వసూలు చేయడం వీడియో వైరల్ అవుతుంది . డబ్బులు తీసుకునే క్రమంలో ఓటర్లతో మాకు ఓటు వేశావా లేదా అని ఒట్టు వేయించుకొని ఓటు వేశానని ఒట్టు వేస్తే డబ్బులు అడగకుండా ఓటు వేసినా వేయలేదని ఒట్టు వేయకపోతే 3000 కరాకండిగా వసూల్ చేయడం విశేషం. ఒక ఇంట్లో రెండు ఓట్ల గాను రూ: 6000 ఇస్తే ఒక ఓటు వేశామని మరొక ఓటు వేయలేదని 3000 రిటర్న్ ఇచ్చినట్లు వీడియోలో స్పష్టంగా తెలుస్తుంది . ఏదేమైనప్పటికీ ఇలాంటి ఘటనలపై ఎన్నికల కమిషన్ సీరియస్ గా తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి సంఘటన జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికంగా చర్చ కొనసాగుతుంది.

## రసకందాయం మున్సి 'పాలిట్రిక్స్'





బెల్లంపల్లి, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) : బెల్లంపల్లి మున్సిపల్ రాజకీయం రసకందాయంలో పడింది. బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో అధికార కాంగ్రెస్ కు 14 సీట్లు, ప్రతిపక్ష బిఆర్ఎస్ కు 14 సీట్లు, స్వతంత్రులకు 4 సీట్లు, బీజేపీకి ఒక సీటు వచ్చింది. బల్దియా చైర్మన్ పీఠంపై కూర్చోవాలంటే స్వతంత్ర కౌన్సిలర్ల మద్దతు తప్పనిసరి కాగా ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు బిఆర్ఎస్ స్వతంత్ర కౌన్సిలర్లను తమవైపు లాక్కోవడానికి శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు స్వతంత్ర కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరుకున్నట్లు సమాచారం కాగా దీనికి భిన్నంగా బిఆర్ఎస్ సైతం 26 వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ ఇప్ప కుమారస్వామి బిఆర్ఎస్ గూటికి చేరుకొని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబి కండువా కప్పుకొని అధికార కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇచ్చారు. 30వ వార్డులో స్వతంత్ర కౌన్సిలర్ సుకేషిని భరద్వాజ్ తండ్రి శంకర్ సింగ్ సైతం కేటీఆర్ సమక్షంలో గులాబి కండువా కప్పుకున్నారు. వీరితో పాటు ఏకైక బీజేపీ కౌన్సిలర్ గులాబి కండువా కప్పుకోనప్పటికి బిఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు కేటీఆర్ సమక్షంలో ప్రకటించాడు. ఇలా బెల్లంపల్లి మున్సిపాలిట్రిక్స్ రసకం దాయంలో పడ్డాయి. కాగా అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం ముఖ్య అనుచరులు ఇద్దరు పోటీ పడుతున్నట్లు సమాచారం. కాగా చైర్మన్ పదవి నాకంటే, నాకంటూ ఇద్దరు ఒకే పట్టుపై ఉన్నట్లు సమాచారం. ఒకవేళ ఒకరికి ప్రకటిస్తే మరొకరు తమ వర్గ కౌన్సిలర్లతో బిఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి అయినా చైర్మన్ పదవి దక్కించుకోవాలని పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే నిశ్శబ్ద వైఖరి వల్లే కౌన్సిలర్లు ఇలా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని పట్టణ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పార్టీలోని సీనియర్లకు టికెట్ ఇవ్వకుండా, కొందరికి ఇచ్చినా ఇంటెలిజెన్స్ సర్వే పేరుతో అప్పటికప్పుడు టికెట్ వేరే వారికి కేటాయించడం వల్ల ఏకపక్షంగా సాగాల్సిన ఎన్నికలు, ఇలా నువ్వా నేనా అనే రీతిలో సాగాయని, రెబెల్స్ దెబ్బ వల్ల 34 స్థానాలకు 14 స్థానాలతో మాత్రమే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది స్వయంకృత పరాభవమేనని వారంటున్నారు. చివరి క్షణం వరకు ఎవరు బల్దియా బాస్ అవుతారో అని పట్టణ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## కాళోజీ కళాక్షేత్రంలో అంతరిక్షంలోకి మోడల్ రాకెట్

- ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డే సందర్భంగా అంతరిక్షంలోకి మోడల్ రాకెట్ : ఇనగాల



హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 14 (జనం సాక్షి) : ఈనెల ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డే సందర్భంగా ఇస్రో స్పేస్ ట్యూటర్, ఏటిడిఆర్ఎల్ స్పేస్ రీసెర్చ్ ల్యాబ్ నేతృత్వంలో వరంగల్ చరిత్రలోనే తొలిసారిగా, కాకతీయ వీరనారి గౌరవార్థం 'రుద్రమ వి.01'గా నామకరణం చేసిన మోడల్ రాకెట్‌ను హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రయోగించటం, అవగాహన సదస్సు సందర్భంగా విద్యార్థులలో సైన్స్, అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంచడం, వరంగల్‌ను స్పేస్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడం కోసం వరంగల్ కుడా ఆధ్వర్యంలో కూడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఈ 'ఎక్స్ ప్లోరా ప్రాజెక్ట్ ను ఏర్పాటు చేయుటకు చొరవ తీసుకున్నారు. యువతను ఖగోళం, అంతరిక్ష శాస్త్రాల వైపు ప్రోత్సహించడం, వారికి ఆస్ట్రానమీ గురించి నేర్పించడం మరియు నక్షత్రాలను వీక్షించేలా ఫిబ్రవరి 18వ తేదీ నుండి 27 వరకు భద్రకాళి ట్యాంక్ బండ్ లో ప్రతి రోజు సాయంత్రం 6 గం ల నుండి 11 గం ల వరకు టెలిస్కోపులతో నక్షత్ర, విహంగ వీక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేస్తున్న సందర్భంగా కూడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరిశీలించారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతరిక్షంపై ఆసక్తి గల అన్ని వర్గాల వారికి, స్కూల్, అన్ని కాలేజీల విద్యార్థులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, ఈ మొత్తం కార్యక్రమం కూడా మరియు ఎన్ఐటి వరంగల్ వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు

## లాయర్ స్వప్న కేసులో నిందితుల అరెస్ట్

- హత్యకు ఉప యోగించిన కార్లు, ఫోన్లు స్వాధీనం
- భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసుల వెల్లడి



రంగారెడ్డి, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) : మొయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో న్యాయవాది స్వప్న హత్య కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ గోటికె స్వప్న ఫిబ్రవరి 4న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. న్యాయవాది స్వప్న హత్యకు భూ వివాదమే కారణమని నిర్ధారించారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులలో ప్రధాన నిందితుడు స్వప్న సొంత అన్న గోటికె రాజు మరో ముగ్గురు సహచరులతో కలిసి హత్యకు కుట్ర చేసినట్లు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ యోగేష్ గౌతమ్ చెప్పారు. సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై వివాదం. భూమి సర్వే కోసం వెళ్లిన సమయంలో నిందితులు స్వప్నపై దాడికి పాల్పడ్డారు. మొదటగా కారుతో ఢీకొట్టి, తర్వాత రాళ్లు,కర్రలతో దాడి చేసి అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేశారు. దీంతో ఘటన స్థలంలోనే స్వప్న మృతి చెందింది. హత్య అనంతరం ఇన్నోవా కార్, స్కూటీలో నిందితులు పరారయ్యారు. ఇన్నోవా కారు, స్కూటీ సీజ్ చేశారు. నలుగురు నిందితుల మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కొడవలిని కూడా సీజ్ చేశాం అని డీసీపీ యోగేష్ తెలిపారు. చెల్లిని చంపిన సొంత అన్న కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే స్వప్న అన్న రాజుతో పాటు ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్వప్న లొకేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ రెండు సార్లు స్వప్నను హత్య చేసేందుకు ప్రయత్నించినట్టు రాజు విచారణలో ఒప్పుకున్నాడు. ఒకసారి కారుతో మరోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీ కొట్టించే ప్రయత్నం చేశాడు రాజు. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్లాన్ చేశాడు. రెండు ఘటనల నుంచి స్వప్న తప్పించుకుంది. సీసీ కెమెరాలు లేని ప్రదేశాలు చూసి స్వప్నను వెనుక నుంచి ఢీ కొట్టేందుకు రాజు ప్లాన్ చేశాడు. ప్లాన్ సక్సెస్ చేసేందుకు తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. ఈ రోడ్డు ప్రమాదం కేసులను హత్యాయత్నం కేసులుగా పోలీసులు మార్చనున్నారు.

## సిపిఐ నేత గిరిప్రసాద్ సతీమణి కమలాదేవి మృతి

- సంతాపం ప్రకటించిన ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, ఫిబ్రవరి14 (జనంసాక్షి) : సీపీఐ అగ్ర నాయకులు, కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్ సతీమణి నల్లమల కమలాదేవి (87) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లో కన్నుమూశారు. కమలాదేవి భౌతిక కాయాన్ని బంధువులు, పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు సందర్శనార్థం జూబ్లీహిల్స్‌లోని ఆమె పెద్ద కుమార్తె నివాసంలో ఉంచనున్నారు. సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉంచి తరవాత సాయంత్రం 5-00 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నల్లమల కమలాదేవి మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు. నల్లమల కమలాదేవి తన భర్త గిరిప్రసాద్‌కు అనునిత్యం వెంట నడిచి ఆయన పోరాటంలో భాగస్వాములయ్యారని అన్నారు. వారి కుటుంబసభ్యులతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని అన్నారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ముంబైలో కూలిన మెట్రో పిల్లర్

- నలుగురు వ్యక్తులకు గాయాలు


ముంబై, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) : ముంబైలోని ఓ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్‌లోని కొంత భాగం శనివారం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. క్షతగ్రాతులను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన ములుంద్ వెస్ట్ మెట్రో స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. నిర్మాణంలోని పిల్లర్‌లో కొంత భాగం అకస్మాత్తుగా కూలిపోవడంతో.. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వారు శిథిలాల కింద చిక్కుకున్నారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పిల్లర్ శిథిలాలు కూలిపోవడంతో అక్కడ పార్క్ చేసిన పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. శిథిలాలను తొలగించే పనులు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు. రక్షణ చర్యలు కొనసాగుతుండగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్ : వేముల

నిజామాబాద్, ఫిబ్రవరి14 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి గెలిచిందని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో నైతిక విజయం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలదే అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలకు విరుద్ధంగా అధికార యంత్రాంగాన్ని దుర్వినయోగం చేశారని అన్నారు. రాత్రింబవళ్లు నోట్ల కట్టలు పంపిణీ చేశారని, మద్యాన్ని ఏరులై పారించారని ఆరోపించారు. కొన్నిచోట్ల రిగ్గింగ్ చేయడంవల్లే అక్కడ గెలిచారని తెలిపారు. అధికార బలాన్ని ఉపయోగించి ఎన్నికల్లో గెలిస్తే అది విజయం కాదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ తీరును గమనిస్తున్నారని పేర్కొన్నారు.

# జాతీయ ప్రత్యామ్నాయమే ఏకైక మార్గం

భారత నవీన హీరో కామ్రేడ్ వినోద్ మిశ్రా రాసిన రచనలు ఇటీవల తెలుగులో ప్రచురింపబడ్డాయి. "వినోద్ మిశ్రా కొన్ని రచనలు" పేరుతో వెలువడిన వ్యాసాల సంకలనం డిసెంబర్ 6న విజయవాడలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ దీపాంకర్ భట్టాచార్య చేతుల మీదుగా ఆవిష్కరించబడింది. కామ్రేడ్ వినోద్ మిశ్రా భారత విప్లవద్యమ నాయకుల్లో ఒకరు. మూడు దశాబ్దాల కాలంలో ఆయన రాసిన రచనలన్నీ ఆనాటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను విశ్లేషించినవి. భారతదేశ భౌతిక పరిస్థితులను, మొత్తం కమ్యూనిస్టు ఉద్యమాన్ని పరిశీలించి లోతైన విశ్లేషణ చేశారు. కమ్యూనిస్టు ఉద్యమ సంక్షోభ సమయాలను, నిర్మాణాన్ని, గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును తన రచనల్లో అద్భుతంగా విశ్లేషించారు. జాతీయ ప్రత్యామ్నా యమే పరిష్కారమని వినోద్ మిశ్రా భావించారు. అందుకు తగినట్టుగా పార్టీని సాయుధ పంథా నుంచి విశాల ప్రజాస్వామ్య ఐక్య సంఘటన వైపు మళ్ళించారు. ఇండియన్ పీపుల్స్ ఫ్రంట్ (ఐపీఎఫ్) లాంటి చొరవలు చేశారు. బీహార్, జార్ఖండ్, అస్సాం లాంటి రాష్ట్రాల్లో అద్భుతమైన విజయాలు సాధించారు. అతి తక్కువ కాలంలోనే ఆయన మరణించడంతో కమ్యూనిస్టు ఉద్యమానికి విషాదం ఏర్పడింది.




నేడు భారతదేశం ఫాసిస్టు పడగనిడలో మగ్గుతోంది. ఈ సమయంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన వినోద్ మిశ్రా రచనల్ని వామపక్ష శిబిరం అధ్యయనం చేయాల్సి ఉంది. పరిశీలించి విశ్లేషించాల్సిన అవసరం ఉంది. బలహీనపడిన కమ్యూనిస్టు ఉద్యమ శిబిరాన్ని బలోపేతం చేస్తూ ప్రత్యామ్నాయ అవకాశాలను రూపొందించుకోవాల్సిన చారిత్రక కర్తవ్యం నేడు కమ్యూనిస్టులపై ఉంది. వినోద్ మిశ్రా రచనలు ఇప్పుడు తెలుగులో లభ్యం కావడం శుభ పరిణామం. విప్లవ పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచే తెలుగు నేలకు, ఇక్కడి విప్లవ శిబిరానికి అత్యవసరం. నేషనల్ ఆల్టర్నేటివ్ పబ్లికేషన్ 310 పేజీలతో ఈ పుస్తకాన్ని తీసుకువచ్చింది. ఇది మొదటి భాగం, రెండవ భాగాన్ని తీసుకొచ్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.

మార్క్సిస్టు సీనియర్ రచయిత యార్లగడ్డ వెంకట్రావు ఇందులో కొన్నింటిని అనువాదం చేశారు. మరి కొంతమంది కామ్రేడ్స్ మరిన్నింటిని అనువాదం చేసి పుస్తకాన్ని వెలుగులోకి తీసుకువచ్చేందుకు కృషి చేశారు. కామ్రేడ్ బండి సత్యనారాయణమూర్తి (బిఎస్ఎన్ మూర్తి) ఈ పుస్తక బాధ్యతలను భుజాన్నెత్తుకున్నారు, ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నప్పటికీ బిఎస్ఎన్ మూర్తి సీరియస్ గా పనిచేశారు. ప్రతీ వ్యాసాన్ని చదివి టైటిల్స్ పెట్టారు. అక్కడక్కడ అవసరమైన మార్పుల్ని సైతం చేశారు. ఆయన సుదీర్ఘకాలం జర్నలిజం లో పనిచేసిన అనుభవం, ఆనాడు లిబరేషన్ లో కొనసాగిన అనుభవాలతో ఈ పుస్తకాన్ని మరింత ఉన్నతంగా తీసుకు వచ్చేందుకు ఉపయోగపడింది. అంతకుముందు విప్లవ దార్శనికుడు చారు మజుందార్ పుస్తకం వేసి ఉన్నారు. ఆ పుస్తకం వేసిన క్రెడిట్ ఆయన తీసుకోలేదు. ఇప్పుడు ఈ పుస్తకానికి కొంతమంది మిత్రుల సూచనలతో సంపాదకులుగా పేర్లు వేసుకున్నారు.

ఆనాటి ఐపీఎఫ్ ఉద్యమంలో క్రియాశీలకంగా ఉన్న కామ్రేడ్ పత్తిపాటి సత్యనారాయణ, లిబరేషన్ ఉద్యమంలో నేటికీ కొనసాగుతున్న సీనియర్ నాయకుడు మద్దెల మల్లేశ్వరరావు రచనల్ని తెలుగులో తీసుకువచ్చేందుకు శ్రమించారు. తక్కువ సమయంలోనే ఈ పుస్తకం ముద్రణ యజ్ఞం జరుగుతుండగా అత్యంత కీలకమైన 56 వ్యాసాలను నేను నాలుగు సార్లు చదవాల్సి వచ్చింది. ఎనిమిదేళ్లుగా లిబరేషన్ ఉద్యమంలో ఉన్నప్పటికీ మిశ్రా రచనల్ని అధ్యయనం చేయలేకపోయాను. ఈ పుస్తకం ద్వారా ఆ లోటు భర్తీ చేయబడింది.

1974 సమయంలో సీపీఐ (ఎంఎల్) తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంది. సీపీఐ (ఎంఎల్) నిర్మాత కామ్రేడ్ చారు మజుందార్ మరణం తర్వాత పార్టీని పునర్నిర్మాణం కామ్రేడ్ జోహార్, కామ్రేడ్ వినోద్ మిశ్రా, కామ్రేడ్ స్వదేశ్ భట్టాచార్య నేతృత్వంలో జరిగింది. వీరి నాయకత్వంలో ఏర్పడిన పార్టీ ఇప్పటివరకు ఎలాంటి చీలికకు గురికాలేదు. జవహర్ మరణం తర్వాత సెక్రెటరీగా ఎన్నికైన వినోద్ మిశ్రా 1998 డిసెంబర్ 18న మరణించే వరకు సీపీఐ (ఎంఎల్) ఉద్యమానికి నాయకత్వం వహించారు.

ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలం, బీజేపీ పుట్టుక పరిణామాలు నేపథ్యంలో ప్రమాదకర పరిస్థితుల్ని వినోద్ మిశ్రా అంచనా వేశారు. విప్లవ శిబిరానికి హెచ్చరికలు సైతం చేశారు. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత, ఫాసిస్ట్ బీజేపీ పన్నగాలను బహిర్గతం చేశారు. కమ్యూనిస్టు, విప్లవ కమ్యూనిస్టు, ప్రగతిశీల లౌకిక శక్తులను ఒకే వేదిక వీధికి తీసుకువచ్చే ప్రయత్నాలను వినోద్ మిశ్రా కొనసాగించారు. ఈ పుస్తకంలో మొదటి వ్యాసం 'నా స్వప్న భారతదేశం' చాలా అద్భుతంగా రాశారు. ఒక విప్లవకారుడు ఈ రకమైన రచన చేస్తారా? అనేది సహజంగానే అనిపిస్తుంది. తన కలల భారతం ఎలా ఉండాలో! ఎలా ఉంటుందో ఈ రచనలో వ్యక్తం అయింది. కలలు కనడమే కాదు, వాటిని సాకారం చేసుకునేందుకు విప్లకారుల ప్రస్థానం ఉంటుంది.

సమ సమాజం కోసం ఉన్నతమైన లక్ష్యం కోసం సాగించే పయనం, విప్లవకారుల స్వప్నమే 'నా స్వప్న భారతదేశం' రచన. అందులో ఒకచోట "ఎక్కడైతే ఒక పాకిస్తాన్ ముస్లిం తన పరిణామ మూలాలను వెతకడానికి వీసా పొందాల్సిన అవసరం ఉండదో, ఎక్కడైతే ఒక భారతీయుడు తన మహోన్నత సింధులోయ నాగరికత పరాయి దేశంలో ఉన్నట్టుగా భావించడో, ఒక బెంగాలీ హిందూ శరణార్థి తనకు ఢాకాలో ఎదురైన చేదు జ్ఞాపకాలను గుర్తుపెట్టుకోడో, అలాగే ఒక బంగ్లాదేశ్ ముస్లిం భారతదేశంలో విదేశీ పౌరుడిగా వేటాడ బడడో.. అదే నా సర్వ సమగ్ర స్వప్నాల భారతదేశం" అంటాడు వినోద్ మిశ్రా. మరొకచోట "నా కలల భారతదేశం 'సర్వ ధర్మ సంభవం' కంటే 'సర్వ ధర్మ వర్జితే' అని సూత్రంపై ఆధారపడిన లౌకిక రాజ్యంగా ఉంటుంది. వ్యక్తిగత విశ్వాసాలలో రాజ్యం జోక్యం చేసుకోకుండా, శాస్త్రీయ, హేతుబద్ధ ప్రాపంచిక దృక్పథాన్ని చురుకుగా పెంపొందిస్తుంది" అన్నాడు. కవితాత్మకంగా కొనసాగిన ఈ రచనలో "నాలాంటి చాలామంది వాటి సాకారం కోసం తమ చివరి రక్తపు బొట్టును ధారబోయటానికి కట్టుబడి ఉన్నారు." అని ముగించాడు. ఇది చదివిన నేను అప్పటికప్పుడే 'నా నవీన భారత స్వప్నాలు' అంటూ ఒక వ్యాసం రాశాను, దీనిపై స్పందన నేను ఊహించనిది.

ఆనాటి సోవియట్ యూనియన్ పరిణామాలు, మార్క్సిజం విప్లవ మూలాలను తిరిగి పొందుదాం, విప్లవ వామపక్ష ఉద్యమాన్ని బలోపేతం చేద్దాం, జాతీయ రాజకీయ పరిస్థితుల గతిశీలత వామపక్ష ఎత్తుగడలు, ఎర్రజెండా స్వతంత్రతను కాపాడుకుందాం, మూడో కూటమి అన్వేషణలో, జాతీయ ప్రత్యామ్నయం కోసం నిరంకుశ వ్యతిరేక ఫ్రంట్, పీపుల్స్ ఫ్రంట్ సైదాంతిక ప్రతిపాదిక, తృతీయ శక్తిని పునర్నిర్మించాలి, రాజకీయ ఎత్తుగడలో మౌలిక అవగాహన, రండి దేశాన్ని నూతన మార్గంలో నడిపిద్దాం.. లాంటి విలువైన రచనలు ఈ పుస్తకంలో ఉన్నాయి. కాషాయ పథకం నగ్న స్వరూపం రచనలో సంఘ్ పరివార్ – స్వాతంత్ర సాధన ద్రోహులు అంటాడు. ఆర్ఎస్ఎస్ మూలాల్ని చర్చించాడు. హిందూ రాష్ట్ర తాత్విక చింతన నాజీయిజం నుంచి అరువు తెచ్చుకున్నదే అని నిరూపించాడు. గోల్వాల్కర్ ను ప్రభావితం చేసింది జర్మన్ అడల్ఫ్ హిట్లర్ తప్ప మరొకరు కాదని స్పష్టం చేశాడు. 'మనం లేదా మనం నిర్వచించే జాతీయత' గోవాల్కర్ రాసిన పుస్తకాన్ని ఉదాహరించారు.

పెరుగుతున్న మతవాద ఉష్ణోగ్రత, కాషాయ ప్రమాదం నుండి దేశాన్ని రక్షిద్దాం.. అంటూ ఆనాడు పిలుపునిచ్చాడు కామ్రేడ్ వినోద్ మిశ్రా. వామపక్ష ప్రజాస్వామ్య సమాఖ్య నిర్మాణం, మరికొంత వివరణ ఉంది. దళిత, ముస్లిం సమస్య, భారతీయ ముస్లింల పరిస్థితి చర్చిస్తూనే వామపక్షాలతో ఎందుకు కలవాలి అనేది ఆయన స్పష్టం చేశారు. మార్క్సిజం ఓనమాలు నేర్చుకుందాం, మార్క్సిస్టు విప్లవ పతాకాన్ని చేబూని గొప్ప విజయాలు సాధిద్దాం, మార్క్సిజం పతాకాన్ని సమున్నతంగా నిలుపుదాం, మార్క్సిజానికి ధాస్ క్యాపిటల్ తో పోల్చదగిన రచన కావాలి, మానవ విముక్తి సాధ్యమే.. రచనల్ని చాలా సరళంగా అందించారు. రాజకీయ పాఠశాలలో చేసిన ప్రసంగాలని కూడా ఇందులో చేర్చారు. క్యాపిటలిజం పై సోషలిజం విజయం ప్రజాస్వామ్య విజయం కూడా.. అంటాడు.

కామ్రేడ్ లెనిన్ వర్సెస్ రోజా లక్సెంబర్గ్.. లెనిన్ రచనల ఆధారంగా అధ్యయనం ఇందులో చాలా కీలకమైంది. లక్సెంబర్గ్ యొక్క తప్పులను సవరించుకున్న విధానాన్ని, ఆమె రచనల్ని, జీవిత చరిత్రను గుణపాఠాలుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మరో రచనలో కమ్యూనిజం పేదరికం యొక్క తత్వశాస్త్రం కాదు, కమ్యూనిజం సమృద్ధి తత్వశాస్త్రం అంటూ విశ్లేషించాడు వినోద్ మిశ్రా. మార్క్సిజం మహిళా విముక్తి, కుల – వర్గ ప్రతివాదంపై రెండు విమర్శనాత్మక వ్యాసాలున్నాయి.

బీహార్ రాష్ట్రంలో జరిగిన రైతాంగ ఉద్యమాలను గుర్తుచేసే రచన జ్వలిస్తున్న బీహార్ పంట పొలాలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పరిస్థితులను గుర్తు చేస్తుంది. బీహార్లో జరిగిన అనేక రైతాంగ పోరాటాలు మరుగున పడ్డాయి, వాటి అనుభవాలు అందుబాటులో లేకుండా పోయాయి. రైతాంగ ఉద్యమ ప్రధాన అంశాలు నిర్మాణ నివేదిక, సైద్ధాంతిక పురోగతికి స్వీయ అధ్యయనం దృఢ సంకల్పం ముఖ్యం, సరైన నిర్మాణం సైదాంతిక స్థాయిని పెంచుతుంది, సరైన కార్యశైలితోనే పార్టీ అభివృద్ధి సాధ్యం, పార్టీ పటిష్ట ఉద్యమం, గతం పై సమీక్ష, జాతీయ విముక్తి ప్రజల ప్రజాస్వామ్యం, నేటి వాస్తవికతతో 70 ల విప్లవస్ఫూర్తిని సమన్వయం చేయండి.. వీటన్నింటిని చదివితే 50 ఏళ్లుగా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఒక ప్రవాహంగా ఎలా నిలబడిందో అర్థం చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది.

ఒకనాడు బీహార్ పార్టీగా ముద్రపడిన ఈ పార్టీ జాతీయ నిర్మాణ స్వరూపం ఎలా తీసుకుందో, ఎలా అభివృద్ధి అయిందో, పోరాట రంగంలోనూ ఎన్నికల రంగంలోనూ అద్భుతమైన విజయాలు ఎలా సొంత మయ్యాయో రేఖామాత్రంగానైనా అర్థం కావాలంటే వినోద్ మిశ్రా రచనలు తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సిందే. విప్లవకారుల వెలుగుదివ్వె భగత్ సింగ్, కామ్రేడ్ చంద్రశేఖర్ సవాళ్లను సజీవంగా నిలుపుదాం, విప్లవకర దేశభక్తికి మార్గ నిర్దేశకులు భగత్ సింగ్, చారు ముజందార్ రచనలు విద్యార్థి యువతరాన్ని ఉత్తేజపరిచేవి, ప్రేరణ కలిగించి మార్గ నిర్దేశం చేస్తాయి. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఫాసిజం అమలుకు పూనుకుంది. రాజ్యాంగాన్ని మార్చి మనుస్మృతిని రాజ్యాంగంగా తీసుకువచ్చే ప్రయత్నాలను తీవ్రతరం చేసింది. కార్మిక చట్టాలను ఖననం చేసి నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చింది. నల్ల వ్యవసాయక చట్టాలను దొడ్డి దారిన అమలు చేస్తుంది. న్యాయ వ్యవస్థను, ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. అన్ని రంగాలను నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైంది. మావోయిస్టులను తేదీ పెట్టి మరి నిర్మూలిస్తుంది, కమ్యూనిస్టులను అర్బన్ నక్సలైట్లు పేరుతో ఉద్యమాలను అణచి వేస్తుంది. ఫాసిజం వచ్చిందా! రాలేదా? అని చర్చల దగ్గరే ఆగిపోతే జరిగే నష్టం జరిగిపోతుంది. అందుచేత ఫాసిజాన్ని ఓడించేందుకు, నిలువరించేందుకు ఎన్నికల రంగంతో పాటు భావజాల రంగంలో పెద్ద ఎత్తున కృషి చేయాల్సి ఉంది. జాతీయ ప్రత్యామ్నాయాన్ని కమ్యూనిస్టులు, లౌకిక శక్తులు రూపొందించాల్సిన చారిత్రక కర్తవ్యం మన ముందుంది. అందుకు ప్రేరణగా కామ్రేడ్ వినోద్ మిశ్రా చేసిన కృషి, ఆయన రచనలు నిలుస్తాయి. కేవలం కమ్యూనిస్టులు మాత్రమే కాదు, ప్రగతిశీల భావన కలిగిన ప్రతి పౌరుడు తప్పక చదవాల్సిన పుస్తకమిది.




**మామిండ్ల రమేష్ రాజా,**
**రాష్ట్ర కార్యదర్శి,**
**సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ**
**సెల్ : 7893230218**

## బంజారాల ఆరాధ్య దైవం
# సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్

భారతదేశంలోని గిరిజన తెగలలో ఒకటైన బంజారా (లంబాడీ) సమాజానికి వెలుగు చూపిన మహనీయుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్. 18వ శతాబ్దంలో జీవించిన ఆయన, కేవలం ఒక ఆధ్యాత్మిక గురువుగానే కాకుండా, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక సంస్కర్తగా, అహింసా వాదిగా చిరస్థాయిగా నిలిచిపోయారు. దుర్లభం భారతం వర్షే అని శాస్త్ర వచనం. భారత దేశంలో జన్మించటమే మహా దుర్లభం అని అర్థం. ఇక్కడ మనిషి పుట్టుకకు కారణం వెతుక్కునే అవకాశం ఉంది. అలాంటి కారణ జన్ములు అనేకులు మన భారతగడ్డ పై జన్మించారు. అలాంటి వారిలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఒకరు. సేవాలాల్ బంజారాల ఆరాధ్య దైవంగా నిలిచాడు. ఆయన లిపిలేని బంజారాల భాషను ఒక పద్ధతిగా మార్చాడు. 10 కోట్ల లంబాడా ప్రజలు ఎక్కడైనా ఒకే రకంగా నేడు మాట్లాడుకోగలుగుతున్నారు. స్థిర నివాసం లేకున్నా తమ కట్టుబాట్లు , ఆచారవ్యవహారాలు, విలక్షణమైన దుస్తులు, ఆభరణాలతో బంజారాలు తమ ప్రత్యేకతను నిలుపుకుంటున్నారు. "సాతీ భవానీ (సప్త మాతృకల)" పూజా విధానాలు ఆచరించే బంజారాల జాతికి ఆయనే దార్శనికుడు. రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు బంజారాలు ఆయా రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగించేవారు. ఆ క్రమంలో బ్రిటిష్, ముస్లిం పాలకుల మత ప్రచారంతో బంజారా సమాజం అనేక ఇబ్బందులకు గురయ్యింది. అలాంటి పరిస్థితులలో బంజారాలను మంచిమార్గంలో నడిపించడానికి సేవాలాల్ అవతరించారు. ఆయన బోధనల ద్వారా బంజారా జాతినడచుకుంది. 1739 ఫిబ్రవరి 15న అనంతపూర్ జిల్లా రాంజీనాయక్ తండాలో భీమా నాయక్, ధర్మిణి భాయి దంపతులకు జన్మించాడు. చిన్నతనం నుంచే ఆయనలో సేవాగుణం ఉండేది. ఆవులు కాయడానికి వెళ్తేటప్పుడు తల్లి కట్టియిచ్చిన సద్దిని తాను తినకుండా ఆకలితో ఉన్నవాళ్లకు పెట్టేసే వాడు. తాను బంకమట్టితో రొట్టెలు చేసుకొని తినేవాడు. ఈ వింత ప్రవర్తన తల్లితండ్రులకు, తండాలోని జనాలకు ఆశ్చర్యం కలిగించేది. జాతర్ల సమయంలో జంతుబలిని ఒప్పుకునేవాడు కాదు. 'ఒకవేళ అమ్మవారికి బలి ఇష్టమైతే నేనే బలై పోతాను' అని సేవాలాల్ అమ్మవారి కాళ్ల దగ్గర తన తలను ఉంచుతాడు.'నా రక్తాన్ని నైవేద్యంగా స్వీకరించి బంజారాలకు వరాలు ఇవ్వమ'ని ప్రార్థిస్తాడు. అమ్మవారు కరుణిస్తుంది. 'నిజమైన భక్తుడు సమాజానికి సేవకుడు. అతని నాయకత్వంలో ప్రయాణించండి' అని జగదాంబ ఆశీర్వ దిస్తుంది. అప్పటి నుంచి జగదాంబ మాతనే తన గురువుగా స్వీకరించాడు. అన్ని విద్యలను నేర్చుకొని బంజారాల సేవలో నిమగ్నమయ్యాడు. సేవాలాల్ మహారాజ్ ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారు. వీరిలో 'పెరిఫర్' ఒకటి. ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులు అరికట్టడం, క్షేత్ర ధర్మాన్ని రక్షించడం మొదలైనవి ముఖ్యమైనవి. అహింస మహా పాపమని, మద్యం , ధూమపానం శాపమని హితవు పలికాడు. ఆ రోజుల్లోనే బంజారాల పరువు ప్రతిష్ఠల గురించి ఊహించి అహింస సిద్ధాంతానికి పునాది వేశాడు. ఒకప్పుడు హైదరాబాదులో మశూచి వ్యాధి ప్రబలింది. అయితే, సంత్ సేవాలాల్ మహారాజ్ ఉన్న బంజారా హిల్స్ ప్రాంతానికి మాత్రం ఆ వ్యాధి సోకలేదు. ఆయన మహిమను గుర్తించిన రాజు... సేవాలాల్ ఆశీస్సులతో ఆ వ్యాధిని నిర్మూలించాడని చరిత్ర తెలుపుతోంది.

**గిరిజనుల గొప్పతనం :** బంజారాలు రాజపుత్రుల్లాంటి వారని చరిత్ర కారుడు కల్నల్ టాడ్ పేర్కొన్నారంటే.. వారెంత దృఢకాయులో అర్థం అవుతుంది. లంబాడీలు, బంజారాలు, సుగాలీలు, గ్వార్ భాయ్ అని పిలవబడుతున్న ఈ గిరిజనులు ప్రపంచవ్యాప్తంగా గోర్ బంజారాలుగా పేరుపొందారు. మధ్య యుగంలో మహమ్మద్ ఘోరీకి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్ పక్షాన పోరాడిన వీరోచిత చరిత్ర బంజారాల సొంతం. దక్కన్ పీఠభూమిలో లంబాడీలు కాకతీయుల కంటే ముందే ఉన్నారని, సంచార జాతివారైనా వీరు రజాకార్లతో పోరాడారని, నవాబులు వారి ధైర్యసాహసాలకు మెచ్చి భూములను ఇనాములుగా ఇచ్చారని చరిత్ర చెబుతోంది. బంజారాలు ఎవరికీ హాని తలపెట్టేవారు కాదని, సహాయ గుణం విరివిగా కలవారని, ధైర్యసాహసాలకు ప్రతీకలనీ చరిత్ర ద్వారా తెలుస్తుంది. తరతరాలుగా జాతి వివక్షకు గురవుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధిలో వెనుకబడి ఉన్న లంబాడాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముంది



**జటావత్ రాజు**
**(యువ కవి రచయిత; అరుణ రైటింగ్స్)**
**తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్**
**9347196264**

# శ్రమ పద్యాలు

చిరిగిన చీరకొంగులు
తెగిన పాతసెప్పులు
నూనెపూయని ఎంట్రుకలు
నల్లతుమ్మలెక్క కమిరిపోయిన
ముఖాలు
ఇవే మా కూలీ తల్లుల చిరునామా.

మేస్త్రీ కేక వినపడగానే
వీధుల్లో నుండి
వాడల నుండి సేన్లకు యుద్ధభూమికి
నడిసినట్లు పయనమౌతరు.

మూడు చక్రాల బండ్లమీద
నిలబడిపోతుంటారు
లోపటకుక్కి కుక్కి పెట్టిన ఊపిరంత
బిగవట్టి కూసుంటరు
అదుపుతప్పి కిందిపడితే
శవాలై ఊపిరిదీసుకుంటరు.

నెత్తిన సద్ది
కొప్పున మందార పువ్వు
సేతిల కొడవండ్లు
ఎండపొడకు ఇంద్రధనుస్సుల
మెరిసిపోతుంటాయి.

కలుపుదీస్తరు
నాట్లేస్తరు
పత్తిదీస్తరు
మట్టిమోస్తరు
కాలంబట్టి కూలీ ఎక్కువ అడగవచ్చు
ఇతరుల నోట్లో మట్టిమాత్రం కొట్టరు.

పాటందుకుంటరు
పదమెత్తుకుంటరు
రాగం రానిచోట కూనీరాగమైతరు
చేతులు కదులుంటయి
కాళ్ళు మెదులుతుంటయి
కాసిన్న గంజి మెతుకుల కోసం..

మట్టిచేతుల నిండ నేతిబొట్టువాసన
పైనిండా చెమటపూల వాసన
అలసిసొలసిన సాయంకాలం
వాగునపారే నీళ్లతో తానమడుతరు.

పయిటాలకు
ఊరి సద్దులన్ని
ఒకే బట్టమీద కల్లమైతయి
కులాలన్ని గోడెక్కి కూసుంటయి



ముద్దముద్దకు ఊరిసుద్దుల కమ్మదనం
తొణికిసలాడుతది.

మా తల్లుల శ్రమ చరిత్రకెక్కదు
ఏ మీడియా చూపించదు
ఏ కవి ఓ పద్యం రాసుకరాడు
ఐనా ఆ చేతులు దేశ నిర్మాతలవి
ఆ మనుష్యులు ఈ దేశ పునాదులవి.

మా కూలమ్మలు
శ్రమను నమ్ముకున్న బత్కులు
నేలమ్మకు దండబెట్టే కొమ్మకోయిలలు
రెక్కాలే ఆస్తులు
చెమటచుక్కలే కంటిచెమ్మలు.

**అవనిశ్రీ**
**గద్వాల**
**9985419424**

## వేలు

**నీవు నామాలు అడ్డంగానో**
**నిలువుగానో**
**అభ్యంతరం లేదు**
**కుంకుమ కనుబొమ్మల మధ్యనో**
**పసుపు చెంపల క్రిందుగానో**
**అభ్యంతరం లేదు**
**ఔను నీ దేహం నీది**
**కట్టుకి బొట్టుకి నీకు పూర్తి స్వేఛ్ఛ**
**మేం కోరేది ఒక్కటే**
**ఎడంచేయి చూపుడువేలు మీద**
**నల్లచుక్క మాత్రం**
**దేశం కోసం గుర్తుపెట్టుకో**
**ఈవేళ నీవేలు ' వేలు ' పలుకొచ్చేమో!**

**కోటం చంద్రశేఖర్**
**9492043348**

# మనువాదుల చెరలో బందీగా చత్రపతి శివాజీ

**ఫిబ్రవరి 19న చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి, శివాజీ పాలనతో గాని, ఆయన యుద్ధాలతోకానీ దక్షిణ భారత దేశానికి ఎలాంటి సంబంధం లేదు.సమాజంలో పేరు కల్గిన వారిని తమ భావాజాలానికి వ్యతిరేకంగా ఉన్నవారైన సరే తమ రంగు పులిమి మార్కెటింగ్ చేసుకుని వారిని తమ వారిగా ప్రమోట్ చేసుకోవడం సంఘ్ పరివార్ కు తెలిసినంత మరెవరికి తెలియదు.అందుకే నేడు వారికి సంబంధం లేని వారికి కూడా భారత రత్న ,పద్మ పురస్కారాలు ఇస్తూ వారిని తమ వారేనని చెప్పుకునే కుట్రలు తెరలేపారు.**

చరిత్రలో ఎప్పుడూ ఎక్కడా చెప్పుకోవటానికీ, చూపుకోవటానికీ ఓ పేజీలేని ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్ శక్తులు ప్రజల్లో ఆమోదాన్నీ, విశ్వసనీయతను పొందటానికి అనేక కుట్రలు, కుహకాలకు పాల్పడుతున్నారు. తమకు ఏ రూపంలోనూ సంబంధం లేని, కడదాకా కాంగ్రెస్ వాదిగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్‌నూ తమ వాడిగా చూపుకోవటం కోసం నానా తంటాలు పడ్డారు. నిజానికి గాంధీ హత్య తర్వాత ఆర్ఎస్ఎస్‌ను హింసాత్మక, ఉన్మాద శక్తిగా ప్రకటించి ఆర్ఎస్ఎస్ ను నిషేధించిన వాడు పటేల్. దేశ రాజకీయాల్లో హింసాత్మక ఉన్మాదానికి కేంద్రంగా ఆర్ఎస్ఎస్ ను ప్రకటించి దానికి దేశ రాజకీయాల్లో చోటు ఉండకూడదని ప్రకటించిన వాడు పటేల్. అలాంటి పటేల్ ను ఇవ్వాళ బీజేపీ భుజాన మోయటం వెనుక ఎలాంటి కపటం ఉన్నదో, శివాజీని హిందు పరిరక్షకుడిగా చెప్పటం వెనుక అలాంటిదే ఉన్నది. చరిత్రను వక్రీకరించి ప్రజల్లో లేని ఆమోదాన్ని పొందాలనుకోవటం బీజేపీ శ్రేణుల దురాశ. అది ఎన్నటికీ నెరవేరదు. భిన్న సంస్కృతులు, జీవనాలు కలిగిన భారతావనిలో మతోన్మాద రాజకీయాలకు చోటు లేదు.

**శివాజీ జీవితం -పరిపాలన:**

1630 ఫిబ్రవరి 19న జిజియా బాయి, శహాజీ బోంస్లే లకు శివాజీ మహారాజ్ జన్మించాడు.బీజాపూర్ సంస్థానం నుండి తన తండ్రికి "పూణే" జాగీర్ గా లభించింది. తన తండ్రి శివాజీ కి విలు విద్య, యుద్ధ విద్యలను నేర్పడానికి దాదాజీ కోండదేవ్ ను శిక్షకుడిగా నియమించాడు.శివాజీ తన గురువు పరివేక్షణలో విద్య నేర్చుకున్నాడు. విద్యతోపాటు స్వతంత్ర రాజ్యా కాంక్షను కూడా పెంచుకున్నాడు.వారి జాగిర్ బీజాపూర్, మొఘల్ సామ్రాజ్యాల మధ్య ఉండటం మూలంగా శివాజీ రెండు రాజ్యాలతోనూ. పోరాడాల్సిన పరిస్థితి ఎర్పడింది. విశాలమైన రైతాంగం మద్దతుతో తన యుద్ధ విద్యలతో తన సైనికులతో కలసి స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు శివాజీ మొఘల్ అనంతరం ఉత్తర భారతదేశాని తన అధీనంలోకి తీసుకోగల్గే శక్తి కల్గిన మరాఠీ రాజ్యాన్ని సుస్థిరం చేశాడు. శివాజీకి 17వ శతాబ్దం నాటి ఫ్యూడల్ లక్షణాలన్నింటికీ అతీతంగా ఉండాలని నేడు కోరుకోవడం మన గొంతెమ్మ కోరిక అవుతుంది. కానీ ఆనాటి పరిస్థితుల్లో ఆయన ఎంత మేరకు ప్రగతిశీలంగా ఉన్నాడనేది మాత్రం పరిశీలించగలము. నిజంగా ఆయన మత ఉన్మాదిగా ఉన్నాడా, లేక మత విశ్వాసిగా ఉన్నాడా ? అంటే రెండవదే వాస్తవమని మనం చెప్పవచ్చు. ఎందుకంటే ఆయన మతానికి అతీతంగా ఉండేందుకు అప్పటికీ పారిశ్రామిక విప్లవం రాలేదు. ఆయన అవిశ్వాసిగా ఉండలేదు. కాబట్టి ఆయన ఒక పూర్తి ఫ్యూడల్ స్వభావం కల్గిన రాజు అని ఫ్యూడల్ రాజు కుండే అన్నీ పరిమితులన్నీ ఆయనకుంటాయని మన దృష్టిలో ఉంచుకోవాలి. 50 ఏళ్ల మాత్రమే జీవించిన శివాజీ 44 ఏండ్లు స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి ఆరేండ్లు పరిపాలన చేశాడు శివాజీ చేసిన గొప్ప పాలనను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తూ స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించడం కోసం పక్కనే ఉన్న4 ముస్లిం రాజ్యాలపై చేసిన దండయాత్రలను, యుద్ధాలను కీర్తిస్తూ శివాజీకి మతాన్ని ఆపాదించి ముస్లిం వ్యతిరేకి అని ,హిందూ ధర్మ పరిరక్షకుడు అని ,హిందూ చక్రవర్తి అని, గో బ్రాహ్మణ రక్షకుడు అని దుర్మార్గమైన చరిత్రని సృష్టించే ప్రయత్నం చేశారు. ఈ ప్రచారాలు పచ్చి అబద్ధాలు అని చరిత్ర రుజువు చేస్తుంది. శివాజీ హిందూ మత అనుయాయుడు



అయినంత మాత్రాన ముస్లిం వ్యతిరేకిగా ప్రచారం చేయడం సరి అయింది కాదు. ఎందుకంటే మహాత్మ జ్యోతిబాపూలే కూడా శివాజీని "కుల్వాడి భూషణ్ "అని బిరుదు ఇచ్చి అభివర్ణించాడు. అంటే మరాఠాలో "రైతు మకుటంలో మణి" అని అర్థం. మత భేదం లేకుండా అన్ని వర్గాలనూ సమభావన దృష్టితో చూసి ప్రజలందరి మెప్పుకోసం తాపత్రయ పడిన శివాజీని ముస్లిం వ్యతిరేకిగా ప్రచారం చేయటం సంఘ్ పరివార్ శక్తుల కూట్ర. నిజానికి ఛత్రపతి శివాజీగా పేరుగాంచిన శివాజీ భోన్సాలే అతిపిన్న వయస్సులోనే రాజ్యపాలనను చేపట్టి అందరి కోసం పాలనకొనసాగించాడు. బీజాపూర్ సుల్తాన్ అదిల్‌షాహి పై తిరుగుబాటు చేసి మరాఠాలో స్వతంత్రరాజ్యాన్ని స్థాపించాడు. నాటి ముస్లిం, మొగల్ రాజుల విధ్వంసకర విధానాలకు ఎదిరించి నిలిచి మరాఠా ప్రాంతంలో తన సామ్రాజ్యాన్ని నిర్మించాడు. ఆ క్రమంలో ఆయన మత వివక్షను ఏనాడు పాటించలేదు. నిజానికి మత వివక్షను శివాజీ స్వయంగా ఎదుర్కొన్నాడు. అగ్రవర్ణం కాని శివాజీ పట్టాభిశేకానికి ఏ బ్రాహ్మణుడు రావటానికి ఇష్టపడలేదు. దాంతో కాశీనుంచి గగాభట్ అనే బ్రాహ్మణున్ని ఆయన ఎత్తు బంగారం ఇచ్చి పట్టాభిశేక కార్యాక్రమానికి రావటానికి ఒప్పించాడు. అయినా ఆ కాశీ బ్రాహ్మణుడు తన కాలి బొటన వేలుతో శివాజీ నుదిటిపై బొట్టు పెట్టాడని చరిత్రలో రికార్డ్ అయి ఉన్నది. శివాజీ తన రాజ్యంలో, పాలనా వ్యవహారాల్లో ఏ విధమైన మత వివక్ష పాటించలేదు. ఆయన సైన్యంలో మూడో వంతు ముస్లింలే ఉండేవారు. అయన సైన్యానికి ఆయుధాలు అందించే ఫిరంగి ఆయుధాగారానికి అధిపతిగా ఇబ్రహిం ఖాన్ అనే ముస్లింను నియమించుకొన్నాడు. నౌకాదళాధిపతి కూడా ముస్లిం దౌల్ ఖాన్, విదేశీ వ్యవహారాల మంత్రి కూడా హైదర్ అలీ అనే ముస్లిం. అంతెందుకు ఆయన అంగ రక్షకుడు మొహతర్ కూడా ముస్లిమే. శివాజీని చంపాలనే కుట్రతో ఆయుధాలు లేకుండా చర్చలకు రావాలని పిలిచిన అఫ్జల్‌ఖాన్ కుట్రలో భాగస్వామి అయ్యి శివాజీని చంపబోయింది కృష్ణాజీ భాస్కర్ కులకర్ణి అనే బ్రాహ్మణుడే కానీ ముస్లీం కాదు. ఈ కుట్ర నుంచి శివాజీని కాపాడి సురక్షితంగా బయటకు తీసుకు వచ్చింద సిద్ది ఇబ్రాహిం అనే ముస్లిం. అంతెందుకు శివాజీ రాజభవనం ముందే ముస్లింల ప్రార్థన కోసం దర్గాను కట్టించిన పరమత సహనం శివాజీది. ఇలాంటి శివాజీని ముస్లిం ద్వేషిగా చిత్రీకరించే పనికి పూనుకోవటం హిందుత్వ శక్తుల కపటం. ద్రోహపు బుద్ధినీ, నీచత్వాన్నీ ఓ మతానికి అంటగట్టి చూడటం అసంబద్ధం. శివాజీకి లేని ముస్లిం మత ద్వేషాన్ని అంటగట్టి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేయటం దుర్మార్గం.

శూద్రవర్గానికి చెందిన శివాజీ మహారాజ్ మరాఠా సంస్కృతిక చిహ్నంగా ఎదగడాని ఓర్వలేని పురోహిత వర్గం శివాజిపై అనేక కుట్రలకు పాల్పడింది.ఔరంగజేబు శివాజీపై దండెత్తడాని పంపిన హిందు మీర్జా జై సింగ్ గెలవాలని చండియాగం చేశారు. చివరకు శివాజీకి పట్టాభిషేకం చేయడానికి కూడా ఇష్టపడలేదు.భారత దేశంలో క్షత్రియులు లేరని ఉన్నవారిని పరుశురాముడు వధించాడని ప్రచారం చేశారు. శివాజికి రాజు అయ్యే అర్హత లేదని వాదించారు.ముస్లీం అధికారులే ప్రజల హృదయాలలో స్దానం పొందిన శివాజీని చక్రవర్తి గా ప్రకటించి మహోత్సవం జరపాలని చొరవ చూపారు.వారణాసికి చెందిన నాగభట్టు అనే పురోహితుడిని పిలిపించి పట్టాభిషేకం చేసి రాజ్ పుట్ గా ప్రకటించారు. భారత్ లో వినూత్న పరిపాలన అందించి మట్టిమనుషులను తన అనుచరులుగా ,సహచరులుగా మార్చుకున్నాడు. హిందు, ఇస్లాంలోని మానవీయ విలువలను మరాఠీ ప్రజల ఆచార వ్యవహారాలలో మేళవించి ప్రత్యేక సంస్కృతి సృష్టించిన శివాజీని తమ రాజకీయ అవసరాల కోసం సంఘీ మూకలువ వాడుకుంటున్నారు. శివాజీ అందరి వాడని చెప్పిన గోవింద్ పన్సారే ని అత్యంత హేయంగా హత్య చేశారు . శివాజీని ఒక వర్గపు మనిషిగా కీర్తిస్తూ, అన్య మత విద్వేషకుడిగా ప్రచారం చేస్తున్నారు. శివాజీ తన పాలనలో అందించిన రైతు అనుకూల అంశాలను సంఘ్ పరివార్ ప్రచారం చేయడం లేదు. అందుకే శివాజీని చూడడం అంటే శివాజీ వ్యతిరేక ప్రయత్నాలు వ్యతిరేఖించడం దేశ బహూళత్వం, ప్రజా సంస్కృతి కాపాడుకోవడం మన ప్రాథమిక విధిగా ఉండాలి.



**టి.నాగరాజు,**
**ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి,**
**ఫోన్: 9490098292**

# మురికి నీటి నుండి పాపయ్యకుంటను రక్షించాలి

**నిజాంపేట్, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజకవర్గ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని పాపయ్య కుంటలోకి తుర్కచెరువు నుంచి మురికి నీళ్లు డైవర్షన్ చేసి గత నాలుగు సంవత్సరాలుగా మంచినీటి చెరువుని మురికినిడి చెరువు చేయడమే కాకుండా భూగర్భ జలాలు కలుషితం గుర్రపు డెక్క సమస్యతో కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, క్షణమే తురకచెరువు నుండి వచ్చే మురికినీరు రాజధాని స్కూల్ నుంచి బండారు లేఔట్ లో ఎస్ ఎన్ డి పి కల్వాలని తుర్కచెరువు వద్ద కాలనీ ప్రజలు ఆకుల సతీష్, అల్లాడి మహేష్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేయడం జరిగింది, ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలో సర్వే నంబర్ 105లో దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాపయ్య కుంట 2021 వరకూ ప్రజల వినియోగానికి అనుకూలమైన మంచినీటి చెరువుగా ఉండేది. అయితే నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడిన అనంతరం నిర్వహించిన ఎస్ఎన్డీపీ పనుల కారణంగా చెరువులోకి మురికి నీరు చేరి తీవ్రంగా కలుషితమైందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తురుక చెరువు నుండి బండారు లేఔట్, రెడ్డి అవెన్యూ మార్గంగా అంబీర్ చెరువులోకి వెళ్లే వర్షపు నీరు, మురికి నీటి ప్రవాహ మార్గాలను మార్చడంతో గ్రీన్ ఫీల్డ్, మధుర నగర్ ప్రాంతాల మీదుగా పాపయ్య కుంటలోకి డ్రైనేజ్ నీరు



చేరుతోందని తెలిపారు. 2021లో ఎస్ఎన్డీపీ పనుల పేరుతో చేపట్టిన మార్పుల వల్ల పాపయ్య కుంట మంచినీటి చెరువుగా ఉండాల్సిన స్థితి నుంచి మారి మురికినీటి చెరువుగా మారిందని ఆరోపించారు. ప్రస్తుతం సర్వే నంబర్ 109 ప్రాంతంలో ప్రతిరోజూ ఓపెన్ డ్రైనేజ్ రూపంలో మురికినీరు ప్రవహించడం వల్ల దోమల పెరుగుదల, భూగర్భ జలాల కాలుష్యం వంటి సమస్యలు తీవ్రతరం అయ్యాయి. గత నాలుగేళ్లుగా పాపయ్య కుంట చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో దోమల సమస్య పెరిగింది. అదేవిధంగా చెరువు చుట్టుపక్కల ప్రాంతాలు కూడా డ్రైనేజ్ నీటితో నిండిపోవడం ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారింది. ఈ నేపథ్యంలో ఆకుల సతీష్ , కాలనీ ప్రజలు క్రింది డిమాండ్లు చేశారు. తురుక చెరువు నుండి వచ్చే మురికి నీటిని రాజధాని స్కూల్ వద్ద నుండి బండారు లేఔట్ ఎస్ఎన్డీపీ నాలాకు మళ్లించాల అని డిమాండ్ చేశారు. నుంచి మధుర నగర్ ప్రాంతం నుండి వచ్చే డ్రైనేజ్ నీటిని పాపయ్య కుంటలోకి రాకుండా ఎస్ఎన్డీపీ లైన్‌లోకి డైవర్షన్ చేయాలి. పాపయ్య కుంటలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తక్షణమే తొలగించాలి. చెరువును 2021కు ముందు ఉన్నట్లుగా మంచినీటి చెరువుగా పునరుద్ధరించాలి. పాపయ్య కుంట నుంచి సిరి బాలాజీ వరకు రూ. 4 కోట్ల వ్యయంతో 367 స్క్వేర్ మీటర్ల కొత్త ఎస్ఎన్డీపీ డ్రైనేజ్ ఏర్పాటు చేయడం కన్నా, రాజధాని స్కూల్ నుంచి బండారు లేఔట్ వరకు 324 స్క్వేర్ మీటర్ల నాలా నిర్మాణం చేపట్టడం ఉత్తమమని సూచించారు. చెరువు కట్టపై శుభ్రత చర్యలు తీసుకొని వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాల అని తెలిపారు. పాపయ్య కుంటను రక్షించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం, భూగర్భ జలాల పరిరక్షణ దృష్ట్యా ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని కాలనీ ప్రజలు పేర్కొన్నారు.. అల్లాడి మహేష్ గుప్తా, కోటగిరి రాంబాబు గుప్త, కృష్ణమోహన్, రంజిత్, మాధవరావు, అరుణ్ రావు, శ్రీనివాస్, సతీష్, పాండు, సుబ్బరాజు గుప్తా, సునీల్ గుప్తా, కళ్యాణ్ గుప్తా, అల్లం రాము, నాగరాజు, అమలేశ్వరి, శ్రీహరి గుప్తా,సునీల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## బైరామాల్ గూడ ఫ్లై ఓవర్ పూలే పేరు పెట్టాలి



**హయత్ నగర్, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** ఎల్బీనగర్ పరిధిలోని బైరామాల్ గూడ ఫ్లైఓవర్ బ్రిడ్జి కి మహాత్మా జ్యోతిరావు పూలే పేరు నామకరణం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధికార ప్రతినిధి, ఎల్బీనగర్ ఇన్చార్జ్ బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. కొంతమంది స్వార్థ రాజకీయాల కోసం ఎలాంటి త్యాగం చేయని వారి పేర్లు పెట్టడం సబబు కాదని ఈ సందర్భంగా అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే లు గొప్ప సంఘ సంస్కర్తలు అని వారు కొనియాడారు. ఆనాడే ఈ దేశంలో విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని చెప్పినటువంటి మహానుభావులు ఆయనకు భారతరత్న ఇవ్వాలి అని వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా భవన్ కు మహాత్మ జ్యోతిబాపూలే పేరు పెట్టారని, ఎల్బీనగర్ లో బీసీ సమాజము బలంగా ఉందని అందుకే ఇక్కడ మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహం కూడా పెట్టడం జరిగిందని వారు తెలిపారు. కొందరు వ్యక్తుల పేర్లు పెట్టడంలో కొందరు నాయకులు ఎలాంటి త్యాగం, పోరాటం చేయకుండానే వారి వ్యక్తిగత స్వార్థం కోసము వ్యక్తుల పేర్లు ఫ్లైఓవర్లకు పెట్టాలని తహతలాడుతున్నారు అలాంటి ధోరణి మంచిది కాదని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన సంఘం అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్, హైదరాబాద్ ఇన్చార్జ్ బావన, మేడ్చెల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పాకాల నరసింహ, సింగం అరుణ్, ఎన్టీఆర్ నగర్ డివిజన్ అధ్యక్షులు సంపత్ ప్రసాద్, కొత్తపేట డివిజన్ అధ్యక్షులు స్వామి ముదిరాజ్, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటి కారిడార్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** మాదాపూర్ ఐటి కారిడార్ పరిధిలో అంతకంతకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించడానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నడుం బిగించింది. ఇందులో భాగంగా శనివారం టిజిఐఐసి పరిధి లెమన్ ట్రీ, ట్రిడెంట్ గుండా శిల్పారామం వరకు ఇటు కార్పొరేషన్ అధికారులు, జలమండలి విభాగం, అటు సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో జలమండలి విభాగం ఎండి కె అశోక్ రెడ్డి సైబరాబాద్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజనకు పరిస్థితులను వివరించారు.మున్సిపల్, జలమండలి, పోలీస్ విభాగం, నీటిపారుదల, విద్యుత్తు మరియు టిజిఐఐసి అధికారుల సమన్వయంతో రవాణాకు ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా మీటరు వ్యాసంతో కూడిన సివరేజ్ పైప్ లైన్ ను ఏర్పాటుచేసి దుర్గం చెరువుకు అనుసంధానం చేయడం ద్వారా ఐదు నుండి ఏడు మిలియన్ గ్యాలన్ల సాంద్రత కలిగిన మురుగునీటిని శుద్ధి చేసి తరలించడానికి, సదరు నీటిని తిరిగి ఇతర అవసరాల కోసం వినియోగించడానికి స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు సైబరాబాద్ కార్పొరేషన్ కమిషనర్ సృజన తెలియజేశారు.

## మున్సిపాలిటీలో మహిళలకే ప్రాధాన్యం




**పెబ్బేరు, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల్లో మహిళలకే ప్రాధాన్యత సంతరించుకుంది. మున్సిపల్ పరిధిలో 12 వార్డులకు గాను ఏడు వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందగా బిఆర్ఎస్ పార్టీ లో 5 వార్డులు దక్కించుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఏడు మంది గాను 6,7,9 పురుషులు,2,4,5,11 వార్డులలో మహిళలదే పై చేయి సాధించారు.

**గతంలో యాదవులకు 4 స్థానాలు..**

గత మున్సిపల్ ఎన్నికల్లో యాదవ కమ్యూనిటీకి నాలుగు స్థానాలు దక్కగా ఈసారి ఒక స్థానం కూడా దక్కించుకోలేకపోయారు.

**ఎస్సీలకే ప్రాధాన్యత...**

పుర పరిధిలోని 12 వార్డుల గాను ఎస్సీల ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్ పార్టీలో 4,5,7 స్థానాలను దక్కించుకోగా టిఆర్ఎస్ పార్టీ నుండి ఒకటో వార్డులో ఎస్సీలు గెలుపొందారు. రెడ్డి సామాజిక వర్గంలో మహిళా అభ్యర్థి గెలుపొందగా గౌడ సామాజిక వర్గంలో ఒకరు గెలుపొందారు. మైనార్టీ వర్గంలో మహిళా అభ్యర్థి గెలుపొందారు. ఎస్టీ జాబితాలో ఒకరు గెలుపొందారు. బీసీ జాబితాలో 12 వార్డులో మహిళా అభ్యర్థి గెలుపొందారు.
పెబ్బేర్‌లో ముదిరాజ్, యాదవ్ కమ్యూనిటీ సామాజిక వర్గాలకు అధిక ప్రాధాన్యత ఉన్నప్పటికీ ప్రజాబలంలో సముచిత న్యాయం జరగలేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# పేదల ఇండ్ల స్థలం కోసం పోరుకు సిద్ధం

**చేవెళ్ల, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** పేదల ఇళ్ళ జాగా కోసం పోరుకు సిద్ధం కావాలని. ఇండ్ల జాగా వచ్చేవరకు ఇంచు కూడా కదలకుండా ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం నాడు చేవెళ్ల పట్టణం లోని 75వ సర్వే నంబర్ లో గల భూ పోరాట కేంద్రంలో ఈరోజు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జికి కే.రామస్వామి అధ్యక్షతన జరిగిన మూడు సంవత్సరాల వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ..భూమి భుక్తి విముక్తి కోసం నాడు తెలంగాణ సాయుధ రైతన్న పోరాటం చేసిన చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ నేడు పేదల కోసం బడుగు జీవుల కోసం జానెడు జాగ కోసం ఎర్రజెండా పార్టీ పేదల తరఫున పోరాడుతున్నదని జంగయ్య తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమ్యూనిస్టు పార్టీలను ఎర్రజెండాను గొప్పగా కీర్తించడం సంతోషం కానీ అదే పార్టీలు పేదల తరఫున పోరాడుతుంటే పోలీసు కేసులు పెట్టించడం లేదా భూ పోరాటాలు నిర్వహిస్తున్న మహిళలపై దౌర్జన్యాలు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. చేవెళ్ల పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో మూడు సంవత్సరాలుగా పేదలు జానెడు జాగా కోసం ప్రభుత్వం భూమి సర్వే నెంబర్ 75 లో గుడిసెలు వేసుకొని అక్కడే జీవిస్తున్నారు. అక్కడ కరెంటు సౌకర్యం లేకపోయినా మంచినీళ్ల సౌకర్యం లేకపోయినా అవస్థలు పడుతూ పేదలు పోరాడుతుంటే ప్రభుత్వ అధికారులు కానీ స్థానిక ఎమ్మెల్యే గాని వారిని పట్టించుకోకపోవడం బాధాకరమని ఆయన విమర్శించారు. సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు వార్షికోత్సవ సందర్భంగా పార్టీ పతక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ప్రభు లింగం, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, మండల



కార్యదర్శి మల్గారి సత్తిరెడ్డి, జిల్లా సమితి సభ్యులు మంజుల, జే.అంజయ్య, సుధాకర్ గౌడ్, స్వామి, కార్యకర్తలు బాబురావు, యాదగిరి, నర్సింలు, శ్రీను, రవి, లలిత, పెంటయ్య, వెంకటమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**తాండూరు, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కళాశాల కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని చైతన్య కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము.. చదువులమ్మ చెట్టు నీడలో.. వీడలేమంటు... వీడుకోలంటు వెళ్లిపోతున్నాము చిలిపితనపు చివరి మలుపులో.. వి మిస్ ఆల్ ద ఫన్.. వి మిస్ ఆల్ ద జాయ్.. వి మిస్ యూ.. అంటూ ఇంటర్



సెకండ్ ఇయర్ విద్యార్థులు వీడ్కోలు చెప్పుకున్నారు. ఇంతకాలం కలిసి చదువుకున్న స్నేహితులను వదిలి వెళ్లాల్సి రావడంతో గుండె లోతుల్లో నుంచి తన్నుకు వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ కన్నీటితో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. పరీక్షలు అంటే భయపడకుండా ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఎల్లప్పుడూ తాము వెన్నంటూ ఉంటామని పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో మరియు చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జగ్జీవన్ రెడ్డి, యాజమాన్య బృందం నిర్మల మధుసూదన్ రెడ్డి, రాము, శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా నార్సింగి జిహెచ్ఎంసి మణికొండ సర్కిల్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన జిహెచ్ఎంసి కార్మికురాలు బాలమ్మకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, మణికొండ సర్కిల్ యూనియన్ నాయకుడు కే. దేవేందర్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జాజాల రుద్రకుమార్, జిహెచ్ఎంసి యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చుక్క మోహన్ లు మాట్లాడుతూ, మణికొండ ప్రాంతం గ్రామాల నుంచి మున్సిపాలిటీగా మారి ఇటీవల జిహెచ్ఎంసిగా రూపాంతరం చెందిందని, అయితే రెండు నెలలకుపైగా గడిచినా కార్మికులకు జిహెచ్ఎంసి వేతనాలు చెల్లించకుండా మున్సిపాలిటీ వేతనాలే ఇస్తూ కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు బోర్డులు మార్చి బాధ్యతలు తీసుకున్నప్పటికీ, కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో జిహెచ్ఎంసి కార్మికులకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని ధర్నాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఈ హామీలను మేనిఫెస్టోలో చేర్చినా, ఇప్పటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. పని సమయంలో దుమ్ము, ధూళి కారణంగా కార్మికుల ఆరోగ్యం దెబ్బతిని మరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన కార్మికురాలి కుటుంబానికి పిఎఫ్ ఆధారంగా వచ్చే ప్రయోజనాలు వెంటనే అందేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు స్వచ్ఛందంగా ఒక్కొక్కరు రూ.100 చొప్పున సేకరించి రూ.15 వేలను యూనియన్ సమక్షంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. వెంటనే కార్మికులందరికీ జిహెచ్ఎంసి వేతనాలు, ఇన్సూరెన్స్ సౌకర్యం అమలు చేయాలని, లేకపోతే కార్మికులను ఏకం చేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిహెచ్ఎంసి యూనియన్ నాయకులు మనీలా, రమ, లక్ష్మిరాణి, భగవతి, కళ, చంద్రకళ, లలిత, భాగ్యమ్మ, మైసమ్మతో పాటు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ సొసైటీలో సమస్యల పరిష్కారానికి కృషి

- **బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కె. పి. వివేకానంద**

**నిజాంపేట్, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయాల్లో నెలకొన్న సమస్యలపై శనివారం నిజాంపేట్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వీధిలైట్లు, తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజ్ వంటి మౌలిక వసతుల లోపాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో చర్చించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో నివసిస్తున్న నిరుపేదలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు తన సహకారం ఎల్లవేళలా అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ప్రణయ ధనరాజ్ యాదవ్, రాఘవేంద్రరావు, పెద్దిరెడ్డి సుజాత, ఆగం రాజు, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కో-ఆప్షన్ సభ్యురాలు చంద్రగిరి జ్యోతి సతీష్, సీనియర్ నాయకులు సాంబశివరెడ్డి, మేకల మధుసూదన్, దుసకంటి వెంకటేష్, ప్రదీప్, అజయ్ చౌదరి, బిక్షపతి, కాదరయ్య, బొబ్బ శ్రీనివాస్, జశ్వంత్, విద్యాసాగర్, మహిళా నాయకులు లలిత, అలాగే 2-బీహెచ్కే హౌసింగ్ సొసైటీ నిజాంపేట్ ప్రెసిడెంట్ తల్లారి రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ నాయక్, 2-బీహెచ్కే హౌసింగ్ సొసైటీ



బాచుపల్లి చైర్పర్సన్ మొహమ్మద్ ఫర్జానా సలీం, వారి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు జరిపించాలి

- **వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా**

**పరిగి, ఫిబ్రవరి 12 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా మునిసిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకొని పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఖూా తెలిపినారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా, జిల్లాలోని నాలుగు మునిసిపల్ పట్టణాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో, అలాగే కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో,విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచా కాల్చడం, డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగం పూర్తిగా నిషేధించబడినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఫలితాలు వెలువడిన అనంతరం కూడా ప్రజలు సంయమనం పాటించాలని, ఉత్సాహంలో ఎలాంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడవద్దని ఎస్పీ తెలిపినారు. అదేవిధంగా, కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో నిర్దిష్ట పరిధిలో జతీూజ 144 సెక్షన్



అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సెక్షన్ అమలులో ఉన్న సమయంలో ఐదుగురికి మించి గుమికూడడం, నినాదాలు చేయడం, లౌడ్ స్పీకర్లు, డీజేలు, సౌండ్ బాక్స్‌లు లేదా ఇతర శబ్ద విస్తరణ పరికరాల వినియోగం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలోని అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద కదలికలపై నిఘా కోసం ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్,అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, డీజే యజమానులు, ఈవెంట్ నిర్వాహకులు మరియు వారి అనుచరులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా పూర్తయ్యేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ తెలియజేయడం జరిగింది.

## వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి



**తాండూరు, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** ముత్తూట్ ఫైనాన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని తాండూరు కాంగ్రెస్ మహిళా నాయకులు పుల్లా నర్మాదదేవి రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్‌లు అన్నారు.శనివారం తాండూరు పట్టణం పాత మహిళ బ్యాంకు వద్ద కొత్తగా ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని పుల్లా నర్మదాదేవి రెడ్డి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్, మాజీ కౌన్సిలర్లు శోభారాణి, పరిమళ, విజయాదేవి తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముత్తూట్ ఫైనాన్స్ ద్వారా ప్రజలకు, కస్టమర్లకు నాణ్యమైన సేవలను అందించాలన్నారు. సేవలలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ముత్తూట్ గ్రూప్ రిజీనల్ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఏడుపాయల జాతరకు భారీ పోలీసు బందోబస్తు

- ఏడుపాయల జాతరలో సీసీటీవీ నిఘా, కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- క్యూలైన్లు, పార్కింగ్ నిబంధనలు పాటించాలి
- రాత్రంతా ఫుట్ పెట్రోలింగ్, మఫ్టీ పోలీసుల నిఘా
- భక్తులు పోలీసుల సూచనలు పాటించాలి
- జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 15 నుండి 17 వరకు మూడు రోజుల పాటు జరుగనున్న ఏడుపాయల వనదుర్గ మాత జాతరకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. జాతర ప్రాంగణం మొత్తం సీసీటీవీ కెమెరాల నిఘాలో ఉంచడంతో పాటు, భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో దర్శనం చేసుకుని వెళ్లేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అనుమానాస్పద వస్తువులను తాకవద్దని, పోలీసుల సూచించిన ప్రాంతాల్లోనే వాహనాలను పార్క్ చేయాలని సూచించారు. క్యూ లైన్లు తప్పనిసరిగా పాటించాలని, బారికేడ్లు దాటి ముందుకు రావద్దని, చిన్న పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా సమీప పోలీసు సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, గొడవలు లేదా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ షీ టీమ్స్, మహిళా పోలీసు సిబ్బంది, మఫ్టీ పోలీసులను మోహరించినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో ఫుట్ పెట్రోలింగ్, మఫ్టీ పార్టీలు, క్యూఆర్‌టీ టీమ్స్ ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని చెప్పారు. ఈ బందోబస్తులో ఒక అదనపు ఎస్పీ, 4 డీఎస్పీలు, 19 సీఐలు, 66 ఎస్ఐలు, 150 ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 220 కానిస్టేబుళ్లు, 120 మహిళా పోలీసులు, 266 హోంగార్డులు సహా సుమారు 900 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించి మహాశివరాత్రి జాతరను శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డియస్పి లు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, రంగా నాయక్, సీఐ లు, ఎస్సై లు సిబ్బంది ఉన్నారు.

## రోగ నిరోధక టీకా నమోదుల్లో ఖచ్చితత్వమే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. సురేష్ బాబు



**తెలకపల్లి, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** జిల్లాలో రోగ నిరోధక టీకాల కార్యక్రమం సమర్థవంతంగా అమలు కావాలనే ఉద్దేశంతో ఖచ్చితత్వమే లక్ష్యంగా పనిచేస్తున్నామని నాగర్ కర్నూల్ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సురేష్ బాబు అన్నారు. శనివారం మండల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి అర్హులైన చిన్నారికి డ్యూ లిస్ట్ ప్రకారం టీకాలు అందేలా చూడాలని, ఒక్కరిని కూడా మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రికార్డు నిర్వహణ పారదర్శకంగా ఉండాలని, ఆన్‌లైన్ నమోదులు కచ్చితంగా చేయాలని సూచించారు. ఈ తనిఖీల ద్వారా జిల్లాలో టీకాల కార్యక్రమం పటిష్టంగా కొనసాగుతోందని వారు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని కోల్డ్ చైన్ పాయింట్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ నిర్వహిస్తున్న రోగ నిరోధక టీకాల కార్యక్రమంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. వ్యాక్సిన్ నిల్వల రికార్డులు, వ్యాక్సిన్ డ్యూ లిస్ట్‌లు, స్టాక్ రిజిస్టర్లు, ఇవి ఐ ఎన్ ఆన్‌లైన్ నమోదు వివరాలను పరిశీలించి, టీకాల నిల్వలు మరియు వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, ఏపీఓ ఎన్‌డీవీ చారి, వీసీసీఎమ్ దివ్య, హెల్త్ అసిస్టెంట్ రవీందర్ రావు ఫార్మసీ అధికారులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బీరంగూడ గుట్టపై భారీ బందోబస్తు

- భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- శేరిలింగంపల్లి డీసిపి శ్రీనివాస్



**అమీన్‌పూర్, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు బాధ్యతగా విధులు నిర్వహించాలని శేర్లింగంపల్లి డిసిపి శ్రీనివాస్ సూచించారు. బీరంగుల గుట్టపై మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన బంధువస్తు సిబ్బందిని ఉద్దేశించి శనివారం ఆయన మాట్లాడారు. మహాశివరాత్రి సందర్భంగా సుమారు 300 మంది పోలీస్ సిబ్బంది ఐదు సెక్టార్లుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా భక్తిశ్రద్ధలతో విధులు నిర్వహించాలన్నారు. భక్తులపై ఎవరు కూడా దురుసుగా ప్రవర్తించకూడదని సూచించారు. జేబుదొంగలు పై ప్రత్యేక దృష్టిని ఉంచాలన్నారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ డిసిపి రంజాన్ రతన్ కుమార్, రామచంద్రపురం ఏసిపి శ్రీనివాస్ రావు, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ హనుమంతరావు అమీన్పూర్, బొల్లారం ఇన్స్పెక్టర్లు నరేష్, రవీందర్ రెడ్డి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా పర్యావరణ శాస్త్రాల ముగింపు జాతీయ సదస్సు



**నర్సాపూర్, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** బీవీఆర్ఐటీ నర్సాపూర్లోని బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన "వాతావరణం, అంతరిక్షం, పర్యావరణ శాస్త్రాల పురోగతి" జాతీయ సదస్సు రెండవ రోజు ఘనమైన వాలెడిక్టరీ కార్యక్రమంతో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్. జగ్వీర్ సింగ్ , శాస్త్రవేత్త మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సలహాదారు, మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయం, మత్స్యకార రంగం మరియు వనరుల వినియోగంపై ఏర్పడుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ, సుస్థిర అభివృద్ధి కోసం ఈ అంశాలపై మరింత లోతైన పరిశోధన అవసరమని పేర్కొన్నారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా ప్రముఖ పరిశోధనా ప్రయోగశాలలు విద్యాసంస్థల నుండి 70 పరిశోధనా పత్రాలు అందాయి. వివిధ అంశాలపై చర్చలు జరిగాయి. వాటిలో ముఖ్యమైనవి రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహ అనువర్తనాలు భూగోళ, వాతావరణ, పర్యావరణ, సముద్ర అంతరిక్ష శాస్త్రాలలో మోడలింగ్, కృత్రిమ మేధస్సు డేటా విశ్లేషణ పర్యావరణ సుస్థిరత వాతావరణ మార్పు నివారణ వాయుగోళ గతి శాస్త్రం, ఏరోసాల్స్ వాతావరణ వైవిధ్యం ఆధునిక ఫంక్షనల్ మెటీరియల్స్ గాలి నాణ్యత, కాలుష్యం మరియు మానవ ఆరోగ్యంపై ప్రభావాలు అంతరిక్ష వాతావరణం పై వాయుమండల ప్రక్రియలు పై అంశాలపై విస్తృత చర్చలు ప్రశ్నోత్తర సమావేశాలు నిర్వహించబడ్డాయి. తద్వారా అందరికి వాటి ఆవశ్యకతపై అవగాహనా, విశేష జ్ఞానాన్ని ఈ చర్చల ద్వారా పొందటము జరిగింది. ఈ సదస్సు ద్వారా అంతరశాఖ సహకారంతో ప్రాథమిక శాస్త్రం, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు మరియు సామాజిక అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే లక్ష్యాన్ని విజయవంతంగా సాధించింది. వాలెడిక్టరీ ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. సంజయ్ దూబే, డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డా. బి. మృణాలిని శశాంక, 2026 ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. సలౌద్దీన్, కళాశాల మేనేజర్ బాపిరాజు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ విధానాన్ని రద్దుపరిచి ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలి



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** తెలంగాణ అవుట్సోర్సింగ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జిల్లా సమావేశాన్ని శనివారం నాడు నాగర్ కర్నూలు లోప్రైవేట్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగాతెలంగాణ రాష్ట అవుట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సుభాష్ లు హాజరీ మాట్లాడారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు పరుస్తున్న ఏజెన్సీ విధానాన్ని రద్దుపరిచి, నేరుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పి.ఆర్.సి లోని స్లాబ్ విధానాన్ని రద్దు పరచి, క్యాడర్ బేసిక్ వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రతి సంస్వరం 10శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పారామెడికల్ పోస్టులను భర్తీ చేస్తూ, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాంచందర్ జీ, కార్యదర్శి నిరంజన్, ఉపాధ్యక్షులు జి.నరేష్, సందీప్, ఇస్మాయిల్ ఖాన్, రాజశేఖర్, సంపత్, బంగారి, ఆకాంశ, శశిరేఖ, నవిత, తౌఫిక్, రంజిత్ గౌడ్, రజిత, మాధవి, కృష్ణసాగర్, కర్ణ, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

## కారు, బైక్‌ను తప్పించబోయి బోల్తాపడ్డ కంటైనర్

- డ్రైవర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం



**న్యాల్‌కల్, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** ఎదురుగా వస్తున్న కారు, ద్విచక్ర వాహనాలకు పొంచున్న ప్రమాదాన్ని తప్పించబోయి ఓ భారీ కంటైనర్ బోల్తాపడగా, కంటైనర్ వాహన చోదకుడికి తృతిలో ప్రాణాపాయం తప్పిన సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన వాహన చోదకుడు, ఘటన స్థలి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర, లాతూర్ కు చెందిన వాహన చోదకుడు సంబాజీ (వాహన యజమాని) నాసిక్ నుండి కర్ణాటకలోని బీదర్, జహీరాబాద్ మీదుగా హైదరాబాద్ కు వెళ్తుండగా.. న్యాల్ కల్ మండలం, జహీరాబాద్ – బీదర్ రోడ్డు, మంజీరా నది అతి సమీపాన ప్రమాదం చోటు చేసుకుంది. జహీరాబాద్ నుండి బీదర్ వైపున వెళ్తున్న కారు, ద్విచక్ర వాహనాన్ని.. బీదర్ నుండి జహీరాబాద్ వైపుగా వస్తున్న ఓ కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో వాహన చోదకుడు, యజమాని సంబాజీ (33)కి తృటిలో ప్రాణాపాయం తప్పింది. నారింజ ప్రాజెక్టు నుండి గంగ్వార్ ప్రధాన కూడలి వరకు పదుల సంఖ్యలో పలుచోట్ల రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు, బీటలు అత్యంత ప్రమాదకరంగా మారడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరగడం సర్వసాధారణంగా మారింది. ప్రధానంగా రాత్రి వేళల్లో ప్రాణాలను హరి చేతిలో పెట్టుకొని వాహనాలను నడపాల్సిన దుస్థితి నెలకొందని వాహన చోదకులు, ప్రయాణికులు అన్నారు. ముఖ్యంగా ద్విచక్ర, మూడు చక్రాల వాహనాల రాకపోకలకు రోడ్డు మార్గం మరి పెను ప్రమాదకరంగా మారింది. సంబంధిత రోడ్డు, భవనాల శాఖాధికారులు కనీసం మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## సొంత ఖర్చుతో గ్రామానికి ముఖద్వారం ఏర్పాటు



**సదాశివపేట, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** సదాశివపేట మండలంలోని మెలిగిరి పేట్ గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ తన సొంత డబ్బులతో గ్రామానికి ముఖద్వారం నిర్మింప చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ మాట్లాడుతూ గ్రామానికి వచ్చేవారికి బోర్డు లేకపోవడం వల్ల ఇబ్బంది కలుగుతుందని కాబట్టి తన సొంత డబ్బులతో గ్రామానికి ముఖద్వారం నిర్మింప చేయడం జరిగిందన్నారు. గ్రామ అభివృద్ధి కోసం టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి మరియు టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి సహకారంతో నిధులు తీసుకొచ్చి గ్రామంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తానన్నారు. శనివారం గ్రామ ముఖద్వారం సర్పంచ్ షాబుద్దీన్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదయ్య, వార్డ్ మెంబర్లు నరసింహారెడ్డి, శ్రీనివాస్, యాదుల్, పెంటయ్య, పంచాయతీ కార్యదర్శి రాములు, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుభాన్ రెడ్డి, సంజీవరెడ్డి, రియాజ్, మహేందర్ రెడ్డి, మాణిక్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, టేకురి కిష్టయ్య, రత్నయ్య, మల్లేశం, సంగయ్య, చంద్రయ్య, ప్రభు, నగేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## అతి చిన్న వయసులో శివదీక్ష

- ఇరుమూడితో శ్రీశైలం వెళ్ళిన చిన్నారి బాలుడు



**సదాశివపేట, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** సదాశివపేట పట్టణంలోని షెడ్డి వినోద్, శ్వేత దంపతుల కుమారుడు చిన్నారి హరిహరన్ (4) అతి చిన్న వయసులో శివదీక్ష తీసుకొని అందరిని ఆకట్టుకుంటున్నాడు. 41 రోజులపాటు కఠోరమైన శివదీక్ష నియమాలు పాటించి శనివారం దీక్ష ఇరుముడిని కట్టుకొని శ్రీశైల పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్ళాడు. చిన్నపిల్లలు మొబైల్ ఫోన్లు చూస్తూ కాలక్షేపంతో చదువును నిర్లక్ష్యం చేస్తున్న ఈ రోజుల్లో నాలుగు సంవత్సరాల అతి చిన్న వయసులో తల్లిదండ్రుల మాట బుద్ధిగా వింటూ 41 రోజు ప్లాటు శివదీక్ష చేపట్టి కఠినమైన నియమాలు పాటించి దీక్ష పూర్తి చేసిన హరిహరన్ ఇరుముడి నెత్తిన పెట్టుకొని శ్రీశైలానికి వెళ్లడం చూసిన భక్తులు అందరూ భక్తి భావంతో పులకించిపోయారు. చిన్నారి హరిహరన్ ముద్దు ముద్దు మాటలు... మాట్లాడుతూ ఓం నమశ్శివాయ నామస్మరణతో శ్రీశైల మల్లికార్జునుని దర్శనం కోసం బయలుదేరి వెళ్లడం పట్టణంలో చర్చనీయాంశమైంది. చిన్నారి హరిహరన్ శివ దీక్ష అలంకరణలో చూసిన ప్రజలంతా భక్తి భావంతో సంబర పడడం కనిపించింది.

## పట్టపగలే ఇసుక అక్రమ రవాణా..

- రాత్రి,పగలు తేడా లేకుండా ఇసుక తరలింపు
- అంతా మా ఇష్టం అంటున్న ఇసుక, మట్టి మాఫియా
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ,పోలీసు శాఖ అధికారులు



**గద్వాల టౌన్, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో అక్రమ ఇసుక, మట్టి మాఫియా రోజు రోజుకు పెరిగిపోతుంది. గద్వాల,ధరూర్ మండలంలోని పలు గ్రామాలకు పట్టపగలే యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతున్నది. కొందరు ఇసుక వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా,ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టి,ఇసుక దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులు అదును చూసి ఇష్టారాజ్యంగా మట్టి,ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గద్వాల,ధరూర్ మండలాలోని గ్రామ సరిహద్దు కృష్ణానది నుంచి ఇసుకను మండలంలోని నాగర్ దొడ్డి,ధ్యాగదొడ్డి,మాల్ దొడ్డి గ్రామాలతో పాటు ఇతర గ్రామాలకు నారదగడ్డ ఒడ్డు నుంచి స్టీమర్ల నుండి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ గుట్టు చప్పుడు కాకుండా నెంబరు ప్లేటు లేని వాహనాల్లో ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక వ్యాపారం లాభసాటిగా మారడంతో పగలు,రాత్రి అనే తేడా లేకుండా అంతా మా ఇష్టం అన్నట్లు మండల సరిహద్దు దాటుకుని రోజుకు పదుల సంఖ్యలో ఇసుక వాహనాలు వెళ్తున్నా అధికారులు మాత్రం అటువైపు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసు శాఖ అధికారులు తనిఖీలు చేసి ఇసుక వాహనాలను స్వాధీనం చేసుకుని నామమాత్రపు జరిమానాలు విధిస్తూ వదిలేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పోలీసు,రెవెన్యూశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని నడిగడ్డ ప్రజలు కోరుతున్నారు.

# కాంగ్రెస్ గెలుపుపై ఆశ్చర్యం అవసరం లేదు

- అభివృద్ధి కోసం అధికార పార్టీకి ప్రజలు పట్టం
- పట్టణాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యం
- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ గెలుపొందినంత మాత్రాన ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని, అభివృద్ధి కోసం అధికార పార్టీకి ప్రజలు ఓట్లు వేశారని, అధికారంలో ఉన్నఆ పార్టీకి ఓట్లు వేస్తే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు భావించి ఓట్లు వేశారని, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్ అన్నారు. అధికారములో వున్నప్పుడు బి.ఆర్.యస్. కోడా ఇదే కోవాలో ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ గెలిచినంత మాత్రాన గొప్పగా ప్రచారం చేసుకోవడం ఆర్భాటం చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటివరకు రెండు సంవత్సరాలు గడిచినా కూడా ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. రైతు భరోసా, ఆసరా పెన్షన్ పెన్షన్లు రెట్టింపు, ఆడపిల్ల వివాహానికి తులం బంగారం, 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కడ.. ఉచిత ఆరోగ్య పథకాలలో ఒక్క పథకం తప్ప మిగతా పథకాలకు పంగనామాలు పెట్టిందని ఎద్దేవ చేశారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ పుణ్యం వల్ల రాష్ట్రానికి వేలాది కోట్ల రూపాయల నిధులను వివిధ సంక్షేమ పథకాలకు అభివృద్ధి పనులకు మంజూరు చేస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నిర్వీర్యం చేస్తూ నిధులను దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. రేషన్ షాపుల ద్వారా బియ్యం ఎవరు ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అంతేకాక గ్రామీణ ప్రాంతాలు పట్టణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తే అట్టి నిధుల ద్వారా గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆ విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రులు ఎమ్మెల్యేలు గుర్తుపెట్టుకోవాలని ఆయన సూచించారు. సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అన్న విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. పట్టణ మున్సిపాలిటీల అభివృద్ధి విషయంలో సిసి రోడ్లు డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, రోడ్డు వెడల్పు పనులు, వంటి అభివృద్ధి పనులకు బిజెపి ప్రభుత్వం నిధులు ఇస్తున్న సంగతి నిజం కాదా? బిజెపి ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన నిధుల వల్లనే వనపర్తి పట్టణ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు పట్టణాలకు గ్రామాలకు మంజూరు చేయలేదని మున్నూరు రవీందర్ తీవ్రంగా ఆరోపించారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్లపై తిరుగుతుంటే ఈ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చిన ఈ ప్రభుత్వం మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలిచి సంబరాలు చేసుకోవడం బాధాకరమని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పట్టణాలలో గ్రామాలలో ప్రజలకు మౌలిక వసతులు ప్రజా సమస్యలను రైతు సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. భూమి పూజలు శంకుస్థాపనలు తప్ప అభివృద్ధి ముందుకు సాగడం లేదని, సమీకృత గురుకులాల నిర్మాణాల పేరుతో 6600 కోట్ల దోపిడికి రాష్ట్రం దోపిడికి గురి కాలేదా..? విర్ర వేగిన కె.సి.ఆర్‌కు పట్టిన గతే , నేనె రాజు – నేనే మంత్రి అంటున్న నీకు పట్టదా..? అహంకారం, అవినీతి గెలిచినట్టు చరిత్ర లేదు. కొంతకాలం అనిపిస్తుంది అంతే అన్నారు.

## ఘనంగా ఓంకారేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**మిడ్జిల్. ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో ఓంకారేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వినూత్నంగా ట్రాక్టర్ ట్రాలీ. రివర్స్ పోటీలను నిర్వహించారు. పోటీలకు మంచి స్పందన లభించింది. మొదటి బహుమతిగా రూ.2,000, రెండో బహుమతిగా రూ.1,000, మూడో బహుమతిగా రూ.500 నగదు బహుమతులను ప్రకటించారు. మొదటి బహుమతి సత్తి, రెండో బహుమతి నరసింహ, మూడో బహుమతి సంజీవలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములు, ఉపసర్పంచ్ అర్జున్, హరికృష్ణ, రఘు, దామోదర్, గణపతి రెడ్డి, సంజీవ, మధు, శరన్, యాదయ్య, రాజన్న, నాగమైసయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# జాతర ఉత్సవాలను పగడ్బందీగా నిర్వహించాలి

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రిజ్వాన్ పాషా షేక్



**పాలకుర్తి, ఫిబ్రవరి 14(జనంసాక్షి) :** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన స్వయంభు. శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలను పగడ్బందీగా నిర్వహించాలని, అందుకు అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్బాషా షేక్ ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్, లడు, ప్రసాదం తయారు చేయు వంటగదిని పరిశీలించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన కౌంటర్ను, వంట గదిని, పోలీస్ క్యాంపును కూడా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. గుట్ట కింది నుంచి పై వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధులకు, దివ్యాంగులకు దర్శనార్థం వాహనాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. లడ్డు, ప్రసాదాలను నాణ్యత ఉండేలా తయారు చేయాలని, ఎవరైన భక్తులు పిర్యాదు చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతరలో ఎలాంటి ఘటనలు జరుగకుండా పోలీసులు బంధోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్డీఏ పీడీ వసంత, తహసీల్దార్ సరస్వతీ, ఎంపీడీవో వేదవతి, ఏసీపీ నర్సయ్య, సీఐ జానకిరాంరెడ్డి, ఎస్సై పవన్ కుమార్, ఈవో లక్ష్మీప్రసన్న, సూపరింటెండెంట్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో నాయకత్వ లక్షణాలు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు అలవాడతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో కొనసాగుతున్న సి. ఎం. కప్ 2025 పోటీలకు జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి అధికారులు, క్రీడాకారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... గ్రామీణ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రభుత్వం సి ఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని, క్రీడలతో ప్రశాంతత అలవాటు అవుతుందని తెలిపారు. నాయకత్వ లక్షణాలతో టీం వర్క్ ప్రాధాన్యత తెలుస్తుందని, కలిసి పని చేయడంతో ఏదైనా సాధించవచ్చు తెలిపారు. క్రీడలలో గెలుపు, ఓటములు సామాన్యమని, క్రీడా స్ఫూర్తితో ఆటలలో పాల్గొనాలని తెలిపారు. ఒకసారి ప్రయత్నించి రాలేదు అని నిరుత్సాహపడకుండా సాధించే వరకు ఫలితం ఆశించకుండా ప్రయత్నిస్తూనే ఉండాలని తెలిపారు. సి.ఎం. పోటీలలో భాగంగా గ్రామీణ, మండల, నియోజకవర్గస్థాయి స్థాయి పోటీలను పూర్తి చేసుకుని జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల నుండి దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారని, అథ్లెటిక్స్, బాస్కెట్బాల్, జిమ్నాస్టిక్స్, రూలర్ స్కేటింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, సైక్లింగ్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సమయంలో సిబ్బంది సహకారం తక్కువగా ఉన్నప్పటికీ జిల్లాలో క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఒలంపిక్స్ లో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా సాధించవచ్చు అని, క్రీడాకారులు ఏకాగ్రతతో శిక్షణ పొంది క్రీడలలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వివిధ క్రీడ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రమాదశాత్తు పాన్‌షాప్ దగ్ధం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం..



**మంగపేట ఫిబ్రవరి 14(జనంసాక్షి) :** ప్రమాదవశాత్తు పాన్ షాప్ దగ్ధం ఐన సంఘటన శనివారం ఉదయం మండలంలోని మల్లూరు గ్రామంలోని కట్ట మైసమ్మ తల్లి సెంటర్ లో చోటుచేసుకుంది. బాధితుడు అబ్బు వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం రోజువారిగానే పాన్ షాప్‌ను తెరచి షాప్‌లో సామాన్లు శుభ్రపరచుకోవడం జరిగిందని ఇంటికి వెళ్ళి వచ్చే క్రమంలోనే ప్రమాదం జరిగి పూర్తిగా షాపు అగ్నికి ఆహుతి అయిందని బాధితులు వెంకటేశ్వర్లు కన్నీరుమునీరయ్యారు. ఈ ప్రమాదం విద్యుత్ షాక్ సర్క్యూట్ అవ్వడం వలనే ప్రమాదం జరిగిందని ఆ సమయంలో షాపులో మిర్చి కూలీలకు ఇవ్వవలసిన 30 వేల రూపాయల నగదు, అలాగే 60 వేల రూపాయలు విలువగల వస్తువులు కూడా ఉన్నట్లు ఆయన తెలిపారు. షాపులో పెట్రోల్ ఉండడంతో మంటలు మరింతగా ఎగిసిపడగా మంటలు ఆర్పడంలో గ్రామస్తులు తిప్పలు పడ్డారు తెలిపారు. తమ కుటుంబం జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న పాన్ షాప్ అగ్నికి ఆహుతి కావడంతో తమ కుటుంబం రోడ్డు పాలు అయిందని బోరున విలపించారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వేసవిలో ఓవర్‌లోడ్ సమస్యలుండవ్

- ఎన్పీడీసీఎల్ ఘనపూర్ టౌన్ ఏఈ పి.శంకర్



**స్టేషన్ ఘన్ పూర్, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** స్టేషన్ ఘనపూర్ శనివారం పట్టణ కేంద్రంలో 100 కేవిఎ సామర్థ్యం కలిగిన రెండు అదనపు విద్యుత్ నియంత్రికలను ప్రారంభించిన ఏఈ ఆపరేషన్ ఘనపూర్ టౌన్ పగిడిముంతల శంకర్ వేసవిలో విద్యుత్ సరఫరాలో సమస్యలు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. ఉన్నతా ధికారులసహకారంతో ఘనపూర్ పట్టణ పరిధిలో ని విద్యుత్ సరఫరాలో ఓవర్లోడ్ తోపాటు లోల్టేజ్ సమస్యలు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటు న్నామని వేసవిలో వినియోగదారులకు నిరంతర సరఫరా అందించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అందులోభాగంగా ఎస్బిఐ బ్యాంకు పరిసర ప్రాంతంతోపాటు,రైల్వే గేట్ (ఓవర్ బ్రిడ్జ్) ప్రక్క ప్రాంతంలో ఎస్ఎస్-75, ఎస్ఎస్-1 (100ఽ 250)కేవిఎ సామర్థ్యం కలిగిన విద్యుత్ నియంత్రి కలకు అనుసంధానంగా మరోరెండు100కేవిఎ విద్యుత్ నియంత్రికలను శనివారం సిబ్బందితో కలిసి ప్రారంభించామని చెప్పారు,పట్టణ పరిధిలో ఉన్నతాధికారుల సహకారంతో ఇప్పటికి 90శాతం సరఫరాలో సమస్యలు లేకుండా చేయగలిగామని, త్వరలో మరిన్ని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తిం చి పూర్తి స్థాయిలో సరఫరాలో ఇబ్బందులే లేకుం డా చూస్తామని చెప్పారు. పట్టణపరిధిలోనే కాకుం డా పరిసర గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ఉండడానికి ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని, సిబ్బంది తోపాటు ప్రతీ ఒక్కరు విద్యుత్ భద్రతా నియమాలను పాటిస్తూ ఎలాంటి ప్రమాదాలు లేకుండా సహకరిం చాలని కోరారు. విద్యుత్ వినియోగదారులు బకాయిలు లేకుండా విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించా లన్నారు,ఈ కార్యక్రమంలో లైన్మెన్ వాసం శ్రీధర్, అసిస్టెంట్ లైన్మెన్ ఊరడి నాగరాజు,గుత్తేదార్ అమరేందర్, అన్మ్యాండ్ వర్కర్ నామోజు అశోక్, వినియోగదారులు,తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం బీజేపీదే

- బీజేఎల్పీ నేత మహేశ్వరెడ్డి

**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి14 (జనంసాక్షి) :** నిర్మల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కృత్రిమ విజయాన్ని సాధించిందని, నైతిక విజయం బీజేపీదేనని బిజేఎల్పి నేత ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా బిజెపి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించిన నిర్మల్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత మున్సిపల్ ఎన్నికల్లో 1 సీటు తో ప్రారంభమైన భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నికల్లో 13 సీట్లు కైవసం చేసుకుందన్నారు. రాబోయే జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మూడు పార్టీలు ఒక్కటై మేక పోతూ గాంభీర్యం ప్రదర్శించిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేసి 27 వేల ఓట్లు సాధిస్తే,కేవలం బిజెపి 20 వేల 335 ఓట్లు సాధించిందన్నారు. మైనార్టీ ఓటు బ్యాంకుతోనే కాంగ్రెస్ పార్టీ గెలుపొందిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, ముత్యం రెడ్డి, శనిగరపు చిన్నయ్య, నారాయణ రెడ్డి, కూన శివకుమార్, సాధాం అరవింద్, తో పాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ల తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయాభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి

- ప్రజలకు అందుబాటులో సెంట్రల్ బ్యాంక్ సేవలు
- సెంట్రల్ బ్యాంకు ముంబై సెంట్రల్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి మురళీకృష్ణ
- సెంట్రల్ బ్యాంక్ నూతన భవనంలో విధుల నిర్వహణ ప్రారంభం



**నర్సంపేట ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వివిధ ఖాతాదారుల సేవలతోపాటు రైతుల పట్ల వ్యవసాయ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ముంబై సెంట్రల్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి మురళీకృష్ణ స్పష్టం చేశారు. నర్సంపేట పట్టణంలో గల సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నర్సంపేట బ్రాంచ్ ను నూతన హంగులతో పట్టణంలోని అంగడి రోడ్డులో పూర్తిస్థాయిలో బ్రాంచ్ కార్యాలయాన్ని బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్ అధ్యక్షతన సెంట్రల్ బ్యాంకు ముంబై సెంట్రల్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి మురళీకృష్ణ హైదరాబాద్ జోనల్ ముఖ్య అధికారి ధరమ్ సింగ్ నాయక్, వరంగల్ రీజినల్ ముఖ్య అధికారి కృష్ణ మోహన్, వరంగల్ జిల్లా నాబార్డు డిడిఎం టి.రవి, ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ ఫౌండేషన్ డైరెక్టర్ ఏఎస్ కె శర్మలు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ రుణ వితరణ కార్యక్రమం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. అలాగే సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న సెంట్ అగ్రిగోల్డ్ లోన్, సెంట్ ఫుడ్ ప్రొడక్షన్ ప్లస్ రైస్ మిల్లు, సెంట్ జిఎస్టి, సెంట్ తనాఖ వ్యాపారం రుణం, తోపాటు వివిధ పథకాలపై రైతులకు, మహిళా సంఘాల ప్రతినిధులకు, వివిధ రకాల వ్యాపారస్తులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యాంకు ముంబై సెంట్రల్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజలతో నిత్యం ఉంటూ సేవలు అందించడమే మా లక్ష్యం అని అన్నారు. రుణాలు తీసుకొని సకాలంలో చెల్లిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. రైతులు సామూహికంగా సెంటు కోల్డ్ స్టోరేజ్, సెంటు ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ వంటి పథకాలను వినియోగించుసుకోవాలని సూచిం చారు. వ్యవసాయం కోసం విద్యుత్తును ఉపయోగించుకోకుండా ప్రైమ్ మినిస్టర్ కుసుం యోజన సౌర శక్తి పథకం వలన రైతు అన్ని విధాల ఆర్థికంగా ఎదగచ్చని సూచించారు. సెంటు రైస్ మిల్లు ద్వారా అభివృద్ధి కోసం ఐదు కోట్ల నుండి 100 కోట్ల వరకు తక్కువ వడ్డీతో ఈ పథకం ప్రారంభించుకోవచ్చని సెంట్రల్ బ్యాంకు ముంబై సెంట్రల్ ముంబై ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి మురళీకృష్ణ రైతులకు సూచించి పలు పథకాలపై అవగాహన పెంచారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజనల్ కార్యాలయం అధికారులు సాంబయ్య,రాజారాం,శ్రీకాంత్, నర్సంపేట బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ తనుశ్రీ, సిబ్బంది ఉజ్మ,మౌనిక,సాదిక్, గోల్డ్ అప్రైజర్ వీరభద్రయ్యాచారి తో పాటు పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# భారతదేశంలోనే అరుదైన పంచలింగాల శివాలయం

- కాకతీయుల కాలం నుండి పూజలు అందుకుంటున్న శివ కుటుంబం
- కోరి కొలిచే భక్తులకు కొంగు బంగారం
- భారతదేశంలోనే ఏకైక దక్షిణముఖ పంచలింగాల శివాలయం



**ఆత్మకూర్, ఫిబ్రవరి 14 (జనంసాక్షి):** కాకతీయుల సామ్రాజ్యకాలంలో ప్రజలు అనారోగ్యాలకు గురవుతూ మృత్యువాత పడుతున్నారని ఋషులు తపస్సు చేసిన పుణ్యభూమి లో దక్షిణముఖ పంచలింగాల శివాలయం నిర్మాణం చేసి పూజలు చేస్తే శివపార్వతుల అనుగ్రహం కలుగుతుందని వేద పండితుల ఆదేశాలనుసారం నిర్మాణం చేసినట్లు పూర్వీకుల ద్వారా తెలుస్తుంది. ఓరుగల్లు కోటలో కాకతీయుల కాలంలో కరువు కాటకాలతో పాటు ప్రజలు మృత్యువాత పడుతుండడంతో నివారణ కోసం కాకతీయ రాజులు వేద పండితుల ఆదేశాల అనుసారమే ఎంతో భక్తి శ్రద్ధలతో దక్షిణముక పంచలింగాల శివాలయం నిర్మాణం చేసినట్లు చరిత్ర తెలుపుతుంది. నిర్మాణం చేసి నిత్య పూజలు చేస్తున్న క్రమంలో ప్రజలు పాడిపంటలు సుఖ సంతోషాలతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవనం సాగించేవారు. కాకతీయ రాజులు నిత్యం రాజ పాలన చేసే ముందు పంచలింగాల శివాలయములో నిత్యం అభిషేకాలు నిర్వహించిన అనంతరం కార్యక్రమాలు నిర్వహించే వారని తెలిసింది. అప్పటినుండి ఇప్పటివరకు పూజలు అందుకుంటున్న పంచలింగాల శివాలయములో భక్తిశ్రద్ధలతో పూజలు చేసే భక్తుల కోరికలు శీఘ్రమే నెరవేరుతున్నాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. 1000 సంవత్సరాలు పూర్తి చేసుకుని పునర్నిర్మానం చేసుకున్న పంచలింగాల శివాలయం నిర్మాణముకు ఇక్కడికి వచ్చి కోరిన కోరికలు నెరవేరడంతో హైదరాబాద్ తో పాటు ఇతర దూర ప్రాంతాలకు చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో విరాళాలు అందించిన విషయం తెలిసిందే. శివరాత్రి రోజు పంచ లింగాలకు అభిషేకాలు చేసి జాగారం చేసిన భక్తులకు శివపార్వత సంపూర్ణ అనుగ్రహంతో సకల విజయాలు, ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు కలుగుతున్నాయని భక్తుల విశ్వాసముతో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి పంచలింగాలకు పంచ అమృతాలతో అభిషేకాలు, రుద్ర పారాయణం, నమ్మక చమకాలతో అభిషేకాలు నిర్వహించబడుతాయి. అలాగే జాగారం పర్వదినాన్ని పురస్కరించుకొని వేద పండితుల చేత ప్రత్యేక అభిషేకాలు, ఒగ్గు కథలు, కోలాటములు, భరతనాట్యం, తో పాటు అనేక భక్తి కార్యక్రమాలను నిర్వహించ బడుతాయని ఆలయ కమిటీ బృందం పేర్కొన్నారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో శివరాత్రి సందర్భంగా విశేష పూజలు చేసి శివపత్రులు అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరుతున్నారు.

# అక్రమంగా ఇసుక రవాణా



**కడెం, ఫిబ్రవరి 14(జనంసాక్షి) :** గోదావరి నది గత కొన్ని రోజుల క్రితం వరకు నిండికుండ లాగా ప్రవహించడంతో పెద్ద ఎత్తున గోదావరిలో ఇసుక మోటలు పెట్టింది. ఇప్పుడు అది అక్రమార్కులకు ఓ వరంగా మరి ఇసుక రవాణా జోరుగా కొనసాగుతుంది. కడెం మండలంలోని బెల్లాల్, చిట్యాల గ్రామాలకు ఆనుకొని ప్రవహిస్తున్న గోదావరి నది తీరం నుండి మండలంలోని పలువురు మాఫియా ముఠాలు గత కొద్ది రోజుల నుండి ఇసుక రవాణా విచ్చలవిడిగా జోరుగా కొనసాగిస్తున్నారు. ఇసుక గోదావరి నుండి ట్రాక్టర్లలో తీసుకోవచ్చుకుంటు గ్రామాలకు కొద్ది దూరంలో ఉన్న అడివి, ఇతర ప్రాంతంలోనీ ఖాళీ ప్రదేశంలో కుప్పలుగా డంపు చేసి రాత్రికి రాత్రే వేరే ఇతర ప్రాంతాలకు పట్టణాలకు టిప్పర్లు, లారీలలో పగడ్బందీగా మారుస్తున్నట్లు పలు ప్రదేశాల్లో ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. శుక్రవారం రోజున గోదావరి నుండి ట్రాక్టర్లలో ఇసుక రవాణా కొనసాగుతున్న సమయంలో జనం సాక్షి కెమెరాకి చిక్కగా ఫోటో క్లిక్ మనిపించింది. ట్రాక్టర్లలో ఇసుక రవాణా కొనసాగుతున్న ఈ విషయంపై ఎమ్మార్వో ప్రభాకర్ ను జనం సాక్షి విచారణ కోరగా మేము ఎవరికీ ఇసుకను తరలించడానికి ఎలాంటి పర్మిషన్స్ ఇవ్వలేము అని అన్నారు. నేను మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిర్మల్ లో ఉన్నానని ఆర్ ఐ శారద కి సమాచారం అందిస్తానని అన్నారు. ఆర్ ఐ శారద కి కాల్ చేసి కాల్ చేసి విచారణ అడగగా సంబంధిత ఆఫీస్ పనులపై బయట ఉన్నారని చిట్యాల జీ పి ఓ రజకల ను ఘటన స్థలానికి పంపిస్తాను అని అన్నారు. చిట్యాల జీ పి ఓ రజకల దాదాపు 15 ట్రాక్టర్లు నడుస్తున్న సమయం లో ఘటన స్థలానికి వచ్చినప్పటికీ వాటిని పట్టుకోకపోవడం తో పాటు ఇక్కడ ఏమి వాహనాలు లేవు అని చెప్పడం గమనాత్మకం. గత వారం రోజులనుండి చూసి చూడనట్టు విడిచిపెట్టడమే కాకుండా అసలు ఏం వాహనాలు లేవు అని చెప్పడంతో పై సంబంధిత అధికారుల నిర్లక్ష్యం మే దీనికి కారణమని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇందులో పలువురు అధికార పార్టీ నాయకుల అస్తమున్నట్లు, అధికార పార్టీ నాయకులు ఒత్తిళ్ల వల్లే సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై సంబంధిత పై ఉన్నత అధికారులు వెంటనే స్పందించి ఇసుక మాఫియాని అరికట్టాలని పలువురు ఉన్నతాధికారులను కోరారు.



# పుల్వామా అమరవీరులకు నివాళులు...

**ములుగు/వెంకటాపూర్,ఫిబ్రవరి14(జనం సాక్షి):** 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా దాడిలో అమరులైన 40 మంది భారత సైనికులను స్మరించుకుంటూ అమరావతి విద్యాలయం హై స్కూల్లో ఘనంగా శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు, సిబ్బంది సమక్షంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరగాని రాజయ్య,డైరెక్టర్లు వీరగని ఆనందం,మూల రాజయ్య, అంతటి సుమలత మాట్లాడుతూ పుల్వామా దాడి దేశాన్ని కలచివేసిన దుర్ఘటనగా నిలిచిందని, దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన సైనికుల త్యాగం ఎప్పటికీ భారత ప్రజల హృదయాల్లో నిలిచిపోతుందని పేర్కొన్నారు.

# పదో తరగతి పరీక్షల మెటీరియల్ పంపిణీ



**ములుగు/వెంకటాపూర్,ఫిబ్రవరి14(జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం రోజున వి కెన్ డు అసోసియేషన్ ఆధ్వర్యంలో పదోవ తరగతి పరీక్షల మెటీరియల్ (ప్యాడ్ లు,పెన్నులు,స్కేల్ లు రబ్బర్లు పెన్సిల్‌లు) పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.రాధిక అధ్యక్షత వహించగా జవహర్ నగర్ లో మండల విద్యాధికారి ప్రభాకర్ చేతులమీదుగా అందించారు. హాజరైన అసోసియేషన్ ప్రతినిధులు నరేష్,అశోక్ కమలాకర్ పిఆర్టియు ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో వెంకటాపూర్ మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇస్తున్నామని తెలిపారు మాట్లాడుతూ"విద్యార్థులే దేశ భవిష్యత్తు. వారి భవితను తీర్చిదిద్దడమే మన ప్రధాన కర్తవ్యం"అనే నినాదంతో, చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే అనే లక్ష్యం తో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక సామాజిక సేవా కార్యక్రమం లతో పాటు గుణాత్మక విద్యాభివృద్ధి,సాధనయే లక్ష్యంగా ఈ సంస్థ పని చేస్తున్నదని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు అందిపుచుకొని చదువులో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించాలని పేద విద్యార్థులకు మా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ మార్కులు సాధించా లని కోరారు వెంకటాపూర్ మండలం లోని 5 ఉన్నత పాఠశాలలకు కేజీబీవీ, టిఎస్ఎంఎస్ జవహర్ నగర్ లో కూడా ఈ పరీక్షల మెటీరియల్ ను అందిస్తున్నామని తెలిపారు మండల విద్యాధికారి ప్రభాకర్,ఉపాధ్యులు జనగాం బాబురావు. ఫిరోజ్, కిరణ్, మహేష్, కిషోర్, అంబేద్కర్, బి.వేణు,జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 ఫిబ్రవరి 2026

# భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచింది బోధన్ ఏకచక్ర శివాలయం

● భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసిన ఈవో రాములు

**బోధన్, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** బోధన్ పట్టణంలో వెలసిన బోధన్ ఏక చక్ర శివాలయం భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచింది. అయితే ఆదివారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ ఈవో నాయకం రాములు, ఎండోమెంట్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. ఇక్కడి విగ్రహం స్వయంభు కావడంతో లక్షలాదిమంది భక్తులు ఆలయం కు వచ్చి మహాశివరాత్రి రోజు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. కోరిన కోరికలు తీర్చే పరమశివుడు మహాశివరాత్రి రోజు మరింత మహిమాత్ముడై ఉంటాడని నమ్మకంతో ఎంతోమంది భక్తులు శివరాత్రి రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు తమ మొక్కులు



తీర్చుకుంటారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి నాయకం రాములు భక్తుల కోసం మంచినీటి వసతి కల్పించడంతో పాటు రద్దీని నియంత్రించేందుకు భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. అలాగే ప్రత్యేక దర్శనాన్ని సైతం ఏర్పాటు చేసి రద్దీని నియంత్రించే విధంగా చర్యలు తీసుకున్నారు. బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఆలయంపై ప్రత్యేక దృష్టి సారించి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఈ నెల 11వ తేదిన ప్రారంభమైన శివరాత్రి బ్రహ్మోత్సవాలు 15వ తేదీన మహాశివరాత్రి పురస్కరించుకొని రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణ వేడుకలు, అర్ధరాత్రి దాటిన తర్వాత స్వామివారికి నిశి పూజను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం 16వ తేదీన మధ్యాహ్నం ఒంటిన్నర గంటలకు స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించి అనంతరం మహా అన్నదానాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈవో నాయకం రాములు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గణేష్ శర్మ, మహేష్ పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆసుపత్రిలో గ్రూప్ - 1 అధికారుల అధ్యయన పర్యటన



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో తమ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 134 మంది గ్రూప్--1 అధికారులు శనివారం అధ్యయన పర్యటన నిర్వహించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను అధికారులు సందర్శించి వైద్య సేవల నిర్వహణ విధానాలను తెలుసుకున్నారు. గాంధీలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఇక్కడ లభ్యమయ్యే వైద్య సౌకర్యాలు,వసతి,ఓపీ విభాగంలో పేషంట్లు,క్రిటికల్ కేర్ సర్వీసులు, మాతా శిశు సంరక్షణ కేంద్రం,తదితర అంశాలపై అధ్యయనం చేశారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. వాణి, ఆర్ఎంవోలు డా.కళ్యాణ్ చక్రవర్తి, డా.రజని, డా.యోగేందర్, వివిధ విభాగాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాంపల్లి రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులను పరిశీలించిన అధికారులు



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** నాంపల్లి రైల్వే స్టేషన్ లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను శని వారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పరిశీలించారు. రూ. 327.27 కోట్ల వ్యయంతో జరుగుతున్న పునరాభివృద్ధి పనులు ఏ మేరకు పూర్తయ్యాయనే విషయాలను నేరుగా పరిశీలిం చేందుకు ఆయన రైల్వే అధికారులతో కలిసి నాంపల్లి స్టేషన్ను సందర్శించారు. ఈ సందర్భంగా డివిజనల్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాబోయే స్టేషన్ అభివృద్ధి ప్రణాళికల గురించి జనరల్ మేనే జ ర్‌కు దృష్టికి తీసుకొనివచ్చారు. ఆయన పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్న ప్రదేశంలో పనులను సమీ క్షించారు. ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి రైలు వినియోగదారుల కోసం నూతనంగా ఏర్పాటు చేస్తున్న వస తులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవడానికి పనులను వేగవంతం చేయాలని ఆయన అధికారు లను ఆదేశించారు. ప్రధాన మౌలిక సదుపాయాల మార్పులతో కూడిన పునరాభివృద్ధి పనుల జరుగుతున్న సమ యం లో ప్రయాణీకుల అసౌకర్యాన్ని తగ్గించడానికి అనుసరించాల్సిన సమగ్ర చర్యలపై జనరల్ మేనేజర్ డివి జన్ అధికారులకు ఆదేశించారు. ఆ తరువాత స్టేషన్ పశ్చిమ వైపున ఉన్న క్యారేజ్ మెయింటెనెన్స్ డిపోను కూడా పరిశీలించారు. డిపో లోని పనితీరు గురించి, సిబ్బందికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

# పుల్వామా అమరవీరులకు నివాళి

**ఖమ్మం, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** ఖమ్మం పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ త్రివేణిస్కూల్ లో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, యాజమాన్యం ఈరోజు పుల్వామా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. 2019 ఫిబ్రవరి 14 జమ్ము కాశ్మీర్లో సైనిక బలగాన్ని తీసుకు వెళుతున్న వాహనాల కాన్వాయ్ పై ఉగ్రవాదులకి సంబంధించిన కారుతో ఆత్మాహుతి దాడి జరిపి 40 మంది అమరవీరుల మృతికి కారణమైన ఈ రోజున భారతదేశంలో బ్లాక్ డేగా పిలుచుకుంటారు. ఈ సందర్భంగా త్రివేణి డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ సైనికుల యొక్క గొప్పదనాన్ని వివరించారు, అలాగే వారి మృతికి సంతాప సూచికంగా 2 నిమిషాలు మౌనం పాటించారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మన దేశ రక్షణకోసం గడ్డకట్టే చలిలో సైతం, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, వారి కుటుంబాలను సైతం ఇక్కడే విడిచి పోరాడుతున్న మన సైనికులు నిజమైన హీరోలని, వారి పట్ల మనం ఎప్పుడు గౌరవభావం కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ ,వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా , క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ మరియు సందీప్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




## మేళ్లచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విజయవంతంగా నార్మల్ డెలివరీ



**మేళ్లచెరువు, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** మేళ్లచెరువు, చింతలపాలెం ఉమ్మడి మండల ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం రాత్రి ఒక గర్భిణికి వైద్యులు అత్యంత సురక్షితంగా నార్మల్ డెలివరీ చేశారు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన జి. కళ్యాణి డెలివరీ కోసం రాత్రి 9 గంటల సమయంలో ఆసుపత్రికి వచ్చారు. వెంటనే స్పందించిన డాక్టర్ సుధాకర్ నాయక్, నర్సింగ్ ఆఫీసర్లు, ఆసుపత్రి సిబ్బంది సమన్వయంతో ఆమెకు సాధారణ ప్రసవం నిర్వహించారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని డాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ నాయక్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ అనుమతితో, జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి మేళ్లచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అత్యాధునిక వైద్య పరికరాలు అందినట్లు తెలిపారు. డెలివరీకి అవసరమైన ఆటో క్లేవ్, సెక్షన్ అప్పారేటస్, వేయింగ్ మిషన్, ఆక్సిజన్ సిలిండర్లు, బేబీ వార్మర్, ట్రేస్, మరియు డెలివరీ టేబుల్ వంటి అన్ని వసతులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మండల పరిధిలోని గర్భిణీ స్త్రీలు, గ్రామ ప్రజలు ప్రసవాల కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఈ అత్యాధునిక వసతులను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సుధాకర్ నాయక్, సిబ్బంది కోరారు.

## హస్తగతం కానున్న బోధన్ మున్సిపల్ చైర్మన్

● మున్సిపల్ చైర్మన్‌గా తూము శరత్ రెడ్డి



**బోధన్, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** బోధన్ మున్సిపల్ చైర్మన్ ఎంపిక కోసం బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఎక్స్ అఫీషియో ఓటును నమోదు చేసుకున్నట్లు బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ధ్రువీకరించారు. బోధన్ మున్సిపాలిటీలో 38 వార్డులకు గాను 17 కాంగ్రెస్, 12 ఎంఐఎం, 5 బీఆర్ఎస్, 3 బిజెపి ఒకటి ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలుపొందారు. అయితే మ్యాజిక్ ఫిగర్ 19 మంది కౌన్సిలర్ల బలం నిరూపించుకుంటే వారికే చైర్మన్ పీఠం దక్కనుంది. అయితే అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన 17 మంది కౌన్సిలర్లు ఉండడంతో ఇంకా ఇద్దరు కౌన్సిలర్ల మద్దతు కూడగట్టుకోవాల్సి ఉంటుంది. కాగా ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు 17 మందితో పాటు ఇండిపెండెంట్ గా గెలుపొందిన కౌన్సిలర్ వారితో పాటే వెళ్ళినట్లు సమాచారం. దాంతో వారి సంఖ్య 18 కు చేరినట్లు అయింది. అంతేకాకుండా బిజెపికి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు సైతం అధికార కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒకవేళ అలా జరిగితే అధికార కాంగ్రెస్ పార్టీ మొత్తం 20 మంది కౌన్సిలర్లు మరియు ఎక్స్ అఫీషియో ఓటు కలుపుకొని మున్సిపల్ చైర్మన్ ను హస్తగతం చేసుకోనుంది. అయితే చైర్మన్ రేసులో తూము శరత్ రెడ్డి పేరు ఖరారు అయినట్లు విశ్వసనీయ సమాచారం. వైస్ చైర్మన్ మైనార్టీ కౌన్సిలర్ కు అందించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

● స్కూటీ, బైక్ డీ

**బొంరాస్‌పేట, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** మండల పరిధిలోని రేగడి మైలారం గ్రామ సమీపంలోని మూలమలుపు దగ్గర శనివారం స్కూటీ, బైక్ ఢీకొన్న సంఘటనతో రోడ్డు ప్రమాదం సంభవించింది.స్థానిక ఎస్సై బాల వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం దీప్లా నాయక్ తండాకు చెందిన రాథోడ్ దేవుల నాయక్(65) తన టీవీఎస్ ఐ-క్యూబ్ స్కూటీపై ప్రయాణిస్తుండగా పరిగి నుండి కొడంగల్ పైపు వస్తున్న యూనికాన్ బైక్ పై వెళుతున్న దౌల్తాబాద్ మండలం చెల్లాపూర్ గ్రామానికి చెందిన చింతకాయల గురువేష్(23) అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ స్కూటీని ఢీకొనడంతో దేవుల నాయక్ రెండు కాళ్లకు, తలకు తీవ్రమైన గాయాలు కావడంతో కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు రిఫర్ చేయగా ఒమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై రాథోడ్ సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వరుస దొంగతనాలు, దోపిడీలకు పాల్పడిన నిందితుల అరెస్ట్

**చేర్యాల, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలు, దోపిడీ ఘటనలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు జాలపల్లి గ్రామానికి చెందిన గుండెల్లి రమేష్, లింగపూరుకు చెందిన మసంపల్లి రాములు చెందిన వారిగా గుర్తించారు. వారి వద్ద నుండి బంగారు పుస్తెల తాడు 3 తులాలు, బంగారు నల్లపూసల తాడు 2 తులాలు,వెండి పట్టగొలుసులు 10 తులాలు,ఒక హోండా షైన్ మోటార్ సైకిల్, ఒక కత్తి, కీప్యాడ్ ఫోన్,రెండు నిందితుల సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ సదానందం శనివారం చేర్యాల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ కేసును చేదించడంలో ముఖ్యపాత్ర వహించిన రమేష్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చేర్యాల, ఎండి ఆసిఫ్ ఎస్ఐ మద్దూరు, మద్దూరు కానిస్టేబుళ్ళు యం. రవి, పి.అనిల్, పి నాగరాజు, ఏ.గణేశ్ లను సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించారు..



## అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని హైడ్రాకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి




**ఉప్పల్, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామాంతపూర్ డివిజన్‌లో ఉన్న ఇంద్రానగర్ చిన్న చెరువు అభివృద్ధి కోసం తక్షణ నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. చెరువు పునరుద్ధరణకు సంబంధించిన పలు సమస్యలను ఆయన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంద్రానగర్ చిన్న చెరువు పరిసరాల్లో పూడిక పేరుకుపోవడం, చెరువు చుట్టూ వ్యర్థాలు పేరుకుపోవడం వలన ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. చెరువులో పూడిక తొలగింపు, పరిసరాల శుభ్రపరిచే కార్యక్రమాలు, చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు, సుందరీకరణ పనులు చేపట్టడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు.ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా నిధులు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే రామాంతపూర్ మెయిన్ రోడ్ చెరువు సుందరీకరణ పనుల కోసం రూ.19 కోట్లు మంజూరు చేసినందుకు కమిషనర్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంథం నాగేశ్వరావు, సురం శంకర్, చాంద్ పాషా, ఆపిల్ శ్రీను, మారుతి, ప్రేమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. చెరువు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## విద్య మనిషిని ఉన్నత స్థాయిలో నిలబెడుతుంది

● డి.ఎస్.పి శివరాంరెడ్డి



**నల్లగొండ, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** సమాజంలో విద్య ఒక్కటేనని అత్యంత స్థానంలో నిలబెట్టేదనీ ధనం, అధికారం కాదని నల్లగొండ డిఎస్పి శివరాంరెడ్డి పి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లాస్ట్ మినిట్ రివిజన్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. చదువురాని మనిషి వ్యక్తిత్వం వికసించడమే కాకుండా సమాజాభివృద్ధికి బలమైన పునాది పడుతుందనీ, విద్య ఉన్నచోట అవగాహన ఉంటుందని, అవగాహన ఉన్నచోట అభివృద్ధి జరుగుతుందని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు వచ్చిన అనేకమంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండి తమ లక్ష్యాలను నెరవేర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్య మనిషికి కేవలం ఉద్యోగ అవకాశాల కోసమే కాదని మంచిని చెడును గుర్తించే వివేకాన్ని కూడా ఇస్తుందని అన్నారు. పి ఆర్ ఆర్ పౌండేషన్ చైర్మన్ చలం పాండురంగరావును డిఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా పిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు మాట్లాడుతూ విద్యతోనే సమాజ పురోగతి సాధ్యమవుతుందని విద్య మనిషిని అంధకారంలో నుంచి వెలుగు వైపు నడిపించే మార్గదర్శిఅని అన్నారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి , ప్రిన్సిపాల్ భవాని, ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విస్తృతంగా వాహనాల తనిఖీలు

● రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్..

**కథలాపూర్, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** కథలాపూర్ మండలంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రవి కిరణ్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం మద్యం తాగి వాహనాలు నడిపే డ్రైవర్ల వల్ల సంభవించే ప్రమాదాలను నిరోధించేందుకు ఈ తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారికి జరిమానాలు విధించారు.ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు రోజూ క్రమం తప్పకుండా చేపడుతున్నామని ఎస్సై రవి కిరణ్ తెలిపారు.



# మున్సిపల్ పీఠాలకు ఈ నెల 16న ఎన్నికలు

● ఎస్ఈసీ కీలక ఆదేశాలు

**చండూరు, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని మున్సిపాలిటీలు మరియు కార్పొరేషన్లలో ఖాళీగా ఉన్న మేయర్, డిప్యూటీ మేయర్, ఛైర్మన్ మరియు వైస్ ఛైర్మన్ పదవుల భర్తీకి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముహూర్తం ఖరారు చేసింది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలక నిబంధనలను వెల్లడిస్తూ.. అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

**ఎన్నికల షెడ్యూల్ వివరాలు :**

ఈ నెల 16న రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు మరియు 7 కార్పొరేషన్లలో ఎన్నికలు జరగనున్నాయి.ఫిబ్రవరి 16 మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నిక ప్రక్రియను పూర్తి చేస్తారు.ఈ సమావేశానికి సంబంధించి సభ్యులందరికీ 'ఫాం-2' ద్వారా నోటీసులు అందజేయాలి. సమావేశానికి ఒక రోజు ముందు అంటే 15వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటల లోపు సభ్యులందరికీ ఈ నోటీసులు అందేలా చూడాలని కమిషన్ ఆదేశించింది.

**ఎక్స్ అఫీషియో ఓటుపై కొత్త నిబంధన :**


గతంలో ఎక్స్ అఫీషియో సభ్యులు (ఎంపీలు, ఎమ్మెల్యేలు) తమకు నచ్చిన మున్సిపాలిటీని ఎంచుకుని ఓటు వేసే అవకాశం ఉండేది. అయితే, హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారం ఎస్.ఈ.సీ నిబంధనలను సవరించింది.ఎక్స్ అఫీషియో సభ్యులు ఓటు వేయాలంటే సదరు మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్‌లో స్థానిక ఓటరుగా నమోదై ఉండటం తప్పనిసరి.స్థానిక ఓటరుగా నమోదు కాకపోతే వారి ఓటు చెల్లదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.

**ఎన్నిక విధానం :**




వార్డు సభ్యులు మరియు ఎక్స్ అఫీషియో సభ్యుల మొత్తం ఓట్లలో 50 శాతానికి పైగా ఓట్లు సాధించిన అభ్యర్థిని మేయర్/ఛైర్మన్‌గా ప్రకటిస్తారు. ఇదే పద్ధతిలో డిప్యూటీ మేయర్ మరియు డిప్యూటీ ఛైర్మన్ల ఎన్నిక కూడా జరుగుతుంది.







## రూ.7 లక్షల కోట్ల సంపద ఆవిరి

### సూచీలకు 1% పైగా నష్టం.. లోహ, ఐటీ షేర్లలో అమ్మకాలు

**న్యూఢిల్లీ:**అన్ని రంగాల షేర్లలో ముఖ్యంగా ఐటీ, లోహ రంగాల్లో అమ్మకాలు తీవ్రమై మన స్టాక్ మార్కెట్ భారీగా నష్టపోయింది. సెన్సెక్స్, నిఫ్టీ 1 శాతానికి పైగా క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు మన మదుపర్ల సెంటిమెంటును దెబ్బతీశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 5 పైసలు తగ్గి 90.66 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.18% తగ్గి 67.41 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.7.02 లక్షల కోట్లు తగ్గి రూ.465.46 లక్షల కోట్ల (5.13 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.ఆద్యంతం నష్టాల్లోనే..: బీఎస్ఈ సెన్సెక్స్ 82,902.73 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 83,674.92) ఆరంభమైంది. అదే ఒరవడిని కొనసాగిస్తూ 82,534.55 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 1048.16 పాయింట్ల నష్టంతో 82,626.76 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 336.10 పాయింట్లు కోల్పోయి 25,471.10 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,444.30 వద్ద కనిష్ఠాన్ని, 25,630.35 వద్ద గరిష్ఠాన్ని తాకింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 953.64 పాయింట్లు, నిఫ్టీ 222.6 పాయింట్లు నష్టపోయాయి. ఆ రెండు మినహా..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో ఎస్బీఐ, బజాజ్ ఫైనాన్స్ మినహా మిగతా కంపెనీల షేర్లన్నీ నష్టాల్లో ముగిశాయి. హిందుస్థాన్ యునిలీవర్ 4.35%, ఎటర్నల్ 4.26%, టాటా స్టీల్ 2.35%, టైటన్ 2.23%, టీసీఎస్ 2.17%, పవర్‌గ్రిడ్ 2.17%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.07% చొప్పున తగ్గాయి. బజాజ్ ఫైనాన్స్ 2.43%, ఎస్బీఐ 0.53% పెరిగాయి. గాడియమ్ ఐవీఎఫ్ అండ్ వుమెన్ హెల్త్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈనెల 20న ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ఐపీఓ ద్వారా రూ.150- 200 కోట్లు సమీకరించనుంది. హిందుస్థాన్ యునిలీవర్ నుంచి విభజన అయిన నేపథ్యంలో క్వాలిటీ వాల్స్ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో ఈనెల 16న నమోదవుతాయి. వెల్డింగ్ ఉత్పత్తులు రూపొందించే ప్రీమియర్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్, పరుపుల తయారీ సంస్థ డ్యూరోఫ్లెక్స్, ఫార్మా కంపెనీ హెగ్జాగాన్ న్యూట్రిషన్, ఓమ్ పవర్ ట్రాన్స్‌మిషన్ సంస్థల ఐపీఓ ప్రతిపాదనలకు సెబీ ఆమోదం లభించింది. ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ మార్కెట్లోకి అడుగుపెట్టే ప్రణాళికలో భాగంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)తో దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు నేషనల్ కమొడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌సీడీఈఎక్స్) ప్రకటించింది.

# 'సేఫ్‌కోడ్'తో ఏఐకు అడ్డుకట్ట




**న్యూఢిల్లీ:**రాజీవ్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. ఇంతలో ఫోన్ మోగింది. కట్ చేశాడు. మళ్లీ ఫోన్. ఎత్తగానే అవతలి నుంచి 'మావయ్య గారికి యాక్సిడెంట్ అయ్యింది. ఇప్పుడే హాస్పిటల్‌కి వచ్చా. ఇక్కడ ఇన్సూరెన్స్ చెల్లదంటున్నారు. హాస్పిటల్ వారు అడ్వాన్స్‌గా రూ.లక్ష కట్టమంటున్నారు. ఈ నంబర్‌కి పంపించు' అంటూ భార్య ఫోన్ కట్ చేసింది.ఇలా ఎవరైనా ఫోన్ చేసి 'ఎమర్జెన్సీ' అని చెప్పగానే కాళ్లూచేతులూ వణికిపోతాయి. ఒళ్లంతా చెమటలు పట్టేస్తాయి. కంగారులో ఏం చేస్తామో మనకే తెలీదు. కానీ, రాజీవ్ మాత్రం ఎప్పటిలానే తన పనిలో మళ్లీ నిమగ్నమైపోయాడు. కాసేపటి తర్వాత భార్యకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. ఇద్దరూ కాసేపు నవ్వుకున్నారు. అంతకుముందు భార్య పేరుతో వచ్చిన ఆ కాల్ ఫేక్ అని రాజీవ్ పసిగట్టడమే ఇందుక్కారణం. కానీ అదెలా సాధ్యం? అంత కంగారులోనూ అది ఫేక్ అని ఎలా గుర్తించాడు?.. ఇదే సీక్రెట్ కోడ్ మహిమ. దీన్నే సేఫ్‌వర్డ్ లేదా పాస్‌ఫ్రేజ్‌గా సైబర్ నిపుణులు వ్యవహరిస్తున్నారు. ఇంతకీ ఏమిటిది? ఏఐ యుగంలో ఇదెలా ఉపయోగపడుతుంది?ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కొత్త పుంతలు తొక్కుతోంది. దీన్ని సైబర్ నేరగాళ్లు కూడా అస్త్రాలుగా మలుచుకుంటున్నారు. వాయిస్‌లను క్లోన్ చేసి, డీప్‌ఫేక్ వీడియోలతో అమాయక ప్రజలను బోల్తా కొట్టిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితుల పేరుతో వాయిస్/ వీడియో కాల్స్ చేసి 'ఎమర్జెన్సీ' అంటూ డబ్బులు కొట్టేస్తున్నారు. ఇలాంటి ఏఐ మోసాల నుంచి మనల్ని మనం రక్షించుకోవాలంటే కుటుంబ సభ్యుల మధ్య ఒక సేఫ్‌వర్డ్/పాస్‌ఫ్రేజ్ ఉండాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

**మోసాలు ఎలా?**

మన ఇంట్లో వ్యక్తులు కంగారుపడుతూ ఫోన్ చేస్తే వేరే తలంపు లేకుండా అవతలి వ్యక్తులు చెప్పింది చేయడానికే ప్రయత్నిస్తాం. దీన్నే ఆయుధంగా మలుచుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. ఇక్కడే ఓ అనుమానం రావొచ్చు. మరి ఆ వాయిస్ వారికి ఎక్కడిది? సామాజిక మాధ్యమాల్లో మనం పెట్టే వీడియోలు, వాయిస్ మెయిల్స్, ఫోన్‌కాల్స్ చాలు.. అవతలి వ్యక్తుల వాయిస్‌ను క్లోన్ చేయడానికి. కేవలం 30 సెకన్ల ఆడియో/వీడియో ఉంటే చాలు ఎవరి వాయిస్‌నైనా ఇట్టే క్లోన్ చేసేయొచ్చని చెబుతున్నారు సైబర్ నిపుణులు. అంతేకాదు హ్యాకర్లు ఇంట్లో వారి ఫోన్ నంబర్లను కూడా స్పూఫ్ చేయగలరు. అంటే మన కాంటాక్టులోని వ్యక్తులే ఫోన్ చేస్తున్నారని మనల్ని నమ్మించగలరు.

**నేరాల నుంచి రక్షించే సేఫ్ వర్డ్**

ఈ తరహా మోసాలను అరికట్టడానికి పాస్‌ఫ్రేజ్ పెట్టుకోవాలంటున్నారు నిపుణులు. ఇందుకోసం ఒక పదం లేదా పదబంధం లేదా ఒక ప్రశ్నను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఎంత అత్యవసర సమయంలోనైనా మీరు దాని గురించి ప్రస్తావించగానే అవతలి వ్యక్తులు దానికి సమాధానం ఇచ్చేలా, గుర్తుండేలా సేఫ్‌వర్డ్ ఉండాలి. పాస్‌వర్డ్‌లు, పుట్టినరోజులు, పెట్‌నేమ్స్ వంటివి పెట్టకపోవడం మంచిది. మరీ ముఖ్యంగా ఈ కోడ్‌ను సామాజిక మాధ్యమాల్లో గానీ, ఆన్‌లైన్‌లో గానీ పంచుకోవద్దు. వ్యక్తుల మధ్యే ఉండాలి. కేవలం మీ కుటుంబసభ్యులు, స్నేహితులతోనే పంచుకోండి. 'ఎమర్జెన్సీ' కాల్స్ వస్తే ఇలా చేయండి.. సైబర్ నేరగాళ్లు ఒకవేళ ఆడియో కాల్ చేస్తే వెంటనే వీడియో కాల్ ఆన్ చేయండి. వీడియో కాల్ చేస్తారని ఊహించకపోతే అవతలి వ్యక్తి ఇట్టే దొరికిపోతారు. కొన్నిసార్లు వీడియోను కూడా డీప్‌ఫేక్ చేసేందుకు సిద్ధంగా ఉండొచ్చు.రెండో ఆప్షన్.. ఒకవేళ మీ ఇంట్లో వ్యక్తులే కాల్ చేసినట్లు అనిపించినా వారి మాటల్లో తేడా గమనిస్తే అదే నంబర్‌కు తిరిగి కాల్ చేయండి. తద్వారా వారి క్షేమ సమాచారాన్ని ధ్రువీకరించుకోవచ్చు.చివరి ఆప్షన్‌గా సేఫ్‌వర్డ్‌ను వాడండి. దానికి సమాధానం చెప్పడానికి అవతలి వారు తటపటాయిస్తే సైబర్ నేరగాళ్ల పనే అని మీరు గుర్తించొచ్చు. వివిధ దేశాల్లో ఈ తరహా మోసాలు పెద్దఎత్తున జరుగుతుండగా.. భారత్‌లోనూ ఈ మోసాలు వెలుగుచూస్తున్నాయి. ఇంతకీ రాజీవ్ ఏం చేశాడంటే..? తనకు విషయం చెప్పగానే కాల్ కట్ చేసే ముందు "ఓటీటీ సినిమా" అని అడగ్గా.. అవతలి నుంచి సమాధానం లేకుండానే ఫోన్ కట్ అయ్యింది. ఒకవేళ తన భార్యే అయ్యుంటే సమాధానం వచ్చేది. అది రాకపోవడంతో ఇది సైబర్ నేరగాళ్ల పన్నాగం అని రాజీవ్ గుర్తించగలిగాడు. ఇంతకీ వాళ్లు పెట్టుకున్న సేఫ్‌వర్డ్ ఏంటో తెలుసా? ఓటీటీ సినిమాకు- సండేమ్యాగీ స్టోరీ!! ఇంకెందుకాలస్యం మీరూ పెట్టుకోండి 'సేఫ్'వర్డ్.


## నెఫ్రోకేర్ లాభం రూ.34.4 కోట్లు

**హైదరాబాద్:** డయాలసిస్ సేవల సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ (నెఫ్రోప్లస్), ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.259.7 కోట్ల ఆదాయంపై రూ.34.4 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.197.3 కోట్లు, నికర లాభం రూ.20.1 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే ఈసారి ఆదాయం 31.7%, నికర లాభం 71.3% పెరిగాయి. ఏప్రిల్-డిసెంబరుకు ఆదాయం రూ.733.2 కోట్లు, నికర లాభం రూ.85.9 కోట్లుగా ఉన్నాయి. కిడ్నీ సంబంధిత వ్యాధుల భారాన్ని రోగులకు తగ్గించడమే తమ లక్ష్యమని సంస్థ ఛైర్మన్ విక్రమ్ వుప్పాల తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో మరింతగా విస్తరిస్తామని పేర్కొన్నారు.

## పసిడి బాండులో రూ.3,449 పెట్టుబడిపై రూ.12,192 లాభం

**న్యూఢిల్లీ:**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గతంలో జారీ చేసిన పసిడి బాండ్లలో పెట్టిన పెట్టుబడులపై మదుపర్లు భారీగా ప్రతిఫలాన్ని పొందుతున్నారు. తాజాగా 2019 ఆగస్టు 4న జారీ చేసిన 2019-20 సిరీస్-3 సార్వభౌమ పసిడి బాండ్ల (ఎస్‌జీబీ)కు తుది రిడెమ్షన్ ధరను, యూనిట్‌కు రూ.15,641గా నిర్ణయించారు. అప్పటి మేలిమి బంగారం ధర గ్రాము రూ.3,449 చొప్పున ఈ బాండ్లలో పెట్టుబడి పెడితే, ఇప్పుడు గ్రాముకు రూ.12,192 లాభాన్ని (353.49%) మదుపర్లు పొంద నున్నారు. దీనికి వార్షిక వడ్డీ రేటు (2.5%) అదనం. ఈనెల 10 నుంచి 12 వరకు పసిడి ముగింపు ధరల సగటు ఆధారంగా, బాండ్‌కు తుది రిడెమ్షన్ ధరను నిర్ణయించారు.







# ఏఐతో వైట్ కాలర్ ఉద్యోగాలకూ ముప్పే

### సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే కాదు న్యాయవాదులు, అకౌంటెంట్లకూ కష్టమే

**న్యూఢిల్లీ:**వచ్చే ఏడాది, ఏడాదిన్నర సమయంలో 'వైట్ కాలర్' ఉద్యోగాల్లో చాలా వరకు ఆటోమేషన్‌కు గురయ్యే అవకాశం ఉందని మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్ హెచ్చరిస్తున్నారు. కృత్రిమ మేధ(ఏఐ) వేగంగా వృద్ధి చెందుతుండటంతో, పలు ఐటీ కంపెనీల్లో లేఆఫ్‌ల ప్రకటనలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సులేమాన్ ఒక ఆంగ్లపత్రిక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఆంథ్రోపిక్ క్లాడ్ మోడల్, స్టాక్ మార్కెట్లను నష్టపరుస్తున్న తరుణంలో ముస్తఫా ఇలా పేర్కొనడం గమనార్హం. కేవలం కోడర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లపైనే కాకుండా కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేసే న్యాయవాదులు, అకౌంటెంట్లు, ప్రాజెక్టు మేనేజర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లపైనా ఏఐ ప్రభావం పడనుందని సులేమాన్ అంటున్నారు. రాబోయే 12-18 నెలల్లోనే ఈ పోస్టులు ఏఐతో భర్తీ అయ్యే అవకాశం ఉంద'ని పేర్కొన్నారు. 2-3 ఏళ్లలో పెద్ద పెద్ద కంపెనీల్లో ఏఐ ఏజెంట్లే సమర్థంగా సమన్వయ బాధ్యతలనూ నిర్వర్తించగలవని తెలిపారు.




ఎప్పటికపుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ, ఏఐ ఏజెంట్లు మెరుగవుతాయని, స్వయం ప్రతిపత్తితో నిర్ణయాలు తీసుకుంటూ వెళతాయని అన్నారు. ఏఐ మెరుగయ్యే కొద్దీ కొత్త మోడళ్ల సృష్టి, వాడకం మరింత సులభతరం కానుంది. పాడ్‌క్యాస్ట్ లేదా బ్లాగ్‌ను రూపొందించేందుకు కొత్త మోడల్‌ను సృష్టించే అవకాశం ఉంది. ప్రతి కంపెనీ/వ్యక్తి అవసరాలకు తగ్గట్లుగా ఏఐని డిజైన్ చేయడమూ భవిష్యత్తులో సాధ్యంకావొచ్చని ఆయన అన్నారు. ఓపెన్‌ఏఐపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు.. సొంత, శక్తిమంత ఫౌండేషన్ మోడళ్లను అభివృద్ధి చేయడంపై మైక్రోసాఫ్ట్ దృష్టి సారిస్తోందని ముస్తఫా వివరించారు. ఇప్పటికే అధునాతన ఏఐ వ్యవస్థలపై శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అసెంబ్లింగ్, డేటాసెట్ల నిర్వహణపై మైక్రోసాఫ్ట్ భారీగా ఖర్చు చేస్తోందని తెలిపారు. జూన్‌తో ముగిసే ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 140 బి.డాలర్ల (దాదాపు రూ.12.7 లక్షల కోట్ల) మూలధన వ్యయాలు చేయనుందని అంచనా.ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత, ఎక్కువసేపు వేచిచూడడం వంటి సమస్యలకు పరిష్కారంగా 'మెడికల్ సూపర్‌ఇంటెలిజెన్స్'ను తీసుకురావాలని భావిస్తున్నట్లు సులేమాన్ తెలిపారు. మనుషుల నియంత్రణలోనే ఉండే 'హ్యూమనిస్ట్ సూపర్ ఇంటెలిజెన్స్'నూ అభివృద్ధి చేసే లక్ష్యంతో ఉన్నట్లు వివరించారు. ఏఐ ల్యాబ్‌లు తమ సృష్టికర్తల జోక్యాన్ని అడ్డుకుంటాయన్న ఆందోళనల మధ్య, కంపెనీ ఈ లక్ష్యాన్ని పెట్టుకుంది. ఏఐ అనేదేమీ ఒక క్లౌడ్ కాదు. దానిని కొనుగోలు చేసి సిస్టమ్‌లో పెట్టగానే ఆటోమేటిక్‌గా పని జరిగిపోదు. తాము వినియోగిస్తున్న ఐటీ వ్యవస్థలను కాదని, ఒక్కసారిగా ఏఐని పెద్ద సంస్థలు వినియోగించబోవు. ఆంథ్రోపిక్ వంటి కంపెనీలు మూలధన సమీకరణ కోసమే తెలివిగా ఏఐని వినియోగిస్తున్నాయి. ఆ కంపెనీ గురువారం 30 బి. డాలర్లు సమీకరించింది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతున్నాయని కొన్ని ఐటీ కంపెనీలు చెబుతున్నాయి. కొన్ని ఉద్యోగాలు పోయినా.. మరిన్ని ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. అయినా మార్పేమీ వారు చెబుతున్నంత వేగంగా జరిగిపోదు. మరికొంత మందేమో న్యాయవాదులు, వైద్యుల స్థానాన్ని సైతం ఏఐ భర్తీ చేయగలదని చెబుతున్నారు. ఏఐపై ఒకలాంటి హైప్‌ను వీరు సృష్టిస్తున్నారు. అయితే ఏఐ ఒక విప్లవమని ఒప్పుకోక తప్పదు. ఉత్పాదకతను కచ్చితంగా ఏఐ పెంచుతుంది. ప్రస్తుత వ్యవస్థలు మారిపోవు: ప్రపంచంలోని పెద్ద కంపెనీలు తమ 'లెగసీ సిస్టమ్స్'పైనే నడుస్తున్నాయి. చాలా వరకు అంతర్జాతీయ బ్యాంకులు వాటిపై ఏటా 15 బి. డాలర్ల (సుమారు రూ.1.36 లక్షల కోట్ల) వరకు ఖర్చు చేస్తున్నాయి. 12-13 డేటాబేస్‌లు వాటికి ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో లెగసీ కోడ్‌పై ఏఐ ప్రభావం ఉండదు. ఈ నేపథ్యంలో క్లాడ్ వచ్చి, మొత్తం ఎంటర్‌ప్రైజ్ సిస్టమ్‌ను నిర్వహిస్తుందనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది.




## ఆరేళ్లుగా ఆంక్షల చట్రంలో

**న్యూఢిల్లీ:**వెనెజువెలా నుంచి ముడిచమురును నేరుగా కొనుగోలు చేయడానికి, అమెరికా నుంచి సాధారణ లైసెన్స్‌ను ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) పొందింది. ప్రపంచంలోనే, ఒకేచోట అతిపెద్ద రిఫైనింగ్ సముదాయాన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కంపెనీ నిర్వహిస్తున్న ఆర్‌ఐఎల్, ఇందుకోసం భారీఎత్తున చమురు దిగుమతి చేసుకుంటూ ఉంటుంది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో, రష్యా నుంచి చమురు దిగుమతులను సంస్థ నిలిపేసిన సంగతి విదితమే. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు ప్రారంభమైతే, రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్లూ బలోపేతం కానున్నాయి. గత నెలలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధంలోకి తీసుకున్న అమెరికా, ఆ దేశ ముడిచమురు పరిశ్రమపై ఆంక్షలను సడలించింది. ఇప్పటివరకు ట్రేడర్ల ద్వారా వెనెజువెలా చమురును విక్రయించడానికి అమెరికా అనుమతి ఇచ్చింది. ఇప్పుడు ఆర్‌ఐఎల్‌కు లభించిన సాధారణ లైసెన్స్ వల్ల, ఏదైనా సంస్థ వెలికితీసిన లేదా ఆధీనంలో ఉన్న చమురును నేరుగా కొనుగోలు చేసే అధికారం లభిస్తుంది.వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో పాలనపై 2019-20లో అమెరికా ఆంక్షలు విధించింది. అప్పటివరకు వెనెజువెలా ముడిచమురును ఆర్‌ఐఎల్ కొనుగోలు చేసినా, అంతటితో ఆపేసింది. 2024లో తాత్కాలిక ఉపశమనం ఇవ్వడంతో, మళ్లీ చమురును కొనుగోలు చేసింది. ఈ ఏడాదిలో ట్రేడర్ల ద్వారా వెనెజువెలా విక్రయాలు ప్రారంభమయ్యాక.. అంతర్జాతీయ ట్రేడింగ్ సంస్థ విటోల్ నుంచి 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ రంగ సంస్థలు ఐఓసీ, హెచ్‌పీసీఎల్ కూడా 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేశాయి. ఇందులో 5 లక్షల బ్యారెళ్ల చమురును విశాఖపట్నంలోని యూనిట్‌కు హెచ్‌పీసీఎల్ కేటాయించిందని సమాచారం. వెనెజువెలా ముడిచమురు గ్రేడ్‌లు, ముఖ్యంగా ఒరినోకో ప్రాంతం నుంచి వచ్చేవి సంక్లిష్టంగా, భారీగా ఉంటాయి. వీటిని సమర్థంగా ప్రాసెస్ చేసే సామర్థ్యాలు జామ్‌నగర్ రిఫైనరీలో ఉన్నాయి. రవాణా ఇబ్బందుల కారణంగా వెనెజువెలా చమురు కొంత రాయితీ ధరలకే లభిస్తోంది. దీనిని డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్ (ఎల్‌పీజీ)గా మార్చొచ్చు. రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్‌లు పెరగడానికి ఇది దోహదం చేయనుంది.

## జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఆదాయం రూ.4,083 కోట్లు

**హైదరాబాద్:** జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, డిసెంబరు త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.4,082.77 కోట్ల ఆదాయంపై రూ.173.96 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో సంస్థ ఆదాయం రూ.2,748.22 కోట్లు, నికర లాభం రూ.202.10 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 9 నెలల కాలానికి ఆదాయం రూ.11,157.85 కోట్లు, నికర లాభం రూ.71.90 కోట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం మూడు త్రైమాసికాల్లో కలిపి రూ.7,859.20 కోట్ల ఆదాయం, నికర నష్టం రూ.564.24 కోట్లుగా ఉన్నాయి. నిర్వహణ పరంగా కంపెనీ పనితీరు మెరుగుపడిందని యాజమాన్యం పేర్కొంది. దిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాలకు సంబంధించి రాబోయే టారిఫ్ ఆర్డర్ల అమలుతో, భవిష్యత్తులో ఆదాయం, మార్జిన్లు మెరుగుపడతాయని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది.



# లీడ్ బ్యాంక్ పథకానికి కొత్త రూపు

### నిబంధనల సవరణకు ఆర్‌బీఐ ప్రతిపాదనలు

ముంబయి: జిల్లా స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు 1969లో ప్రవేశపెట్టిన లీడ్ బ్యాంక్ పథకం (ఎల్‌బీఎస్)లో మార్పులు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఇందుకోసం కొన్ని నిబంధనలను సవరిస్తూ, శుక్రవారం ముసాయిదాను విడుదల చేసింది. బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు, ఇతర అభివృద్ధి సంస్థలను సమన్వయం చేస్తూ, ప్రాధాన్య రంగాలకు రుణ మంజూరును పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. తాజా ప్రతిపాదనల ప్రకారం.. పథకం లక్ష్యాలు, నిర్మాణం, సభ్యత్వం, వివిధ వేదికల అజెండా, కీలక అధికారుల బాధ్యతలు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ), లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్యాలయాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. ప్రతి జిల్లాలోనూ ఒక వాణిజ్య




బ్యాంకును లీడ్ బ్యాంక్‌గా ఆర్‌బీఐ నియమిస్తుంది. రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల కార్యకలాపాలను ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ బ్యాంకులు సమన్వయం చేస్తాయి. రుణాల మంజూరులో ఎదురయ్యే సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చిస్తూ, బ్యాంకులకు అవసరమైన సహకారాన్ని అందిస్తాయి. ముఖ్యంగా రోడ్లు, డిజిటల్ కనెక్టివిటీ, శాంతిభద్రతలు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో సంప్రదింపులు నిర్వహిస్తూ, ప్రతి ప్రాంతానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలి. రుణ ప్రణాళికల రూపకల్పనలో క్షేత్రస్థాయి నుంచి పరిశీలించాలని ముసాయిదాలో పేర్కొన్నారు.

## రూ.10,000 కోట్ల మూలనిధితో స్టార్టప్ ఇండియా 2.0 పథకం

**న్యూఢిల్లీ:**రూ.10,000 కోట్ల మూలనిధితో స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ పథకం, రెండో దశకు ప్రభుత్వం శుక్రవారం ఆమోదం తెలిపింది. ప్రారంభ దశల్లో, డీప్-టెక్ పరిశోధనల్లో ఉన్న అంకుర సంస్థలకు ఇది ప్రోత్సాహం ఇస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నూతన కార్యాలయం 'సేవా తీర్థ్'లో మొదటి రోజున పేదలు, అణగారిన వర్గాలు, రైతులు, యువ శక్తి, నారీ శక్తికి సంబంధించిన దస్త్రాలపై మోదీ సంతకం చేశారు. స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0కు ఆమోదం సహా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మోడీ తెలిపారు. రైసినా హిల్‌లోని రాష్ట్రపతి భవన్ సమీపంలోని సౌత్ బ్లాక్ భవనం నుంచి సరికొత్త సేవా తీర్థ్‌కు శుక్రవారం మారినట్లు మోదీ పేర్కొన్నారు. అంకుర సంస్థలకు మూలధనం అందించేందుకు 2016లో రూ.10,000 కోట్లతో ఫండ్ ఆఫ్ ఫండ్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిని విజయవంతంగా వినియోగించిన తర్వాత, 2025-26 బడ్జెట్‌లో రూ.10,000 కోట్లతో రెండో దశను మంజూరు చేశారు.

## అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యం



**వాషింగ్టన్:**అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యమయ్యాడు కర్ణాటకకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య (22) ఫిబ్రవరి 9 నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అతడి కోసం పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు.సాకేత్ బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. అతడు చివరిసారిగా క్యాంపస్‌కు కిలోమీటరు దూరంలో ఉన్న లేక్ అంజా సమీపంలో కన్పించినట్లు తెలుస్తోంది. అక్కడ అతడి పాస్‌పోర్టు, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాక్‌ప్యాక్‌లను అధికారులు గుర్తించారు. అతడిని గుర్తించేందుకు స్నేహితులతో కలిసి స్థానిక అధికారులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సాకేత్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నామని, వారికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. అమెరికా అధికారులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

## పాక్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల డ్రగ్స్..


అనుమానిత డ్రోన్ కదలికలను స్థానికులు గుర్తించారు. ఆ డ్రోన్ ఏదో పదార్థాన్ని జారవిడిచినట్లు గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు, బీఎస్ఎఫ్ దళాలతో కలిసి ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. స్థానిక పొలాల్లో పెద్దఎత్తున హెరాయిన్‌ను గుర్తించారు. దాని మొత్తం విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలాఉండగా.. కథువా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా పాక్ నుంచి హెరాయిన్‌ను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలపై ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు చెందిన జతిన్, కథువాలోని జఖ్‌బార్‌కు చెందిన డానిష్ డోగ్రాలుగా గుర్తించారు. వీరికి పాకిస్థాన్‌కు చెందిన స్మగ్లర్‌లతో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# పరిగి బల్దియా పీఠం కోసం హైడ్రామా

## కాంగ్రెస్-బీఆర్ఎస్ వర్గాల్లో హై టెన్షన్

- స్వతంత్రుల కోసం రాయబారాలు విఫలం
- అక్కమ్మ కిడ్నాప్ ఆరోపణలు.. పోలీస్ ఫిర్యాదు
- గ్రామస్తుల నిర్ణయం మేరకే మద్దతు అభ్యర్థి మూడవత్ హనుమంత్





**వికారాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి):** పరిగి మున్సిపాలిటీ చైర్మన్ పీఠం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య హై టెన్షన్ నెలకొంది. ఎన్నికల్లో హంగ్ ఏర్పడిన నేపథ్యంలో రెండు పార్టీలు స్వతంత్ర అభ్యర్థులను తమ వైపు తిప్పుకోవడానికి ఎత్తులకు పైఎత్తులు వేశాయి. రాయబారాలు ఫలించక పోవడంతో అర్ధరాత్రి దాటినా హైడ్రామా కొనసాగింది. పరిగి మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చొప్పున 8 స్థానాలు దక్కాయి. మిగతా రెండు స్థానాలను స్వతంత్రులు అక్కమ్మ (1వ వార్డు, 46 ఓట్ల మెజారిటీ), మూడవత్ హనుమంత్ (3వ వార్డు, 159 ఓట్ల మెజారిటీ) గెలుచుకున్నారు. ఈ ఇద్దరు స్వతంత్రుల మద్దతు లేకుండా చైర్మన్ పీఠం దక్కదు కాబట్టి రెండు పార్టీలు వారిని తమ గూటికి చేర్చుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేశాయి. ఓటింగ్ ప్రక్రియ జరుగుతుండగానే రెండు పార్టీల నేతలు స్వతంత్రులతో రాయబారాలు చేశారు. అక్కమ్మను కిడ్నాప్ చేశారంటూ పుకార్లు వ్యాపించాయి. ఆమె కుమారుడు బాల్ రాజ్ పరిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి ఇంట్లో అక్కమ్మ ఉన్నట్లు సమాచారం రావడంతో కాంగ్రెస్ నేతలు ఆయన ఇంటి వద్ద ఆందోళన చేశారు. బీఆర్ఎస్ నేతలు కూడా తమ రెబల్ అభ్యర్థిని వదలాలంటూ నిరసన తెలిపారు. రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు విచారణకు వెళ్లినప్పుడు అక్కమ్మ తాను స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌కు మద్దతిస్తున్నట్లు పోలీసులకు వాగ్మూలం ఇచ్చారు. ఎవరూ కిడ్నాప్ చేయలే దని స్పష్టం చేశారు. అయినా కాంగ్రెస్ నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. మరో స్వతంత్రుడు మూడవత్ హనుమంత్ కూడా తాను ప్రజల తీర్పు మేరకే మద్దతు ఇస్తానని ప్రకటించారు.

మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చేసిన రాయబారాలు విఫలమయ్యాయి. పరిగి డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూశారు. ఈ హై టెన్షన్ డ్రామా శనివారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. ఫిబ్రవరి 16న జరిగే చైర్మన్ ఎన్నికలో ఈ ఇద్దరు స్వతంత్రుల మద్దతు కీలకంగా మారనుంది. వారు ఏ పార్టీకి ఓటు వేస్తే ఆ పార్టీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకునే అవకాశం ఉంది.

# చిరునవ్వుతో ప్రజల గుండెలు గెలుచుకున్న మనోహర్

- స్వల్పకాలంలోనే నియోజకవర్గంలో అపార మన్ననలు
- సమస్యలు ఇట్టే పరిష్కారం.. అభివృద్ధే లక్ష్యం
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 19 సీట్లు
- పార్టీ అధిష్టానం నుంచి ప్రశంసల జల్లు



**తాండూరు, ఫిబ్రవరి 14 (జనం సాక్షి):** స్వల్పకాలంలోనే తాండూరు నియోజకవర్గ ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి. గత ఎమ్మెల్యే ఎన్నికల ముందు నియోజకవర్గంలో మనోహర్ రెడ్డి అంటే ఎవరికీ తెలియదు. కానీ కాంగ్రెస్ పార్టీ తరఫున టికెట్ సాధించి కేవలం 30 రోజుల వ్యవధిలోనే ప్రజల్లోకి లోతుగా దూసుకెళ్లారు. చిరునవ్వుతో పలకరిస్తూ సీనియర్ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని పోయారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కృషి చేసి ప్రజల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.

ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం మరణించిన కుటుంబాలకు తన వంతు ఆర్థిక సహాయం అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయించి దూసుకుపోతున్నారు. సమస్య ఏదైనా ఇట్టే పరిష్కారమే మార్గంగా ముందుకు సాగుతున్నారు. మున్సిపల్ పరిధిలోని 36 వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించారు. పార్టీ ఏదైనా పట్టణ ప్రగతే ముఖ్య లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రమాదాలకు గురైనవారు, అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు 'నేనున్నాను' అంటూ మనోధైర్యం కల్పిస్తున్నారు. చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. మెరుగైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి వైద్యులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మరింత అధిక నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇస్తున్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజల పూర్తి సహకారం ఇలాగే ఉంటే మరింత అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పుకొస్తున్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన యువ నాయకులకు టికెట్లు ఇచ్చి గెలుపు గుర్రాలను ఎంపిక చేశారు. ఫలితంగా కాంగ్రెస్ అభ్యర్థులు 19 స్థానాల్లో విజయం సాధించారు. ఈ విజయానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వ్యూహాత్మక ప్రణాళిక కీలకమైంది. పార్టీ అధిష్టానం నుంచి ఆయనకు ప్రశంసల జల్లు కురిసింది. నియోజకవర్గంలో మనోహర్ రెడ్డికి మరింత క్రేజ్ ఏర్పడింది.

# మేయర్ పీఠంపై 'సీఎం' ఆఫీస్ నజర్..






- క్షేత్రస్థాయిలో నేరుగా అభిప్రాయ సేకరణ
- కార్పొరేటర్లకే కాదు.. సామాన్యులకూ ఎమ్మెల్యేల ఫోన్లు
- మేయర్ ఎంపికలో కొత్త వ్యూహం
- ఉత్కంఠ రేపుతున్న 'డైరెక్ట్'కాల్స్!
- అభిప్రాయ సేకరణతో ఆశావహుల్లో టెన్షన్

**మహబూబ్ నగర్ బ్యూరో ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎంపిక ప్రక్రియ ఇప్పుడు అత్యంత ఉత్కంఠభరితంగా మారింది. సాధారణంగా గెలిచిన కార్పొరేటర్ల అభిప్రాయాలను మాత్రమే పరిగణనలోకి తీసుకునే సంప్రదాయానికి భిన్నం గా, ఈసారి అధిష్టానం సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. మున్సిపల్ పరిధిలోని ముఖ్య నేతలు, మేధావులు, వివిధ వర్గాల ప్రజల నాడిని పట్టుకునేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది.

### ఎమ్మెల్యేలు నేరుగా రంగంలోకి..

గత రెండు రోజులుగా స్థానిక ఎమ్మెల్యేలు స్వయంగా కార్పొరేషన్ పరిధిలోని పలువురు ప్రముఖులకు ఫోన్లు చేస్తూ మేయర్ అభ్యర్థిపై ఆరా తీస్తుండటం చర్చనీయాంశమైంది. "మేయర్ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తే బాగుంటుంది? ప్రజల్లో ఎవరికి మంచి గుర్తింపు ఉంది?" అన్న కోణంలో ప్రశ్నలు కురిపిస్తున్నారు. పార్టీ పరంగానే కాకుండా, సామాజిక సమీకరణాలు మరియు క్లీన్ ఇమేజ్ ఉన్న వ్యక్తిని పీఠంపై కూర్చోబెట్టాలన్నది అధిష్టానం ఆలోచనగా తెలుస్తోంది.

### సీఎం కార్యాలయం నిఘా..

ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కూడా ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో రహస్యంగా అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు సమాచారం. కేవలం కార్పొరేటర్ల మద్దతు ఉంటే సరిపోదని, భవిష్యత్తులో నగరాభివృద్ధికి మరియు రాజకీయంగా పార్టీ బలోపేతానికి తోడ్పడే వ్యక్తికే ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం కార్యాలయం భావిస్తోంది. ఈ మేరకు కార్పొరేషన్ పరిధిలోని వివిధ సామాజిక వర్గాల అభిప్రాయాలను క్షుణ్ణంగా క్రోడీకరిస్తున్నారు.

### ఆశావహుల్లో వణుకు..

అధిష్టానం తీసుకున్న ఈ నిర్ణయంతో మేయర్ పీఠంపై కన్నేసిన ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకుంటే సరిపోతుందని భావించిన కొందరు అభ్యర్థులకు, ఇప్పుడు సామాజిక అభిప్రాయ సేకరణ కొత్త తలనొప్పిగా మారింది. ఏదేమైనా, మహబూబ్ నగర్ మేయర్ ఎంపికలో ప్రజాభిప్రాయానికే పెద్దపీట వేయనున్నట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

# మహాశివరాత్రి జాతరకు వేములవాడలో భారీ ఏర్పాట్లు

- అన్ని మార్గాల్లో సైన్ బోర్డులు.. దారి తప్పని వెసులుబాటు
- స్టీల్ గ్లాసుల్లో తాగునీరు.. ప్లాస్టిక్ నిషేధం
- బేబీ ఫీడింగ్ సెంటర్లు.. దివ్యాంగులకు వీల్ చైర్లు
- 10 హెల్ప్ డెస్క్‌లు.. వైద్య శిబిరాలతో పూర్తి సౌకర్యాలు



**వేములవాడ, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అనుబంధ భీమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక ప్రణాళిక ప్రకారం జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. అన్ని శాఖల అధికారులు, ఆలయ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రతి చోట జిల్లా అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించారు. జాతర పరిసర ప్రాంతాల్లో 10 హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి దర్శనం, సౌకర్యాలు, పారిశుద్ధ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే రెండుసార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించి కీలక సూచనలు చేశారు.

చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బేబీ ఫీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. పరిశుభ్రమైన వాతావరణం, గోప్యత, కూర్చునే సౌకర్యాలు కల్పించారు. దివ్యాంగులు, వృద్ధ భక్తులు సులభంగా దర్శనం చేసుకునేలా దాదాపు 100 వీల్ చైర్లు అందుబాటులో ఉంచారు. ప్రధాన ప్రవేశ ద్వారాలు, హెల్ప్ డెస్క్‌ల వద్ద సిబ్బందిని నియమించారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు స్టీల్ గ్లాసులు వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చారు. త్రాగునీటి కేంద్రాలు, క్యూ లైన్లలో గ్లాసుల శుభ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. భక్తులు దారి తప్పకుండా దర్శన మార్గాలు, క్యూ లైన్లు, మరుగుదొడ్లు, త్రాగునీటి కేంద్రాలు, హెల్ప్ డెస్క్‌లను సులభంగా గుర్తించేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. తెలుగులో బోర్డులు ఏర్పాటు చేసి మార్గనిర్దేశం చేస్తున్నారు.

భక్తుల సమస్యలు, సందేహాలకు వెంటనే స్పందించేందుకు 10 హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. దర్శన సమయాలు, వసతి, వైద్య సహాయం, దివ్యాంగుల సదుపాయాలపై సమాచారం అందిస్తారు. పంచాయతీ, మున్సిపల్ శాఖల సమన్వయంతో దేవస్థాన పరిసరాలు, ప్రధాన రహదారులు, క్యూ లైన్లు, మరుగుదొడ్ల వద్ద పారిశుద్ధ్య పనులు విస్తృతంగా చేపట్టారు. చెత్త తొలగింపు, శుభ్రపరచే పనులు నిరంతరంగా కొనసాగేలా ప్రత్యేక సిబ్బంది, వాహనాలు నియమించారు.

తక్షణ వైద్య సేవల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అత్యవసర చికిత్స, ప్రాథమిక వైద్యం, మందుల పంపిణీకి వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. గుడి ఆవరణలో వైద్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది ఉంటారు. జాతర ఏర్పాట్లు, సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాల సహాయంతో భక్తుల రాకపోకలు, క్యూ లైన్లు, భద్రతను సమీక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరిస్తున్నారు.

**సమాజంలో ఉన్న అసమానతలను తొలగించి, నూతన సమాజ స్థాపనకై పోరాడే ఉద్యమ నాయకున్ని కని అందించింది రాజమ్మ అని సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ అన్నారు.**

# ఆడబిడ్డ పుట్టిన ప్రతి కుటుంబానికి రూ.5016



- ఎన్నికల హామీ అమలుతో ఆదర్శంగా నిలిచిన సర్పంచ్ సంపత్ రెడ్డి
- ఆడపిల్లలపై వివక్ష లేకుండా కృషి చేయాలి
- భ్రూణ హత్యలను అరికట్టండి.. ఆడబిడ్డలను కాపాడుకుందాం: సర్పంచ్ సంపత్

**చిగురుమామిడి, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఆదర్శంగా నిలిచారు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లె గ్రామ సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి. గ్రామంలో పుట్టిన ప్రతి ఆడబిడ్డకు రూ.5016 డిపాజిట్ చేస్తానన్న హామీని నెరవేరుస్తున్నారు. శనివారం గ్రామ పంచాయతీ వద్ద జెట్టి మనసా శ్రీనివాస్ దంపతులకు కూతురు పుట్టిన సందర్భంగా రూ.5016 అందజేశారు. గ్రామస్తుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆడపిల్లల పట్ల వివక్ష చూపకుండా ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే ఆడ-మగ వ్యత్యాసాలు తొలగిపోతాయని సర్పంచ్ పేర్కొన్నారు. 'ఆడపిల్లను పుట్టనిద్దాం.. బ్రతకనిద్దాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దాం.. రక్షించుకుందాం' అంటూ భ్రూణ హత్యలను అరికట్టాలని పిలుపునిచ్చారు. సృష్టికి మూలమైన ఆడపిల్లలను కాపాడుకోవాలని కోరారు. గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు నల్లాల మధుసూదన్ రెడ్డి, జెట్టి సంపత్, నాగెల్లి కళావతి, మంద లక్ష్మయ్య, గ్రామస్తులు అనుమాండ్ల కనకరెడ్డి, జెట్టి లక్ష్మయ్య, కాటం రవీందర్ రెడ్డి, అనుమాండ్ల రాజిరెడ్డి, నల్లాల రాజిరెడ్డి, కర్ర అశోక్ రెడ్డి, నందికొండ మల్లారెడ్డి, మంద కిష్టయ్య, చందబోయిన పరశురాములు, బండారిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.





# దారులన్నీ భీమన్న దర్శనానికే..

- ముల్లె మూటలతో భక్తుల రాక
- రాజన్న జాతర ఉత్సవాలు ప్రారంభం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన భీమన్న ఆలయంలో మహాశివరాత్రి జాతరకు భక్తులు మూల్లే మూటలతో పిల్లా పాపలతో తరలివస్తున్నారు.రాజన్న ఆలయ అభివృద్ధి పనులు జరుగుచున్న క్రమంలో మహా శివారాత్రి వేడుకలకు భీమన్న ఆలయం ముస్తాబు చేశారు.రాజన్న ఆలయంలో ఆలయ అర్చకులు మాత్రమే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ఏమిలేని ఎములాడలో రాజన్న...
ఎమి సూసి వేలిసినావో రాజన్న...
ముల్లె మూటలు సర్దుకుని పిల్ల పాపలతో వస్తున్నాము రాజన్న...
సల్లంగా చూడు రాజన్న... అంటూ పాటలు పాడుకుంటూ వేములవాడకు భక్తులు చేరుకుంటున్నారు.ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు శనివారం నుండి ప్రారంభమయ్యాయి.

శనివారం సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ.రాత్రి 9 గంటలకు నిషి పూజ అనంతరం భక్తుల సౌకర్యం కొరకు లఘు దర్శన సౌకర్యం కోడే మొక్కుబడులు యధావిధిగా నడువనున్నాయి.రాత్రి 11 గంటల నుండి 1.30 వరకు వేకువజామున పట్టణ ప్రజలకు స్వామివారి దర్శన సౌకర్యం ఏర్పాటు చేశారు.

ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం 3:30 గంటల నుండి నాలుగు గంటల వరకు ఆలయ శుద్ధి మంగళవాయిద్యాలు, అనంతరం స్వామి వారి సుప్రభాతం జరుగుతుంది. ఉదయం నాలుగు ముప్పై నుండి ఆరు గంటల వరకు ప్రాతఃకాల పూజలు, అనువంశిక అర్చకులకు దర్శన సౌకర్యం ఏర్పాటు చేశారు.ఈ క్రమంలో ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు.సాయంత్రం నాలుగు గంటలకు శివదీక్ష తీసుకున్న స్వాములకు దర్శన సౌకర్యం, సాయంత్రం 6 గంటల 5 నిమిషాలకు శ్రీ స్వామివారికి మహాలింగార్చన కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి 11 గంటల 35 నిమిషాలకు లింగోద్భవ కాలంలో స్వామివారికి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు.ఈ కార్యక్రమం జరుగుతున్న క్రమంలో భక్తులకు దర్శన సౌకర్యం నిలిపివేస్తారు.సోమవారం ఉదయము సుప్రభాత సేవ మరియు ప్రాతఃకాల పూజ అనంతరం భక్తుల మొక్కుబడుల ఆర్జిత సేవలు ప్రారంభమవుతాయి. జాతర ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ప్రత్యేక అధికారులను నియమిస్తు వివిధ ప్రాంతాలలో బాధ్యతలను కేటాయించారు. జాతర ఉత్సవాలలో పాల్గొనే భక్తుల వసతి సౌకర్యం కోసం చలువ పందిళ్లను, పెండల్స్ ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.తాత్కాలిక బస్టాండ్,బారికేడ్లు, పార్కింగ్ స్థలాల ఏర్పాటు చేశారు. మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు,శనివారం నుండి సోమవారం వరకు మూడు రోజులపాటు ఆలయ గుడి చెరువు ప్రాంగణంలో శివార్చన సాంస్కృతిక కార్యక్ర మాల కోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి అలంకరణ, లైటింగ్, విద్యుద్దీపాలు ఏర్పాటు చేసారు.యాత్రికులు బస చేసే ప్రాంతాలలో మంచినీటి నల్లాలు,చలి వేంద్రాలు ఏర్పాటు చేశారు.భక్తుల సౌకర్యార్థం మొబైల్ టాయిలెట్లు, తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం జనరేటర్లను సిద్ధంగా ఉంచారు. పారిశుధ్య నిర్వహణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

### స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అదివారం ఉదయం 8 గంటలకు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. శనివారం సాయంత్రం 5 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

### ఆలయ గుడి చెరువులో శివోహం కార్యక్రమం

శివరాత్రి జాతరకు వచ్చే భక్తుల కోసం ఆలయ గుడి చెరువులో శివోహం కార్యక్రమాన్ని రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నుండి సోమవారం వేకువజాము వరకు జాతీయ, అంతర్జాతీయ, స్థానిక కళాకారులతో కళా ప్రదర్శనలు నిర్వహించేందుకు వేదికను ఏర్పాటు చేశారు. వేదిక వద్ద ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణ,భారీ పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు.

### అన్నదాన కార్యక్రమాలు ప్రారంభం..

మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తుల కొరకు వాసవి క్లబ్బు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. నేడు మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు అల్పాహారం మాత్రమే అందజేస్తమని నిర్వాహకులు తెలిపారు. సోమవారం యదవిదిగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తమన్నారు. రాజన్న ఆలయ గుడి చెరువు ప్రాంగణంలో ఆలయం ఆధ్వర్యంలో కూడా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### భక్తుల సౌకర్యం ఉచిత బస్సులు ప్రారంభం:

జాతరకు భక్తులు సుదూర ప్రాంతాల నుండి వచ్చే వారి కోసం ప్రధాన బస్ స్టాండ్ నుండి ఆలయ గుడి చెరువు వరకు, కోరుట్ల బస్టాండ్ నుండి ఆలయ గుడి చెరువు వరకు భక్తుల ఉచిత రవాణా కొరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో 10 బస్సులను ఏర్పాటు చేయగా వాటిని శనివారం ఇన్చార్జి జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ ప్రారంభించారు.

### ఇన్చార్జి జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో పర్యవేక్షణ

మహాశివరాత్రి జాతర ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగర్వాల్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే, ఆర్డీవో రాధబాయ్ ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షణలో జాతర ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా స్థాయి అధికారులు తమకు కేటాయించిన విధుల్లో విధులు నిర్వహిస్తూ సమన్వయంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పట్టణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటన్నిటికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అక్కడి నుండి అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

## మొయినాబాద్ చైర్మన్ పీఠం కోసం

# కిడ్నాప్ రాజకీయాలు?

- హంగ్ ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్ కుట్రలు
- బీఆర్ఎస్ కౌన్సిలర్లను రాత్రికి రాత్రి తిప్పుకుంటున్నారు : అల్లం శ్రీనివాస్ రెడ్డి
- ఎమ్మెల్యే కాలే యాదయ్య ఎక్కడ?



**మొయినాబాద్, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** మొయినాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో హంగ్ ఏర్పడిన నేపథ్యంలో చైర్మన్ పదవి కోసం రాజకీయ పావులు వేగంగా కదులుతున్నాయి. స్పష్టమైన మెజారిటీ లేని కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందని బీఆర్ఎస్ నాయకుడు అల్లం శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన కౌన్సిలర్లను రాత్రికి రాత్రి తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ నాయకులు 'కిడ్నాప్ రాజకీయాలు' ప్రారంభించారని మండిపడ్డారు. "ఇది రాజకీయ ఆకర్షణ కాదు.. ఇది ప్రజాస్వామ్యాన్ని బందీ చేయడం" అని ఆయన ఘాటుగా విమర్శించారు. ప్రజలు ప్రజాస్వామ్య బద్ధంగా కాంగ్రెస్‌ను తిరస్కరించి బీఆర్ఎస్‌ను గెలిపించారని, అయినా చైర్మన్ సీటు కోసం సిగ్గులేకుండా మా కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఓటర్ల గౌరవాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో తీవ్ర అన్యాయం జరుగుతుండటంతోనే తాను బీఆర్ఎస్‌లో చేరానని గుర్తు చేస్తూ, ఇప్పుడు అదే అన్యాయ రాజకీయాలు మొయినాబాద్‌లో బయటపడుతున్నాయని విమర్శించారు. ఇటీవల స్పీకర్ బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని స్పష్టం చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య పాత్రపైనా ప్రశ్నలు సంధించారు. "బీఆర్ఎస్ అభ్యర్థులను ఇలా కిడ్నాప్ చేస్తుంటే కాలే యాదయ్య ఎక్కడ ఉన్నారు? పార్టీ తరఫున స్పందన ఎందుకు లేదు?" అని నిలదీశారు. మొయినాబాద్ రాజకీయాల్లో ఈ ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. చైర్మన్ ఎన్నికల ముందు చోటుచేసుకున్న ఈ పరిణామం స్థానిక రాజకీయాలను మరింత వేడెక్కించింది.

# పురపీఠం ఎవరి వరించేనో



**ముగ్గురు కౌన్సిలర్ల చేరికతో మ్యాజిక్ ఫిగర్ దాటిన కాంగ్రెస్..**

## చైర్మన్ పీఠం ఆశిస్తున్న ముగ్గురు కౌన్సిలర్లు

- వైస్ చైర్మన్ కు తీవ్రపోటీ..
- ప్రభుత్వ విప్ నిర్ణయమే శిరోధార్యం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :**

వేములవాడ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అత్యధిక స్థానలు గెలిచిన కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పదవి దక్కించుకోవడం ఖాయం అయిపోయింది. ఇద్దరు స్వతంత్రులు కుమ్మరి శిరీష, ఏళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ కౌన్సిలర్ నరాల శేఖర్ కాంగ్రెస్ పార్టీలోకి పోవడంతో చైర్మన్ పదవి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ కాంగ్రెస్‌కు దాటింది. ఈ క్రమంలో ఈ నెల 16 న నిర్వహించనున్న చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక కోసం కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. ఈ క్రమంలో చైర్మన్ పీఠం కోసం ప్రధానంగా ముగ్గురు అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నట్లో ప్రచారం కొనసాగుతుంది 15 వ వార్డు నుంచి గెలుపొందిన పుల్కం రాజు ముందు వరుసలో ఉండగా, 14 వార్డు నుంచి గెలుపొందిన తూమ్ మధు తీవ్ర పోటీ ఇస్తున్నట్లు వినికిడి. వీరితో పాటు మరో అభ్యర్థి 22 వార్డు నుంచి గెలుపొందిన యిప్పపుల మమత అజయ్ సైతం చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ దృష్టికి తమ మనసులోని మాటను తీసుకెళ్లడంతో పాటు సహచర కౌన్సిలర్ల మద్దతు కూడ కట్టుకునే ప్రయత్నంలో ముగ్గురు నిమగ్నమైనట్లు వేములవాడలో చర్చలు కొనసాగుతున్నాయి.

**వైస్ చైర్మన్ పదవికి తప్పని తీవ్ర పోటీ..**

వైస్ చైర్మన్ పదవి కోసం సైతం ఆశిస్తున్న వారి సంఖ్య కాంగ్రెస్ పార్టీలో ఎక్కువగా ఉంది. పార్టీలో సీనియర్ నాయకులు తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాగా పార్టీలో చేరిన స్వతంత్ర అభ్యర్థి కుమ్మరి శిరీష ముందు వరుసలో ఉన్నట్లు వినికిడి. మరో వైపు బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్లో చేరిన నరాల శేఖర్ సైతం వైస్ చైర్మన్ పదవి ఆశిస్తున్నట్లు ఆయన సన్నిహితులు తెలుపుతున్నారు. ఆధ్యాత్మిక పట్టణం కావడం , రాజన్న ఆలయ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి వేగంగా కొనసాగుతున్నడంతో వైస్ చైర్మన్ పదవి దక్కించుకోవాలనీ అయన తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

**విప్ నిర్ణయమే శిరోధార్యం..**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపును ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ పూర్తి స్థాయిలో అభ్యర్థుల గెలుపు కొరకు తన భుజస్కందాలపై వేసుకున్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో గడప గడపకు తిరుగుతూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ, వేములవాడ ఆలయ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి గురించి ఇంటింటికి వెళ్లి వివరించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిర్ణయమే శిరోధార్యం అని గెలిచిన కౌన్సిలర్ అభ్యర్థులు చెబుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వ విప్ ఎవరి పేరు సూచిస్తే వారికే తమ మద్దతు ఉంటుందని కౌన్సిలర్లు చెపుతున్నట్లు సమాచారం.

# ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యలపై పోరాడతాం

- బ్రహ్మాండ విజయానికి ప్రజలకు కృతజ్ఞతలు
- కాంగ్రెస్ కుట్రలు ఎదుర్కొని 28 సీట్లు
- ఓటుకు నోటు కేసు స్పీడప్ చేస్తా : ఎంపీ ధర్మపురి అరవింద్



**నిజామాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ పీఠంపై ఉత్కంఠకు తెరదించారు నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అరవింద్. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడతామని స్పష్టం చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పట్టారని, ప్రజాతీర్పును శిరసా వహిస్తామని అన్నారు. 40 శాతం పైగా మైనారిటీలు ఉన్నప్పటికీ బీజేపీకి 28 సీట్లు రావడం గర్వ కారణమని పేర్కొన్నారు. బ్రహ్మాండమైన విజయాన్ని అందించిన నిజామాబాద్ ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్‌ను ఇంటి నుంచి ఎత్తుకుపోవడానికి ఏసీపీ, ఎస్సైలు ఉంటారా.. అందుకే వారికి జీతాలిస్తున్నారా అంటూ పోలీసులపై మండిపడ్డారు. తనపై కేసు కాదు.. తానే పోలీసులపై కేసు పెట్టాలని అన్నారు. ఓటుకు నోటు కేసు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. ఆ కేసును స్పీడప్ చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రే ఆ కేసులో ముద్దాయిగా ఉన్నారని ఆరోపించారు. కార్పొరేటర్లను ఎత్తుకుపోతే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. మున్సిపల్ ఫలితాలపై సంతోషంగా, గర్వంగా ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని, కాంగ్రెస్-ఎంఐఎం ఒకటేనని ముందే చెప్పామని గుర్తు చేశారు. ఈ ఐదేళ్ల మున్సిపల్ కాలపరిమితి ముగిసే లోగా నిజామాబాద్ పేరు ఇందూరుగా మారడం ఖాయమని అన్నారు. ఆర్మూరు ఫలితాలపై విశ్లేషణ చేస్తున్నామని తెలిపారు. పదవుల కోసం కాంగ్రెస్ ఆత్మాభిమానం చంపుకుంటోందని, అక్బరుద్దీన్ తిట్టినా వారితో కలవాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో కోవర్టులు, పార్టీ ద్రోహులను క్షమించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ఒక బ్రోకర్ పార్టీ అని వ్యంగంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నుంచి ఎవరైనా వస్తామంటే అది వారి ఇష్టమని అన్నారు. సాంకేతికంగా ఓడినా బీజేపీ బలం పెరిగిందని స్పష్టం చేశారు. సమావేశం లో నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# కుల,మతాంతర వివాహితులను ఆదర్శభారతీయులుగా గుర్తించాలి

**ఓయూ తెలుగు విభాగం ప్రిన్సిపల్ సి.కాశీం**



**ముషీరాబాద్, ఫిబ్రవరి 14 (జనం సాక్షి):** కులాంతర మతాంతర వివాహాలు చేసుకున్న వారిని వారి పిల్లల్ని ఆదర్శ భారతీయులుగా గుర్తించాలని, నో క్యాస్ట్ నో రిలీజియన్ అనే కాలం కూడా ఉండాలన్న హైకోర్టు తీర్పును అన్ని రంగాల్లో అమలు చేయాలని ఓయూ తెలుగు విభాగం ప్రిన్సిపల్ సి.కాశీం డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రేమికుల రోజును పురస్కరించు కొని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి కార్యదర్శి స్కైలాబ్ బాబు అద్యక్షత న కుల, మతాంతర దంపతులకు అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రిన్సిపల్ సి.కాశీం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల, మతాంతర వివాహాల పరిరక్షణకు ఒక సమగ్రమైన చట్టం ప్రభుత్వపరంగా తీసుకురావాలని కుల దురహంకారా చ్యులకు పాల్పడిన వారిని ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కుల సమస్యను పాఠ్యాంశాల్లో చేర్చి కుల నిర్మూలన మార్గాలను ప్రతి పాదించాలన్నారు. భారతదేశంలో ఉన్న నిచ్చెన మెట్ల ను కొలువస్తలేదు, మనం కులము, మతము వేలునుకుని ఉన్న, ఈ కాషాయ కాలుష్యం సమాజం నడుమ ఉన్నామనీ, కుల నిర్మూలన జరగాలంటే రక్త సంక్రమణ జరగాలని అంబేద్కర్ చెప్పిన అంశాలను చేర్చి కుల రహిత సమాజానికి దారులు వేయాలని సూచించారు. ఎస్ వి కె కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14 న లోకమంతా ప్రేమను ఒక పూల గుచ్ఛంగానో గ్రీటింగ్ కార్డుగానో చూస్తుందేమో కానీ మేము మా కేంద్రం ప్రేమంటే సామాజిక సాంస్కృతిపై ఒక యుద్ధంగా చూస్తున్నామన్నారు. అనేక కుల మతలను వివాహాలను ప్రోత్సహించేందుకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హాలును ఉచితంగా ఇస్తున్నామనీ చెప్పారు. భవిష్యత్తులో కులం నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. చీకటి రాజ్యానికి ప్రేమంటే భయం, ఎందుకంటే ప్రేమ ఉన్నచోట ద్వేషం బతకదు, ద్వేషం లేని చోట కులమత కుళ్ళు రాజకీయాలు నడవవు అందుకే ప్రేమ అసలైన ప్రజాస్వామ్యాన్ని నిర్వచిస్తుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమం ప్రతి సంవత్సరానికి రెండుసార్లు ఇలాంటి కుటుంబాలని ఒకచోట కలవాలని, ఒక కొత్త సంస్కృతిని నిర్మించాలనీ, సమాజం నుంచి ఎదురయ్యే ప్రతి సవాళ్లను ఎదుర్కోవాలని జంటలకు సూచించారు. అవాజ్ కార్యదర్శి యండి అబ్బాస్ మాట్లాడుతూ కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించేట్లు జంటల కు ప్రోత్సాకాన్ని కనీసం ప్రభుత్వం 5 లక్షల ఇవ్వాలని కోరారు. ఇలాంటి వివాహాలు చేసుకున్న వారిని రక్షించేట్లుగా ఒక పరిరక్షణ చట్టం తీసుకురా వాలని ప్రతిపాదించారు. కుల దురహంకార హత్యలు నివారణకు ఒక శాశ్వత కమిషన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కారం చేయాలనీ, ఒక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి తగినన్ని నిధులు కేటాయించాలనీ, డిమాండ్ చేశారు. మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేష్ మాట్లాడుతూ మనుస్మృతి అనే చీకట్ల కమ్ముకుంటున్న ఈ సమయంలో కుల మతాంతర వివాహితులకు ఈ సభ పెద్ద భరోసాను కల్పించి, ఆత్మ స్థైర్యం నింపి కొత్త సంస్కృతిని నిర్మించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, గుత్తా జ్యోత్స్న, మానవ వికాస సమితి అధ్యక్షుడు సాంబశివరావు లు హాజరైన ఆదర్శ దంపతులకు అభినందనలు తెలిపి, చేనేత కండువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

# మేడిపల్లి పీఎస్ పరిధిలో గంజాయి విక్రేతల అరెస్ట్

**కేసు నమోదు రిమాండ్‌కు తరలింపు**



**బోడుప్పల్-జనంసాక్షి :** పోలీసుల వాహనాల తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పద వ్యక్తుల నుండి గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో శనివారం జరిగింది. మేడిపల్లి సీఐ ఆర్ గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శనివారం మేడిపల్లి పోలీసులు బోడుప్పల్ సర్కిల్ లోని ఇందిరా నగర్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టగా వారి వద్ద దొరికిన బ్యాగులో గంజాయి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు పర్వతపుర్ కు చెందిన అదెలా సాయి తేజ (33),పీర్జాదిగూడ కు చెందిన రుద్ర సాయి (27)బోడుప్పల్ ఇందిరా నగర్ కు చెందిన దామరోళ్ల భాస్కర్ (19) లను అదుపులోకి తీసుకుని వారి నుండి 45 గ్రాముల గంజాయి, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత బ్రతుకు అగమవుతుందని కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆరోగ్యం దెబ్బతిని అనేక రకాల ఇబ్బందులు వస్తున్నాయని యువత మత్తు పదార్థాల జోలికి వెళ్ళకుండా ఉండాలని అన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు సేవించినట్లుగా,విక్రయించినట్లుగా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా డయల్ 100 ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు.

# మీ బంగారం ఎంత నాణ్యత?

- బంగారంలో మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులు
- అమాయకపు ప్రజలకు బురిడీ కొట్టిస్తున్న బంగారు వ్యాపారస్తులు



**పిట్లం ఫిబ్రవరి 14(జనం సాక్షి) :** పిట్లం మండల కేంద్రంలోని ఓ బంగారు దుకాణంలో రెండు తులాల నెక్లెస్‌ను నిజాంసాగర్ మండలానికి చెందిన కొనుగోలుదారుడు కొనుగోలు చేశారు. ఇంటి అవసరాల నిమిత్తం కొనుగోలుదారుడు నక్లెస్ ను విక్రయానికి సదురు బంగారు దుకాణానికి నెక్లెస్ ను తీసుకెళ్లాడు. సదురు దుకాణ యజమాని ఆల్ మార్క్ సెంటర్‌కు పంపగా అందులో 80% ఉన్నట్లు నిర్ధారణ అయింది. కొనుగోలుదారుడు కాదు 10 గ్రాముల కు 1 గ్రాము మాత్రమే అని అన్నాడు.వాళ్లు ఆశించినంత మేరకు డబ్బులు ఇచ్చేందుకు సదురు దుకాణ యజమాని నిరాకరించాడు. రసీదు ఉండడంతో అమ్మిన బంగారం వ్యాపారి పై బంగారు వెండి వర్తక సంఘంలో ఫిర్యాదు చేశాడు. బంగారు ఆభరణాల కొనుగోలులో ఎందరో అమాయకులు రైతులు మోసపోతున్నారు. పెద్ద ఎత్తున సొమ్ము కోల్పోతున్నారు. అయినా తూనీకలు కొలతల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు వినియోగదారులను నిలువునా మోసగిస్తున్నారు. బంగారం ధర రోజు రోజుకు పెరిగి పోతుండడంతో అంతే రీతిలో మోసాలు ఎక్కువయ్యాయి ప్రధానంగా గ్రామీణ ప్రాంత వాసులు నిత్యం వశీచనుకు గురి అవుతున్నారు ఇటు వినియోగదారులనేకాక అటు జీరో వ్యాపారంతో పన్ను ఎగ్గొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. బంగారు ఆభరణం తయారు చేసేందుకు కొంత రాగి కలుపుతారు. అయితే నాణ్యత తెలిపే ఆల్ మార్క్ విషయంలో వినియోగ దారులను మోసగిస్తున్నారు. 24 క్యారెట్ల బంగారం ఆభరణం అంటూ 22 క్యారెట్ల ఆభరణాన్ని కట్టబెడుతున్నారు. అవగాహన లేని జనం పెద్ద ఎత్తున మోసపోతున్నారు. బంగారం నాణ్యత పరిశీలించే క్యారెట్రైజేషన్ యంత్రం వాడటం లేదు.

**హాల్ మార్క్ తప్పనిసరి**

బంగారు ఆభరణాలకు సంబంధించి హాల్ మార్క్ ద్వారా స్వచ్ఛత నాణ్యత తెలుస్తుంది. ఆల్ మార్క్ లేనట్లయితే మోసాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. 24 క్యారెట్ల బంగారంలో ఇతర లోహలేమి ఉండవు 22 క్యారెట్ల బంగారు ఆభరణాలు రెండు తులాల శాతం రాగి, జింక్ ఉంటుంది. ఆల్ మార్క్ వేసిన కేంద్రం గుర్తు తయారైన సంవత్సరం ఆంగ్ల అక్షరం కోడ్ ఉంటుంది.



## జాతీయ సమైక్యత శిబిరానికి ఆల్ఫోర్స్ విద్యార్థిని ఎంపిక

- కేరళలో ఫిబ్రవరి 17 నుంచి 23 వరకు శిక్షణ
- స్వచ్ఛ భారత్, సృజనాత్మకతపై ప్రత్యేక శిక్షణ
- హరిణికి చైర్మన్, ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందనలు

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :** ఈ నెల 17 నుంచి 23 వరకు కేరళలోని మరియన్ కాలేజీ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ కొట్టాయంలో జరిగే జాతీయ సమైక్యత శిబిరానికి ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ రాగుల హరిణి శాతవాహన యూనివర్సిటీ తరఫున ఎంపికైంది. కళాశాల కరస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డి ఈ విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, శిబిరంలో స్వచ్ఛ భారత్‌తో పాటు వివిధ సృజనాత్మక అంశాలపై శిక్షణ ఇస్తారని అన్నారు. హస్తకళలు, నృత్యం, సంగీతం, జానపద కళలు వంటి అంశాల్లో విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరుస్తారని తెలిపారు. భాషా భావవ్యక్తీకరణను పెంపొందించడంతో పాటు బృంద చర్చలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన రాగుల హరిణికి చైర్మన్ వి. రవీందర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోలి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎన్. రజిత, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


# నిమ్స్‌లో ఘనంగా సేవలాల్ జయంతి వేడుకలు

**పాల్గొన్న నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప**



**ఖైరతాబాద్, ఫిబ్రవరి 14 (జనం సాక్షి) :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లోని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో సేవలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుక లు నిమ్స్ పాత భవనంలోని లెర్నింగ్ సెంటర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప, పా ల్గొని శ్రీ సేవలాల్ మహారాజ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ శ్రీ సేవలాల్ మహారాజ్ జీవితం సమాజానికి ఆదర్శ ప్రాయమని అన్నారు. ఆయన బోధనలు సత్యం, సేవ, సమానత్వం వంటి విలువలకు ప్రతీకలని అన్నారు. ఇటువంటి ఆధ్యా త్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల్లో ఐక్య తను పెంపొందించడమే కాకుండా, సామాజిక బాధ్యతను మరింత బలపరుస్తాయని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ప్రద ర్శించిన బంజారా సంప్రదాయ పాటలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతివీర్, డా. శ్రీభూషణ్ రాజు, డా.గంగాధర్, డా.వంశీకృష్ణ, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్య గౌడ్, శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షురాలు కేజియా, సభ్యులు బిడుగు శేఖర్, సేవలాల్, వెంకట రత్నం పాల్గొన్నారు. నిమ్స్ ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్‌రాజ్**


**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :**

రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో అర్చకులు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ కు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు ప్రసాదాలు అందించారు. రాజన్న ఆలయ పనుల ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి.

రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన ఫోటోలు పరిశీలించారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని అయన ఆదేశించారు.రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులు, ఆర్కిటెక్ట్ మూర్తి, కాంట్రాక్టర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రధాన ఆలయ విస్తరణ,ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు.పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సమన్వయంతో పరిష్కరించాలన్నారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని, నూతన గోశాల నిర్మాణం,ఇతర అంశాలపై చర్చించారు. ఇప్పుడు ఉన్న గోశాలలో ఎన్ని కోడెలు ఉన్నాయని ఆరా తీశారు. వాటి సంరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్‌కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేసి వివరించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ సీఈ రాజేశ్వర్,ఎస్ఈ రాములు ఈఈ నరసింహాచారి, ఆలయ ఈఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన మరో ఇద్దరు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు

- కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో చేరిన 17, 39వ డివిజన్ కార్పొరేటర్లు.
- బీజేపీతో సంప్రదింపులు చేస్తున్న మరో ఆరుగురు కార్పొరేటర్లు.
- మేయర్ ఎన్నిక నాటికి బీజేపీ బలం అనూహ్యంగా పెరిగే అవకాశం.



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) :**

కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందిన ఇద్దరు కార్పొరేటర్లు కొద్దిసేపటి క్రితం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ శనివారం రోజు హైదరాబాద్ కు విచ్చేసి బీజేపీలో చేరినట్లు ప్రకటించారు. వారిద్దరికీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. శుక్రవారం రోజు రాత్రి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే 1 ఇండిపెండెంట్, మరో ఏఐఎఫ్‌బీ కార్పొరేటర్ కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి విచ్చేసి బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. తాజాగా మరో ఇద్దరి చేరికతో బీజేపీ బలం 34కు చేరింది. ఎక్స్ అఫిషియో హోదాలో స్థానిక ఎంపీ బండి సంజయ్ కు కూడా ఒక ఓటు ఉంటున్నందున మొత్తం బీజేపీ బలం 35కు చేరింది. వీరు గాకుండా మరో ఆరుగురు కార్పొరేటర్లు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి మేయర్ పదవి దక్కడం ఖాయమైంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెందిన కార్పొరేటర్లు, ఇండిపెండెంట్ కార్పొరేటర్లు బీజేపీలో చేరే అంశంపై తర్జన భర్జన పడుతున్నారు. కరీంనగర్ లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుండి అధిక నిధులు వస్తుండటం, బీజేపీలో చేరితేనే తమ తమ డివిజన్ లో ఎక్కువ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మరింత దగ్గర కావొచ్చనే భావనతో బీజేపీ ముఖ్య నేతలతో మంతనాలు జరుపుతున్నారు. కాంగ్రెస్ గత రెండేళ్ల పాలనలో కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం, వంటి అంశాలను దృష్టిలో ఉంచుకున్న ఆయా కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరితే పెద్దగా ఒరిగేదేమీ ఉండదనే అభిప్రాయానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరే కార్పొరేటర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# కాంగ్రెస్ పార్టీది అహింసా సిద్ధాంతం

- రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క
- కేబీఆర్ పార్క్‌లో ఇండియన్ డాగ్ అడాప్షన్ కార్యక్రమం
- కుక్కపిల్లను దత్తత తీసుకున్న మంత్రి సీతక్క




హైదరాబాద్ (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీది అహింసా సిద్ధాంతమని రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ లో డాగ్ అడాప్షన్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క హాజరయ్యారు. కొండా సురేఖ చేతుల మీదుగా స్వదేశి కుక్కపిల్లను మంత్రి సీతక్క అడాప్ట్ చేసుకుని ఆదర్శంగా నిలిచారు. ఎంపీ రేణుక చౌదరి మంత్రి సీతక్క చేతుల మీదుగా కుక్క పిల్లను ఆడాప్ట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నగర నడిబొడ్డున జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. స్ట్రే డాగ్స్‌ను దత్తత తీసుకోవడం ద్వారా వాటికి జీవించే హక్కును కల్పించడమే కాకుండా సమాజంలో మానవత్వాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అహింసా సిద్ధాంతాన్నే అనుసరించిందని ఆమె స్పష్టం చేశారు. అహింసా మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తుచేశారు. విశ్వాసానికి మారుపేరు కుక్క అని ఆమె అన్నారు. ఇంట్లో ఒక డాగ్ ఉంటే భద్రతా భావం కలుగుతుందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదని తెలిపారు. తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో కొందరు సర్పంచ్‌లు కుక్కలను చంపిన ఘటనలను ప్రస్తావిస్తూ, ఆ సంఘటనలను ప్రభుత్వం ఖండించిందని, సంబంధిత వారిపై చర్యలు కూడా తీసుకున్నామని మంత్రి సీతక్క తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఒక కుక్క ఉండేదని, పది మందితో సమానంగా ఒక కుక్క కాపలా కాస్తుందని ఆమె గుర్తుచేశారు. మన దేశంలో ఎన్నో స్వదేశీ డాగ్ బ్రీడ్స్ ఉన్నాయని, అందరూ ఇండియన్ డాగ్స్‌ను అడాప్ట్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రేణుకా చౌదరి, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, మాజీ కార్పొరేటర్ విజయా రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి



- సూర్యాపేట పట్టణాభివృద్ధికి అవిరళ కృషి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి): సూర్యాపేట పురపాలక సంఘాన్ని అవినీతి రహిత పురపాలక సంఘంగా తీర్చి దిద్దాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవు పలికారు. గతంలో సూర్యాపేట పురపాలక సంఘంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు పునరావృతం కాకుండా నూతన పాలక మండలి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఉద్బోధించారు. నూతనంగా ఎన్నికైన సూర్యాపేట మున్సిపాలిటీ కౌన్సిలర్లు హైదరాబాద్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సూర్యాపేట మున్సిపాలిటీలోని 48 వార్డులకు గాను 31 స్థానాలలో విజయం సాధించిన కౌన్సిలర్లను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి మీద ఉన్న సూర్యాపేట పట్టణం ఇప్పటి వరకు ఊహించిన మేరకు అభివృద్ధి సాధించలేక పోయిందన్నారు. పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ మీద చూపిన ఆదరణ అనన్య సామాన్యమైనదని, ప్రజలు మనమీద అపారమైన నమ్మకంతో గురుతర బాధ్యత మోపారని వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు పని చేయాలని అన్నారు. జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా సూర్యాపేట పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎప్పటికప్పుడు పట్టణాభివృద్ధిపై సమీక్షించుకుని ప్రత్యేక ప్రణాళికలు రూపొందిం చేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించుకుందామని పేర్కొన్నారు. అందుకు సరిపడా నిధులు తెచ్చి సూర్యాపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వర రావుతో పాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

# అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యం

- కొనసాగుతున్న గాలింపు చర్యలు



బెంగళూరు, ఫిబ్రవరి 14 (జనంసాక్షి) : అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యమయ్యాడు. కర్ణాటకకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య (22) ఫిబ్రవరి 9 నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అతడి కోసం పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు. సాకేత్ బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. అతడు చివరిసారిగా క్యాంపస్‌కు కిలోమీటరు దూరంలో ఉన్న లేక్ అంజా సమీపంలో కన్పించినట్లు తెలుస్తోంది. అక్కడ అతడి పాస్‌పోర్టు, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాక్‌ప్యాక్‌లను అధికారులు గుర్తించారు. అతడిని గుర్తించేందుకు స్నేహితులతో కలిసి స్థానిక అధికారులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సాకేత్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నామని, వారికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. అమెరికా అధికారులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

# చక్రం తిప్పిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

- కామారెడ్డిలో హంగ్‌తో అస్పష్టత



నిజామాబాద్, ఫిబ్రవరి14 (జనంసాక్షి) : టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సొంత మండలం భీంగల్‌లో చక్రం తిప్పారు. రెండు రోజుల ముందు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దీంతో ప్రజాపాలనకు జనం జైకొట్టారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి భీంగల్ మున్సిపాలిటీని సవాల్‌గా తీసుకున్నా సక్సెస్ కాలేకపోయారు. బీఆర్ఎస్ నాలుగు స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆర్మూర్ మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరేయడానికి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సర్వశక్తులు ఒడ్డినా 8 చోట్ల మాత్రమే గెలుపు సాధించగలిగారు. 19 స్థానాలు దక్కించుకొని కాంగ్రెస్ మ్యాజిక్ ఫిగర్ సొంతం చేసుకుంది. రెబెల్స్ పోటీలో లేకుంటే మరో మూడు వార్డులు కాంగ్రెస్ కు దక్కేవి. బీఆర్ఎస్ 5 స్థానాలు, మజ్లిస్ ఒక చోట గెలువగా ఇండిపెండెంట్‌లుగా పోటీ చేసిన ముగ్గురు రెబెల్స్ విజయం సాధించారు. 38 వార్డులున్న బోధన్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ 17 వార్డులు కైవసం చేసుకుంది. రెబెల్స్‌తో కొన్ని వార్డుల్లో పార్టీకి నష్టం వాటిల్లింది. మజ్లిస్ గత వైభవాన్ని చాటుతూ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 3 వార్డులకే పరిమితమైంది. బీఆర్?ఎస్? ఐదు వార్డులు గెలువగా కాంగ్రెస్ రెబెల్ ఒకచోట విజయం సాధించారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్‌కుంద మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ వచ్చింది. బాన్సువాడలో 19 వార్డులకుగాను 11 , ఎల్లారెడ్డి వార్డులకు 10, బిచ్‌కుందలో 12 వార్డులకు 10 వార్డులను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కామారెడ్డి మున్సిపాలిటీల్లో ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. మ్యాజిక్ ఫిగర్ చేరుకునేందుకు ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఆయా పార్టీలకు ఇండిపెండెంట్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు కీలకం కానున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు

- కాంగ్రెస్ అక్రమాలతో గెలుపు
- మాజీమంత్రి తలసాని శ్రీనివాసయాదవ్



సిద్దిపేట, ఫిబ్రవరి14 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ పలు దౌర్జన్యాలకు పాల్పడిందని, డబ్బులు, మద్యం ఏరులై పారించిందని మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్దాల పునాదులు మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్లలాగా కాంగ్రెస్ గెలిచిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారని కొనియాడారు. రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు. ప్రజలు శాశ్వతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ టికెట్ పెట్టి పురుషులకు డబుల్ రెట్లు పెంచారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారని, రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టమని, తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్ లు నిర్మించారని తెలిపారు. గతంలో నీరు, విద్యుత్ లేక రైతులు ఇబ్బంది పడ్డారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారని గుర్తు చేశారు. తాను టీడీపీ లో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేదని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వంలో కుదేలయింది ని, కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయని అన్నారు. సిద్దిపేటను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారని ప్రశంసించారు.

# అత్తాపూర్‌లో అడ్వకేట్ దారుణ హత్య

- కిరాతకంగా హత్య చేసిన బావమరుదులు



హైదరాబాద్, ఫిబ్రవరి14 (జనంసాక్షి) : నగరంలోని అత్తాపూర్‌లో అడ్వకేట్ మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యకు గురయ్యారు. సులేమాన్ నగర్‌లోని తన సొంత ఆఫీసులో అడ్వకేట్‌పై కత్తులతో దాడి చేశారు. ఖదీర్‌ను మొదటి భార్య తమ్ముళ్లు అతి కిరాతకంగా చంపేశారు. పలుమార్లు కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడిన ఖదీర్.. సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. దాడి జరిగిన వెంటనే నిందితులు పరారయ్యారు. అడ్వకేట్ ఖదీర్‌కు రెండు పెళ్లిళ్లు జరిగాయి. రెండో పెళ్లి చేసుకోవడంతో.. ఖదీర్ మొదటి భార్య ఇంటికి రావడం మానేశాడు. ఈ కోపంతో బావ ఖదీర్‌పై.. ఇద్దరు బామ్మర్దులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఖదీర్ ఆఫీస్‌లో ఉన్న సమయంలో అక్కడకు వచ్చిన వారు.. మొదట రాడ్‌తో దాడి చేశారు. తలపై బలంగా కొట్టడంతో మహమ్మద్ ఖదీర్ కుప్పకూలిపోయాడు. ఆపై కత్తులతో ఆరుసార్లు పొడిచారు. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు.. తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాల సేకరిస్తోంది. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. అడ్వకేట్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.










Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370